


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


డబ్ల్యూపీఎల్ విజేత బెంగళూరు మెరిసిన స్మృతి మంధాన 19

టీటీడీ ఈవోగా రవిచంద్ర నేడు బాధ్యతల స్వీకరణ 10


### సాగునీటి సంఘాల పనులకు..

## జీఎస్టీ మినహాయింపు




- ప్రతీ ఎకరాకు తాగునీరు అందేలా కృషి
- సాగునీటి సంఘాలే ఒక సైన్యం.. తలుచుకుంటే రాష్ట్రం సస్యశ్యామలం
- అనంతపురం జిల్లాను పండ్లతోటల వనంగా మార్చిన ఘనత ఎన్డీఏదే
- రాయలసీమ ఎత్తిపోతల పేరిట మళ్లీ వైసీపీ డ్రామాలు
- ప్రజలను మరోసారి మభ్యపెట్టే ప్రయత్నాలు
- సాగునీటి సంఘాల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2

### తిరుమల లడ్డూ విషయంలో

# వైసీపీది మహాపాపం



- శ్రీవారి పవిత్రత దెబ్బతీసేందుకే కుట్ర
- కల్తీ నెయ్యి సరఫరాపై 2022లో వచ్చిన నివేదికను తొక్కిపెట్టారు
- భగవంతుడు అంటే లెక్క లేదు...హిందూమతం పట్ల విశ్వాసం లేదు
- ఈ వ్యవహారాన్ని వదిలి పెట్టం..దోషులపై చర్యలు తీసుకుంటాం
- కల్తీ వ్యవహారంలో తప్పును అంగీకరించకపోగా క్లీన్ చిట్ అంటూ తప్పుడు ప్రచారం
- కరడు గట్టిన నేరస్థులే అసత్యాన్ని నిజంగా నమ్మించే ప్రయత్నం చేస్తారు
- ఎన్డీఏ కూటమి హిందువుల సెంటిమెంట్‌ను పరిరక్షిస్తుంది
- కూటమి తరపున ప్రజలకు వాస్తవాలు వివరిస్తాం
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

*తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైసీపీ నేతలు అడ్డగోలుగా బుకాయించినంత వాస్తవాలు మారతాయా అని ఏపీ సీఎం చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు. దేవుడితో పెట్టుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తిరుమల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తప్పుచేసి దాని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు వైసీపీ నేతలు తిరిగి మాపైనే దుష్ప్రచారం చేస్తున్నారు. బూతులు తిట్టినా మేం భరించాలా.. దోషులను అన్ని విధాలుగా శిక్షిస్తాం. నెయ్యి కల్తీపై 2022లో నివేదిక వస్తే అప్పటి పాలకులు ఎందుకు తొక్కిపెట్టారు? తప్పు జరుగుతోందని తెలిసి కూడా దాన్ని కొనసాగించారు. ఎన్డీడీబీ నివేదికలోని అంశాన్నే నేను ప్రస్తావించా. వైసీపీ నేతలకు దేవుడంటే లెక్కలేనితనం. ఇంతవరకు చరిత్రలో వెంకన్నస్వామి జోలికి ఎవరూ రాలేదు. దేవుడికి అపచారం జరిగినప్పుడు ముక్తకంఠంతో ఖండించాల్సిన బాధ్యత మనపై ఉంది. తిరుమల పవిత్రతను కాపాడతాం. ఈ అంశంపై పీఠాధిపతులతోనూ చర్చించి ముందుకు వెళతామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.*

3

### ఎమ్మిగనూరులో

## నేడు సీఎం చంద్రబాబు పర్యటన

### - మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

అమరావతి (చైతన్యరథం): కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం పర్యటించనున్నారు. కలుగట్లలో జరిగే మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో భాగంగా నిర్వహించే పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పాల్గొంటారు. శుక్రవారం ఉదయం క్యాంప్ ఆఫీస్ నుంచి బయలుదేరి 11.30 గంటలకు కలుగట్ల చేరుకుంటారు. గ్రామసభలో పాస్ పుస్తకాల పంపిణీ అనంతరం, ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడతారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో పర్యటించి మధ్యాహ్నం 2 గంటలకు రైతులతో ముఖాముఖి చర్చిస్తారు. చివరిగా కలుగట్లలో జరిగే పార్టీ క్యాడర్ మీటింగ్‌కు హాజరవుతారు. సాయంత్రం 5.30 గంటలకు తిరిగి అమరావతి చేరుకుంటారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున రాష్ట్రంలో మొత్తం 279 గ్రామాల్లో కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని ప్రభుత్వం చేపట్టింది. ప్రస్తుతం 1,16,870 డ్రాఫ్ట్ పాస్‌బుక్స్ సిద్ధంగా ఉన్నాయి. వీటిలో 91,038 డ్రాఫ్ట్ పాస్‌బుక్స్ ఈ-కేవైసీ కూడా పూర్తయ్యింది. కర్నూలు జిల్లాలోని 13 గ్రామాల్లో 8,347 మంది రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందించనుంది. కలుగట్ల గ్రామంలో 1,178 మంది రైతులకు శుక్రవారం కొత్త పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నారు.

### అసంఘటిత కార్మికులకు...

# సంక్షేమ పథకాల పునరుద్ధరణ

- కార్మికులకు ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ
- విదేశాల్లో ఉద్యోగావకాశాలు పొందేలా చూడాలి
- సంజీవనితో అనుసంధానించి వైద్య పరీక్షలు
- కార్మికశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

4



## రాయలసీమ అభివృద్ధిపై చర్చకు జగన్ సిద్ధమా?



- ఎవరు ఏం చేశారో అసెంబ్లీలో చర్చిద్దాం
- ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేందుకే దొంగ దీక్షలు
- సీమ పేరుతో వేల కోట్లు దోచుకున్న వైఎస్ కుటుంబం
- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజం

7

## కల్తీ నెయ్యి అని తెలిసీ..మహాపచారం!

- తిరుమల లడ్డూకి వినియోగించిన నెయ్యి.. పాల నుంచి వచ్చింది కాదని సీబీఐ తేల్చింది
- కల్తీ నెయ్యి కేసులో సిట్ క్లీన్ చిట్ ఇవ్వలేదు
- తప్పు చేసినవారు ఏడుకొండలవాడికి క్షమాపణ చెప్పి తీరాలి
- కల్తీ నెయ్యి దోషుల్ని కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

4



## పామాయిల్ అ'ధర'హో!



- సాగు చరిత్రలో తొలిసారి తెలంగాణకన్నా ఏపీలోనే అధిక ధర
- గిట్టుబాటు ధరతో కూటమి ప్రభుత్వ నిర్ణయాలపై రైతుల హర్షం
- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడికి పామాయిల్ రైతుల ప్రత్యేక కృతజ్ఞతలు
- రైతులకు రికార్డు ధర లభించిందన్న మంత్రి అచ్చెన్న

6

చైతన్యరథం



## సాగునీటి సంఘాల పనులకు..

# జీఎస్టీ మినహాయింపు

- ప్రతీ ఎకరాకు తాగునీరు అందేలా కృషి
- సాగునీటి సంఘాలే ఒక సైన్యం.. తలుచుకుంటే రాష్ట్రం సస్యశ్యామలం
- అనంతపురం జిల్లాను పండ్లతోటల వనంగా మార్చిన ఘనత ఎన్డీఏదే
- రాయలసీమ ఎత్తిపోతల పేరిట మళ్లీ వైసీపీ డ్రామాలు
- ప్రజలను మరోసారి మభ్యపెట్టే ప్రయత్నాలు
- సాగునీటి సంఘాల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): ప్రతీ ఎకరాకు సాగునీరు అందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సాగునీటి సంఘాలు చేసే పనులకు జీఎస్టీ లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఒకప్పుడు రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న ఏపీని సమర్థ పాలన, నిర్దిష్ట ప్రణాళికలతో రైతు సానుకూల రాష్ట్రంగా మార్చామని స్పష్టం చేశారు. గురువారం అమరావతిలోని నేలపాడు వద్ద ఉన్న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన నీరు-ప్రగతి, జల హారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ముందుగా సమావేశ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ మన జీవన విధానంలో నీరు చాలా ముఖ్యమన్నారు. రాయలసీమలో ఊట కాల్వలు ఉండేవి. వాటిలో నీరు సమృద్ధిగా ఉండటంతో పంటలు పండేవి. కాలక్రమంలో నీటిపై నిర్లక్ష్యంతో సమస్యలు వచ్చాయి. సీమ ఎడారిగా మారుతుందని చాలామంది అనేవారు. సీమను రతనాల సీమ చేయాలని ఎన్టీఆర్ సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ సహా అనేక ప్రాజెక్టులు రావడానికి నాడు తెలుగుదేశం పార్టీ చూపిన చొరవే కారణం. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నీరు-చెట్టు వంటి కార్యక్రమాలు చేపట్టాం. భూగర్భ జలాలు పెంచేందుకు ఇంకుడు గుంతలు సహా అనేక కార్యక్రమాలు చేపట్టాం. దేశంలోనే తక్కువ వర్షపాతం నమోదయ్యే రెండో జిల్లాగా ఉన్న అనంతపురం నేడు పండ్ల తోటల వనంగా మారిందంటే అందుకు ప్రభుత్వ దూరదృష్టే కారణం. ఒక్క ఏడాదిలోనే 10 లక్షల ఇంకుడు గుంతలు తవ్వాం. మైక్రో ఇరిగేషన్ కింద 90 శాతం సబ్సిడీ ఇచ్చి పండ్ల తోటలకు శ్రీకారం చుట్టాం. రాయలసీమను రతనాల సీమగా చేసే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వానిది. భవిష్యత్‌లో సీమకు బంగారు భవిష్యత్ ఉంటుంది. హార్టికల్చర్ పై శ్రద్ధ పెట్టాం. నీటిని మనం సమర్థవంతంగా ఉపయోగించుకుంటే కరువు అనే మాటే వినపడదు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలి. పరిగెత్తే నీటిని నడిపించాలి. నడిచే నీటిని నిలబెట్టాలి. నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి. ఒకప్పుడు సీమ అంటే నీరు లేని ప్రాంతం. ఇప్పుడు కోస్తాంధ్రతో పోటీ పడి నీటి వృద్ధి చెందుతోందని సీఎం చెప్పారు.

### క్షేత్రస్థాయిలో సాగునీటి సంఘాల పనితీరు బాగుంది

ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చేలా తాగు నీటి సంఘాల అధ్యక్షులు కృషి చేయాలి. సమర్థ నీటి వినియోగంలో రైతుల భాగస్వామ్యం కీలకం. ఈ ఉద్దేశంతోనే 1997లో దేశంలోనే మొదటిసారిగా సాగు నీటి సంఘాలు ఏర్పాటు చేశాం. ఈ వ్యవస్థ ద్వారా 14 లక్షల నీటి సంరక్షణ కట్టడాలు నిర్మించాం. ఎంతో ప్రాధాన్యత కలిగిన సాగునీటి సంఘాలు గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. గత పాలకులు సాగునీటి సంఘాలు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారు. ఎన్డీఏ ప్రభుత్వంలో వారి బిల్లులన్నీ క్లియర్ చేశాం. 2024 డిసెంబర్లో 6,047 నీటి వినియోగదారుల సంఘాలకు, 267 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 58 ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించాం. నీటి సంఘాల అధ్యక్షులు పనులు సమర్థవంతంగా చేస్తున్నారు. నీటి వినియోగదారుల సంఘాలకు చెందిన ప్రతినిధులు 60 వేల మంది ఉన్నారు. సాగునీటి సంఘాల ప్రతినిధులంతా ఓ సైన్యంలా తలుచుకుంటే రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయగలరు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.344 కోట్లతో 7,197 ఆపరేషన్ అండ్ మేనేజ్మెంట్ పనులు రైతు సంఘాల ద్వారా చేపట్టాం. సాగు నీటి నిర్వహణ పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగించే పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. కాలువల నిర్వహణ, నీటి పన్నుల వసూలు, వివాదాల పరిష్కారంలో నీటి వినియోగదారుల సంఘాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇస్తాం. సమర్థ నీటి నిర్వహణతో జలాశయాలు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది నారు మళ్లకు మే 15 నాటికే నీరు అందిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### ప్రతి ఎకరాకు నీరు.. నిజమైన జలహారతి

నదుల అనుసంధానం జరిగి, ప్రతి ఎకరాకు నీరు ఇవ్వగలిగితే అదే నిజమైన జల హారతి. 2014-19 మధ్య సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాం. సాగునీటిపైనే రూ.68 వేల కోట్లు ఖర్చు చేశాం. వ్యవసాయానికి 900 టీఎంసీలు, పరిశ్రమలకు 40 టీఎంసీలు, తాగునీటి కోసం 200 టీఎంసీల నీరు అవసరం. ప్రతీ ఏటా 1300 టీఎంసీల నీటితో మన రాష్ట్ర అవసరాలు తీరతాయి. మన రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయి. వీటన్నిటిలో 1300 టీఎంసీలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలం. ఈ ఏడాది 862 టీఎంసీల నీరు మన జలాశయాల్లో ఉంది. మన ప్రాజెక్టులను ఈ ఏడాది గరిష్ఠంగా 91 శాతం మేర నింపాం. ప్రస్తుతం మన జలాశయాల్లో రూ. 846 టీఎంసీల మేర నీటి నిల్వలు ఉన్నాయి. ఏపీ జీవనాడి పోలవరాన్ని గత ప్రభుత్వం గోదావరిలో కలిపేసింది. దుర్మార్గపు పాలనలో నిర్లక్ష్యం వల్ల డయాఫ్రం వాల్ దెబ్బతిని అదనంగా రూ.1000 కోట్లు ఖర్చు అయ్యింది. సమయం కూడా వృథా అయ్యింది.

### పోలవరం సాకారం

కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2027 జూన్ కంటే ముందే పోలవరం కల సాకారం చేసి జాతికి అంకితం చేస్తాం. పోలవరం పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతాం. పట్టి సీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరిచ్చాం. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ మార్చి లోగా పూర్తి చేసి అనకాపల్లి, విశాఖకు నీరు అందిస్తాం. తారకరామ తీర్థసాగర్ సహా అన్ని ప్రాజెక్టులు రాబోయే మూడేళ్లలో పూర్తి చేసి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తాం. గోదావరి నీళ్లు వంశధారకు అనుసంధానం చేస్తాం. పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్‌కు తీసుకెళ్తాం. గత పాలకులు వెలిగొండ పూర్తి చేసినట్టు భ్రమ కల్పించారు. ఈ సీజన్ లోనే ప్రాజెక్టును పూర్తి చేసి కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం

ఈ ఏడాది గోదావరి నుంచి 5000 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోయింది. 200 టీఎంసీల వరద జలాలు పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తీసుకొస్తాం. తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం నిర్మిస్తుంటే మేము ఏనాడూ అడ్డు చెప్పలేదు. ఇదే తరహా స్పందనను తెలంగాణ నుంచి కోరుకుంటున్నాం. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు చిత్తూరు, మడకశిరకు తీసుకొచ్చాం. రాష్ట్రంలోని అన్ని చెరువులు నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయి. అప్పుడు కరువు అనే మాట వినపడదు. మొన్నటి వరకూ ఇంజనీర్లే ప్రణాళికలు తయారు చేసేవారు. నేడు మన సాగునీటి సంఘాల అధ్యక్షులు కూడా ఇంజనీర్లుగా మారాలి. వినూత్న ఆలోచనలతో నీటి సమస్యలు పరిష్కరించాలి. గత పాలకులు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ చేసి మహాపాపం చేశారు. ఘోర అపచారం చేశారు. రసాయనాలతో నెయ్యి తయారు చేసి ప్రసాదంలో వినియోగించారని తేలింది. వారు చేసిన అపచారం క్షమార్హం కాదు. కూటమి అధికారంలోకి వచ్చాక 20 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయి. 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ప్రధాని మోదీ, మిత్రుడు పవన్ కల్యాణ్‌తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక పెద్ద ఎత్తున మన రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయి. రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకెళుతోంది. మిత్రుడు పవన్ కల్యాణ్ తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం.


### మళ్లీ మభ్యపెట్టే ప్రయత్నాలు

ఇతరులపై బురద జల్లడం వైసీపీ వాళ్లకు అలవాటైంది. రాయలసీమ ఎత్తిపోతల అంశంతో మళ్లీ ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రారంభించిన ఆ ప్రాజెక్టును ఎన్జీటీ నిలిపేసింది. అప్పుడు పట్టించుకోకుండా ఇప్పుడు మళ్లీ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. మచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా అన్ని ప్రాంతాలకూ నీరందిస్తాం. బ్రహ్మంసాగర్, గండికోట, చెర్లోపల్లి, తదితర ప్రాజెక్టులకు నీరు రావటం ఎన్డీఏ ఘనతే. సీమలో నీటి ఇబ్బందులు రాకుండా చూస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నీటి వినియోగదారుల సంఘాల సమావేశానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



# తిరుమల లడ్డూ విషయంలో
# వైసీపీది మహాపాపం

- శ్రీవారి పవిత్రత దెబ్బతీసేందుకే కుట్ర
- కల్తీ నెయ్యి సరఫరాపై 2022లో వచ్చిన నివేదికను తొక్కిపెట్టారు
- భగవంతుడు అంటే లెక్క లేదు... హిందూమతం పట్ల విశ్వాసం లేదు
- ఈ వ్యవహారాన్ని వదిలి పెట్టం.. దోషులపై చర్యలు తీసుకుంటాం
- కల్తీ వ్యవహారంలో తప్పును అంగీకరించకపోగా క్లీన్ చిట్ అంటూ తప్పుడు ప్రచారం
- కరడు గట్టిన నేరస్థులే అసత్యాన్ని నిజంగా నమ్మించే ప్రయత్నం చేస్తారు
- ఎన్డీఏ కూటమి హిందువుల సెంటిమెంట్‌ను పరిరక్షిస్తుంది
- కూటమి తరపున ప్రజలకు వాస్తవాలు వివరిస్తాం
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంతో డబ్బు దోచుకోవడంతో పాటు శ్రీవారి పవిత్రత దెబ్బతీయాలనేదే గత పాలకుల అసలైన కుట్ర అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భగవంతుడు అంటే లెక్క లేదు... హిందూమతం అంటే విశ్వాసం లేదని, కల్తీ నెయ్యి వ్యవహారంలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమల లడ్డూ విషయంలో మహా పాపం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రులు లోకేష్, సత్యకుమార్, పార్థసారథి, ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. భేటీ అనంతరం ఉమ్మడిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారం ప్రజలు, భక్తుల మనోభావాలకు సంబంధించిందన్నారు. గత పాలనలో శ్రీవారి ప్రసాదం విషయంలో అపచారం చోటు చేసుకుంది. ఏడు కొండలవాడికి రెండు కొండలు చాలు అని నాడు అన్నారు.

గత పాలనలో తిరుమల విషయంలో ఘోర అపచారానికి పాల్పడ్డారు. భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. 2022లో సీఎఫ్‌టీఆర్ఐ చాలా స్పష్టంగా కల్తీ జరుగుతోందని చెప్పినా పట్టించుకోకుండా యథేచ్ఛగా కొనసాగించారు. అదే కల్తీ నెయ్యిని వాడిన లడ్డూను లక్షల మంది భక్తులకు ప్రసాదంగా ఇచ్చి గత పాలకులు మహా పాపానికి పాల్పడ్డారు. గత ఐదేళ్లలో లడ్డూ ప్రసాదం తినాలంటేనే భక్తులు భయపడిన పరిస్థితి ఉండేది. మానసికంగా ఇబ్బందులు పడ్డారు. 2022లో వచ్చిన నివేదికను తొక్కిపెట్టారు. ఉద్దేశపూర్వకంగా అక్రమాలు చేయడానికే గత పాలకులు నాటి నివేదికను దాచేశారు. గతంలో పని చేసిన చైర్మన్ పీఏ రూ.4 కోట్ల డబ్బులు లంచంగా తీసుకున్నారని సీఎం వెల్లడించారు.

### నాడు తెలిసే తప్పు చేసి.. నేడు ఎదురు దాడి

అధికారంలోకి వచ్చాక అన్ని రంగాల్లో ప్రక్షాళన చేయటంలో భాగంగా తిరుమల పవిత్రతను కాపాడేలా చర్యలు తీసుకున్నాం. నెయ్యి ట్యాంకర్ల నుంచి శాంపిళ్లు తీయించాం. శాంపిళ్లు తీసి ఎన్డీడీబీకి పంపాం. ఇక సీబీఐ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ నివేదిక చూస్తే కేవలం రసాయనాలు, పామాయిల్‌తో నెయ్యి తయారు చేసినట్టు వెలుగు చూసింది. భగవంతుడు అంటే లెక్కలేనితనంగా వ్యవహరించారు. హైందవం పట్ల జగన్‌కు విశ్వాసం లేదు. తిరుమల లడ్డూ విషయంలో దుర్మార్గం, మహాపాపం చేశారు. చరిత్రలో శ్రీవేంకటేశ్వర స్వామితో ఎవరూ ఆటలాడుకోలేదు. బ్రిటీషర్లు కూడా సంప్రదాయాలు, ఆచారాలను గౌరవించారు. వాళ్లకంటే హీనంగా గత పాలకులు వ్యవహరించారు. నాడు లడ్డూ కల్తీకి పాల్పడిందే కాక ఇప్పుడు మళ్లీ ఎదురుదాడి చేసి, జరిగిన ఘటనను డైవర్ట్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. సీబీఐ నివేదికలో కల్తీ లేదని ఎక్కడా నిర్ధారించలేదు. కరడు గట్టిన నేరస్థులు అసత్యాన్ని కూడా నిజంగా నమ్మించేందుకు ప్రయత్నిస్తారు. ఇప్పుడు వైసీపీ అదే పని చేస్తోంది. ఏ ల్యాబ్‌లో అయినా ఒకే తరహా నివేదిక వచ్చింది. టీటీడీ బోర్డు చైర్మన్‌కు, పర్చేజ్ కమిటీకి తెలిసే ఈ నిర్ణయాలు జరిగాయి. ఇప్పుడు వాళ్లే ఎదురు దాడి చేస్తున్నారు. దౌర్జన్యం, రౌడీయిజం చేయాలనుకుంటే మీ ఆటలు సాగవు.

గత పాలనలో అంతర్వేది రథం తగలబెడితే, రామతీర్థంలో విగ్రహం ధ్వంసం చేస్తే చర్యలు తీసుకోకుండా తిరిగి మాపైనే ఆరోపణలు చేశారు. బూతులు తిట్టినా భరించాను. వారు ఏం చేసినా నిస్సహాయంగా మిగిలిపోవాలా? నాడు వివేకానందరెడ్డిని హత్య చేసి నాపై ఆరోపణలు చేశారు. ఇప్పుడు శ్రీవారి ప్రసాదం కల్తీ చేసి మళ్లీ ఆరోపణలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. భక్తుల విశ్వాసం, నమ్మకంపైనా దాడి చేస్తున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు.

### పరకామణి చోరీని సెటిల్మెంట్లు చేస్తారా?

జగన్ మోహన్ రెడ్డికి వేంకటేశ్వరస్వామిపై భక్తి ఉంటే డిక్లరేషన్‌పై ఎందుకు సంతకం పెట్టలేదు? అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా డిక్లరేషన్‌పై సంతకం చేశారు. టీటీడీ నిబంధనల ప్రకారం అన్య మతస్తులు డిక్లరేషన్‌పై సంతకం చేయాల్సిందే. డిక్లరేషన్ ఇవ్వకుండా ఇష్టానుసారం వ్యవహరించిన వ్యక్తులు మాపై నిందారోపణలు వేస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన దోషులు ఎవరైనా, ప్రజల మనోభావాలతో ఆడుకున్న వారిని ఉపేక్షించే సమస్యే లేదు. మానవ సేవే..మాధవ సేవ అంటాం. అలాంటి ఆ భగవంతుడి ప్రసాదాన్నే కల్తీ చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి పవిత్రతను దెబ్బతీయడానికి కావాలనే చేసిన పనిగా మేం భావిస్తున్నాం. పామాయిల్, లాక్టిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్ లాంటి రసాయనాలు ప్రసాదంలో ఉన్నప్పుడు మహాపాపం కాదా? ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడానికి వీళ్లెవరు. ప్రశ్నిస్తే ఎదురు దాడి చేస్తారా? ఇష్టప్రకారం చేస్తాను అనే వ్యక్తులకు ప్రజలే సమాధానం చెబుతారు. 219 ఆలయాలపై గత పాలకులు దాడి చేసి అపవిత్రం చేసే ప్రయత్నం చేశారు.

శ్రీవారి పరకామణిలో చోరీ కేసులో సెటిల్మెంట్ చేసే ప్రయత్నం చేస్తారా? ఇదెక్కడి విడ్డూరం? జరిగిన తప్పును సమర్థించేసి సెటిల్ చేయాలని ప్రయత్నం చేసే వ్యక్తులను ఏమనాలి. నెయ్యి కల్తీ జరగలేదని సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందని నివేదికలో ఎక్కడుంది? ఏమైనా కలకన్నారా. క్షమించరాని మహాపాపం చేశారు. ఈ మహాపాపాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించలేం. ఉద్దేశపూర్వకంగానే శ్రీవేంకటేశ్వర స్వామిని అపవిత్రం చేయడానికి కుట్ర చేశారు. అన్ని నివేదికలనూ ప్రజల ముందే ఉంచుతాం. తిరుమల శ్రీవారి పవిత్రతను కాపాడు కోవటం మనందరి బాధ్యత. ఈ తరహా విషయాలను ముక్తకంఠంతో ఖండించాలి. తిరిగి ఈ తరహా మహాపచారం చేయాలంటే భయపడాలి. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని వదిలి పెట్టబోం. దోషులను కఠినంగా శిక్షించడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుం టుంది. తిరుమల పవిత్రతను కాపాడతాం, అదే మాధవ సేవ. ఈ అంశంపై పీఠాధిపతులలోనూ చర్చించి ముందుకు వెళతామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

### బూతులు తిడితే సహించాలా?

ఇష్టానుసారంగా బూతులు మాట్లాడితే సహించాలా? అసెంబ్లీలో నా కుటుంబంపై మాట్లాడిన బూతుల కారణంగా జీవితంలో తొలిసారి నేను కన్నీళ్లు పెట్టుకున్నాను. ఇప్పుడు మళ్లీ అదే తరహాలో నన్ను విమర్శిస్తున్నారు. బూతులు తిట్టిన వారిని వెనకేసుకొస్తున్నారు. ఇదీ వారి నైజం. నేను శ్రీవారి భక్తుడ్ని. శ్రీ వేంకటేశ్వర స్వామి మా ఇంటి కులదైవం. 2003లో టీటీడీలో ప్రాణదానం కార్యక్రమం చేపట్టాం. శ్రీవారి కృపతోనే 23 క్లైమోర్ మైన్స్ దాడి నుంచి బయపడ్డాను. శ్రీ వేంకటేశ్వర స్వామి తనకు పునర్జన్మ ఇచ్చారని సీఎం చంద్రబాబు చెప్పారు.

## అపోలో ప్రతాప్ రెడ్డికి సీఎం జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి (చైతన్యరథం): అపోలో హాస్పిటల్స్ స్థాపన ద్వారా ఆరోగ్య సంరక్షణను పునర్నిర్వచించిన ప్రతాప్ సి. రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మంచి ఆరోగ్యంతో మానవాళి సేవలో



మరిన్ని సంవత్సరాలు ప్రభావవంతంగా పనిచేసే శక్తిసామర్థ్యాలను ఆ భగవంతుడు ప్రసాదించాలని సీఎం ఆకాంక్షించారు.

# అసంఘటిత కార్మికులకు...
# సంక్షేమ పథకాల పునరుద్ధరణ

- కార్మికులకు ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ
- విదేశాల్లో ఉద్యోగావకాశాలు పొందేలా చూడాలి
- సంజీవనితో అనుసంధానించి వైద్య పరీక్షలు
- కార్మిక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు



అమరావతి(చైతన్యరథం): అసంఘటిత రంగంలో ఉన్న భవన నిర్మాణ, ఇతర కార్మికులకు గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రసూతికి రూ.20 వేలు, వివాహానికి రూ.40 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేల మేర ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం కార్మిక శాఖపై సమీక్షనిర్వహించిన ముఖ్యమంత్రి అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల్లో ఆధునిక నైపుణ్యాలను, జీవన ప్రమాణాలను పెంచే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలు ఎల్ అండ్ టీ, ఎన్సీసీ, మిట్టల్ సహా వేర్వేరు సంస్థల సహకారంతో వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆధునిక నైపుణ్య శిక్షణ ద్వారా ఏపీలోని కార్మికులు దేశవిదేశాల్లో ఉపాధి అవకాశాలను దక్కించుకుని అధిక ఆదాయాన్ని ఆర్జించేలా చూడాలని సూచించారు. జిల్లాల వారీగా, రంగాల వారీగా కార్మికుల డేటా బేస్‌ను రూపొందించాలని.. వారిలో నైపుణ్యాల స్థాయిని అంచనా వేయాలని కార్మికశాఖకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ డేటా బేస్‌ను అనుసంధానించటంతో పాటు కార్మికులు లేటరల్ ఎంట్రీ ద్వారా వివిధ కోర్సులు అభ్యసించి ఉన్నత విద్యార్హతను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిగ్ వర్కర్లు, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల ఆదాయాలు గణనీయంగా పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

సిమ్యులేషన్ ల్యాబ్స్ సహా ఆధునిక శిక్షణ నైపుణ్యాల ద్వారా ఉత్పాదకత పెంచే అంశంపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. వివిధ రంగాలకు అవసరమైన ఆధునిక పనిముట్లను కూడా కార్మికులకు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఏపీలో ఉన్న కార్మికుల్లో సాంకేతిక పరమైన నైపుణ్యాలు పెరిగితే అధిక ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని 20లక్షల మంది కార్మికులకు నైపుణ్యాలు పెంచేందుకు అనువుగా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో స్కిల్డ్ లేబర్‌ను తయారు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న వివిధ భారీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కూడా మన యువతకు అవసరమని ఆయన అన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులను మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లగానూ ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సంజీవనితో అనుసంధానించి కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీతో పాటు కార్మికశాఖ ద్వారా రూ.2.5 లక్షల వరకూ ఉచిత వైద్య చికిత్సలు ఆపై ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా భరించేలా చూడాలని స్పష్టం చేశారు. గతంలో కార్మికుల సంక్షేమం కోసం కన్‌స్ట్రక్షన్ వర్కర్ వెల్ఫేర్ ఫండ్‌ను టీడీపీ ప్రభుత్వహయాంలోనే ఏర్పాటుచేశామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కార్మికుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆ శాఖ కార్యదర్శి ఎం.వి.శేషగిరిబాబు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కల్తీ నెయ్యి అని తెలిసీ.. మహాపచారం!

- తిరుమల లడ్డూకి వినియోగించిన నెయ్యి.. పాల నుంచి వచ్చింది కాదని సీబీఐ తేల్చింది
- కల్తీ నెయ్యి కేసులో సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వలేదు
- కల్తీ లడ్డూలనే ఆయోధ్య రామమందిర విగ్రహ ప్రతిష్ఠకు పంపారు
- ఇది హిందూ విశ్వాసాలపై దాడి
- తప్పు చేసినవారు ఏడుకొండలవాడికి క్షమాపణ చెప్పి తీరాలి
- భగవంతుడి ముందు దోషులు మోకరిల్లే వరకూ యుద్ధం ఆగదు
- కల్తీ నెయ్యి దోషుల్ని కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదు
- దేవుడి మీద పగపట్టిన వారు మట్టికొట్టుకుపోతారు
- సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



అమరావతి (చైతన్యరథం): ఏడుకొండలవాడికి రెండు కొండలు చాలు అన్న ఆలోచనా విధానం నుంచి,శ్రీ వెంకటేశ్వరస్వామికి ఉన్నది రెండే కొండలు అన్న వారసత్వం నుంచి పుట్టినవారు తిరుమల పవిత్రతను దిగజార్చేందుకు ఏ స్థాయికైనా దిగజారుతారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. వారు భగవంతుడి మీదే పగపట్టారన్నారు. భగవంతుడి మీద పగ పట్టిన వారు మట్టికొట్టుకుపోతారన్నారు. కల్తీ నెయ్యి కేసులో సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వలేదు. లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యి అసలు పాల నుంచి తయారు చేసిందేకాదని రిపోర్టులో పేర్కొన్నట్టు చెప్పారు. గురువారం క్యాంపుకార్యాలయంలో పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్,టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఇతర మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అయ్యారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో పవన్ మాట్లాడుతూ చేసిన తప్పుకి క్షమాపణ కోరకుండా ఎదురు మమ్మల్ని క్షమాపణ చెప్పమని బుకాయిస్తున్నారని మండిపడ్డారు. ఇది హిందూ విశ్వాసాల మీద జరిగిన దాడి. తప్పు చేసినవారు ఏడుకొండల వాడికి క్షమాపణ చెప్పి తీరాల్సిందే.కల్తీ నెయ్యి కేసులో దోషుల్లో ఏ ఒక్కరినీ కూటమి ప్రభుత్వం వదలదని పవన్ హెచ్చరించారు.

మతం, ధర్మం చాలాలోతైన అంశాలు.చాలా సున్నితమైనవి కూడా. అలాంటి వ్యవహారాల్లో ఒక్క మాట మాట్లాడాలన్నా చాలాఆలోచించి మాట్లాడాలి. ముఖ్యమంత్రి, మేము కూడా మాట్లాడే సమయంలో సంయమనంతో,ఎలాంటిపర్యవసానాలు ఎదుర్కోవాలి అన్నది ఆలోచించే మాట్లాడుతామని పవన్ స్పష్టం చేశారు.

### దేవాలయాలపై దాడులు జరిగితే పిచ్చోడి పనన్నారు

2019 నుంచి 2024 వరకు జరిగిన వైసీపీ పాలనలో ఎన్నో దేవాలయాలపై దాడులు జరిగాయి. అన్నీ మతపరంగా సున్నితమైన అంశాలే. రామతీర్ధంలో శ్రీరాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేస్తే ఎవరో ఆకతాయి చేశాడు. పిచ్చోడు చేశాడని చెప్పారు. పిఠాపురంలో దేవతా విగ్రహాలకు అశుద్ధం పూస్తే అదీ పిచ్చోడి పనే అన్నారు. కనకదుర్గమ్మ ఆలయంలో వెండి సింహాలు చోరికీ గురైతే కొత్తవి కొనుక్కోవచ్చంటూ తేలికగా మాట్లాడారు. అంతర్వేదిలో రథం తగులబెడితే అదీ ఎవరో పిచ్చోడి పనే అన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు 219కి పైగా జరిగాయి. ఒక్క అంశంలోనూ సరైన చర్యలు తీసుకున్నది లేదు. ఇలాంటి అంశాల్లో ఏ రోజూ రాజకీయ ప్రయోజనాల గురించి తాము ఆలోచించలేదని పవన్ తెలిపారు.

### జంతు కొవ్వు ఉందని ఎన్‌డీడీబీ రిపోర్టు చెప్పింది

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పాదాల చెంత పెద్ద ప్రమాదం నుంచి పునర్జన్మ పొందిన చంద్రబాబు నాయుడు ఇలాంటి అంశాల్లో చాలా అప్రమత్తంగా మాట్లాడుతారు. ఎన్నికల అనంతరం ఎన్డీఏ పక్షాల సమావేశంలో ఆయన కల్తీ నెయ్యికి సంబంధించి నేషనల్ డెయిరీ డెవలప్ మెంట్ బోర్డు(ఎన్‌డీబీబీ) రిపోర్టును మా అందరికీ చదివి వినిపించారు. ఒక రిపోర్టులో విజిటెబుల్ ఆయిల్స్ ఉన్నాయని ఉంది. వాళ్లు ఏ స్థాయిలో కల్తీకి పాల్పడ్డారనే విషయం చెబుతూ అసలు ఆ ద్రావకంలో నెయ్యే లేదని, ఫిష్ ఆయిల్, బీఫ్ ఆయిల్, పంది కొవ్వు లాంటివి ఉన్నాయని రిపోర్టులో ప్రస్తావించారు. ఇది చాలా సున్నితమైన అంశం. ఈ అంశాన్ని బయటపెట్టే ముందు చాలా ఆలోచించాం. పర్యవసానాలు ఎలా ఉంటాయి అని ఆలోచించే ముందుకు వెళ్లాం. చెప్పకపోతే తెలిసీ ఎందుకు మాట్లాడలేదు అన్న ప్రశ్న ఎదుర్కోవాల్సి వస్తుంది. రాజకీయ ప్రయోజనాల కోసం మాట్లాడాం అనుకోవడానికి అప్పుడే అధికారంలోకి వచ్చాం. ఐదేళ్లు మేమే అధికారంలో ఉంటాం. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రాజకీయం చేయాల్సిన అవసరం మాకు ఏం ఉంటుంది. విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లపోతే మాదే తప్పు అవుతుందని మాత్రమే ఆలోచించాం. హైందవ సంస్కృతిని అపవిత్రం చేసినప్పుడు మాట్లాడకపోవడం తప్పనిపించి గొంతు విప్పాం. వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. విచారణ జరపాలనుకున్నామని పవన్ వివరించారు.

### నెయ్యే లేకుండా లడ్డూ ప్రసాదం చేసి బుకాయింపులు

ఏ నివేదిక చూసినా- వారు నెయ్యి అని చెబుతున్నదానిలో అసలు నెయ్యే లేదని తేలింది. తప్పు చేసినవారు మాత్రం జంతువుల కొవ్వు లేదని చెప్పి బుకాయిస్తున్నారు. వైసీపీ హయాంలో తిరుమల శ్రీవారి ప్రసాదాలకు 59.70 లక్షల కేజీల నెయ్యి వాడితే అందులో 58 లక్షల కేజీలు పామ్ ఆయిల్, మిగిలింది కెమికల్స్. విచారణలో వాటి కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులు దొరికాయి. సీబీఐ నివేదికలో ఈ నెయ్యి - పాల కొవ్వులతో చేసింది కాదు అని స్పష్టంచేసింది. అందులో ఏమున్నాయన్నది నిర్ధారించలేకపోతున్నాం అని మాత్రమే చెప్పింది. ఎన్‌డీడీబీ రిపోర్టులో జంతువుల కొవ్వు కలిసిందని స్పష్టంగా ఉంది. నెయ్యి లేకుండా లడ్డూలు చేసి ఎదురు మాట్లాడుతున్నారు. 2019 నుంచి 2024 మధ్య నువ్వుల నూనె ధరే రూ. 180 నుంచి రూ. 268 ఉంది. వీరు నెయ్యి కిలో రూ. 319, రూ. 320కి కొనుగోలు చేశామంటే సాధారణ గృహిణిని అడిగినా అందులో కల్తీ ఉందని చెప్పేస్తారు. ఈ పాపం చేసిన వారికి హిందూ ధర్మం మీద గౌరవం లేదు. అలా అని ఛార్జ్‌షీట్‌లో ఉన్న పేర్లు చూస్తే అందరూ హిందూ మతానికి చెందిన వారే ఉండటం దురదృష్టకరమని పవన్ అన్నారు.

### కల్తీ జరిగిందని 2022లోనే తెలిసినా రిపోర్టు తొక్కిపెట్టారు

ఇక్కడ అంతా హిందువుల మనోభావాల గురించే మాట్లాడుతున్నాం. ఆయోధ్య రామమందిర నిర్మాణం ఎలాంటి పరిస్థితుల మధ్య జరిగిందో దేశంలో ప్రతి ఒక్కరికీ తెలుసు. అలాంటి రామమందిరం విగ్రహ ప్రతిష్టకు పంపిన లక్ష లడ్డూలు ఇదే కల్తీ నెయ్యితో చేసినవి. తప్పు చేసి క్షమాపణ అడగకుండా ఎదురు మమ్మల్నే క్షమాపణ కోరమని అడుగుతున్నారు. భగవంతుడి మీద పగపట్టినవాడు బతికిన దాఖలాలు లేవు. వై.ఎస్.వివేకానందరెడ్డిని చంపేశారని చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారు. వీళ్లేమో అది గుండెపోటని చెబుతారు. వెండి విగ్రహాలు పోతే పోనీ అంటారు. నెయ్యిలో కల్తీ జరిగింది అంటే కల్తీయే లేదని వాదిస్తారు. ఏడుకొండల వాడికి రెండు కొండలు చాలన్న ఆలోచనా విధానం నుంచి పుట్టిన వారు ఏ స్థాయికైనా దిగజారుతారు. హిందూ ధార్మిక విలువల పరిరక్షణ వ్యవహారంలో కూటమి ప్రభుత్వం వెనకడుగు వేయదు. నెయ్యి కల్తీ వ్యవహారంలో ఏ మతాన్ని కించపర్చడం లేదు. 2022లోనే నెయ్యిలో కల్తీ ఉందన్న వ్యవహారం బయటపడితే ఆ ల్యాబ్ నివేదికను తొక్కి పెట్టారు. అన్నీ తెలిసే అయోధ్యకి కల్తీ నెయ్యితో చేసిన లడ్డూలు పంపారు. ఇది విశ్వాసాల మీద జరిగిన దాడి. తప్పు చేసిన వారు భగవంతునికి మోకరిల్లే వరకు మా యుద్ధం కొనసాగుతుందని పవన్ స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటి, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేష్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.








# జలం.. మన బలం

**- నీరు-ప్రగతి-జలహారతి..**

## సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

అమరావతిలో 'నీరు-ప్రగతి-జలహారతి.. సాగునీటి సంఘాల భాగస్వామ్యం' కార్యక్రమంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. జలం- మన బలం నినాదంతో కరవురహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహించారు. నీటి భద్రత, నిర్వహణ, భూగర్భజలాల పెంపుపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయంలో ఉపయోగించే డ్రోన్లు, రిమోట్ కంట్రోల్ ద్వారా ఆపరేట్ చేసే వ్యవసాయ మోటార్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. వివిధ ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి వివరాలను సీఎం తెలుసుకున్నారు. భూగర్భ జలాలు, రీఛార్జ్ స్ట్రక్చర్ల నిర్మాణ అంశాలు పరిశీలించారు. అనంతరం నీటి వినియోగదారుల సంఘాలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, స్థానిక (తాడికొండ) ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.








## తిరుపతి లడ్డూ కల్తీలో..

# దోషులకు శిక్ష తప్పదు

- జగన్‌కు మంత్రి సవిత హెచ్చరిక
- కల్తీ నెయ్యి వ్యవహారం బట్టబయలవ్వడంతో వైసీపీలో వణుకు
- తప్పుల మీద తప్పులు చేస్తున్న వైసీపీ నాయకులు, శ్రేణులు
- కాపులకు జగన్ నమ్మకద్రోహం, 5 ఏళ్లలో కాపులను, బీసీలను పట్టించుకోని అంబటి, జోగి రమేష్
- కేసుల్లో ఇరుక్కున్నప్పుడు మాత్రం కులాల కార్డులు
- సీఎం చంద్రబాబుతోనే రాయలసీమ సస్యశ్యామలం
- సీమకు జగన్ చేసింది శూన్యం
- జగన్ చేసిన అన్యాయాన్ని సీమ ప్రజలు నిలదీయాలి



పెనుకొండ/శ్రీసత్యసాయి (చైతన్యరథం): మహాప్రసాదం వెంకన్న లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందనే విషయం బట్టబయలవ్వడంతో వైసీపీలో వణుకు ప్రారంభమైందని, ఈ ప్రమాదం నుంచి బయటపడదానికి బూతులు తిడుతూ డైవర్షన్ రాజకీయాలకు తెర తీశారని జగన్ పైనా, ఆ పార్టీ నాయకులపైనా రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. తప్పు మీద తప్పులు చేసి, కేసుల్లో ఇరుక్కున్నప్పుడు కులాల కార్డులు ఉపయోగిస్తూ వైసీపీ చేస్తున్న చిల్లర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. తిరుమల లడ్డూ కల్తీ కేసులో చట్టం తన పని చేసుకుపోతుందని, తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని మంత్రి సవిత స్పష్టంచేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. హిందువులు మహా ప్రసాదంగా భావించే తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందని స్వయంగా సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ స్పష్టం చేసిందన్నారు. వైసీపీ నాయకుల అవినీతితో హిందువులు మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారం బట్టబయలవ్వడంతో వైసీపీ నాయకులు బూతులు తిడుతూ, రప్పా రప్పా నరుకుతామంటూ డైవర్షన్ రాజకీయాలకు తెర తీశారన్నారు. ఆ కుట్రలో భాగంగానే సీఎం చంద్రబాబునాయుడిని, మంత్రి నారా లోకేష్‌ను వైసీపీ నాయకులు జోగి రమేష్, అంబటి రాంబాబు అసభ్య పదజాలంతో దూషించారన్నారు. వైసీపీ నాయకులు ఎంత రెచ్చగొట్టినా తాము సంయమనంతో ఉంటున్నామని, తమకు రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ముఖ్యమని మంత్రి సవిత తేల్చిచెప్పారు.

### కాపులకు జగన్ తీరని ద్రోహం

2019 ఎన్నికల ముందు కాపులను ఓటు బ్యాంకుగా జగన్ వాడుకున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. కాకిలాగా ఊరూరూ తిరుగుతూ, కాపులకు మేలు చేస్తానంటూ వారి ఓట్లను దండుకుని నమ్మక ద్రోహానికి పాల్పడ్డారన్నారు. నా బీసీలంటూ బడుగు బలహీన వర్గాలను సైతం ఓటు బ్యాంకుగా వాడుకుని, వారికి తీరని ద్రోహం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరవాత ఎస్సీ, ఎస్టీలపైనా, కాపులపైనా, బీసీలపైనా తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు పాల్పడ్డారన్నారు. అధికారం ఉందన్న అహంకారంతో తప్పు మీద తప్పులు చేసి, ఇప్పుడు కేసుల్లో ఇరుక్కున్నప్పుడు కులాల కార్డులు ఉపయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో బీసీలపై, కాపులపై అక్రమ కేసులు బనాయించినప్పుడు గాని, దాడులు చేసినప్పుడు గాని జగన్‌ను వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఎందుకు ప్రశ్నించలేదన్నారు. స్వయం ఉపాధి పథకాల్లేక, ఉద్యోగాల్లేక కాపు, బీసీ యువత రోడ్డున పడ్డప్పుడు జగన్‌ను ఎందుకు నిలదీయలేదన్నారు. రాజకీయ లబ్ధి కోసం కులం కార్డులు వాడుకుంటున్నారని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, వైసీపీ నాయకులను చూసి జనం అసహ్యించుకుంటున్నారని మంత్రి సవిత తెలిపారు.

### వైసీపీ శ్రేణులను రెచ్చగొడుతున్న జగన్

తమ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా పాలిస్తోందని, తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి ఘటనలో చట్టం తన పని తాను చేసుకుపోతోందని, సుప్రీంకోర్టు పరిధిలో ఉన్న ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. తాము తలుచుకుంటే, ఈ 18 నెలల కాలంలో వైసీపీ నాయకులు బయటకు రాగలిగేవారా...జగన్ పరామర్శలు చేసేవారా.. అని ప్రశ్నించారు. ప్రజలకు పారదర్శక పాలన అందిస్తూ, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులకే అందేలా నిరంతరం ప్రజల మధ్య ఉంటున్నామన్నారు. తమకు, తమ ప్రభుత్వానికి కక్ష సాధింపు రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. వైసీపీ హయాంలో సీఎం చంద్రబాబును, మంత్రి లోకేష్‌ను, ఆయన తల్లి భువనేశ్వరమ్మను అంబటి, జోగి రమేష్ సహా ఎందరో వైసీపీ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేస్తూ, ఇష్టారాజ్యంగా దూషించే వారన్నారు. ఆనాడే ఇది తప్పు అని జగన్‌ను వైసీపీ శ్రేణులు నిలదీయాల్సిందన్నారు. స్వయంగా జగనే... వైసీపీ శ్రేణులు రెచ్చగొడుతున్నారన్నారు. బూతులు తిట్టాలని, రప్పా రప్పా నరుకుతామని బెదిరించాలని రెచ్చగొడుతున్నారని జగన్ పై మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు.

### సీఎం చంద్రబాబుతోనే రాయలసీమ సస్య శ్యామలం

రాయలసీమను సస్య శ్యామలం చేయాలని అన్న ఎన్టీఆర్ సంకల్పిస్తే, ఆయన ఆశయ సాధనకు సీఎం చంద్రబాబునాయుడు నడుం బిగించారని మంత్రి సవిత తెలిపారు. 2014-19 మధ్య రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం సీఎం చంద్రబాబునాయుడు రూ.12 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత 19 నెలల కాలంలో రూ.8 వేల కోట్లకుపైగా వెచ్చించామన్నారు. నేడు రాయలసీమలో ఉన్న తాగు, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించిన ఘనత టీడీపీ ప్రభుత్వాలవేనన్నారు. శ్రీకృష్ణదేవరాయలు తవ్వించిన చెరువుల్లో నీటిని నింపిన ఘనత కూడా సీఎం చంద్రబాబుదేనన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక, చలో పోతిరెడ్డిపాడు అంటూ వైసీపీ మరో డ్రామాకు తెరతీసిందని మంత్రి సవిత విమర్శించారు. అయిదేళ్ల పాటు అధికారంలో ఉన్న జగన్...రాయలసీమకు చేసిందేమీ లేదన్నారు. ఒక్క రిజర్వాయర్ కాని, ఒక కాలువను కాని నిర్మించలేదనిద ఆయన రాయలసీమ ద్రోహి అని మండిపడ్డారు. ఇదే విషయమై జగన్ ను వైసీపీ శ్రేణులు నిలదీయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

# పామాయిల్ అ'ధర'హో!



- సాగు చరిత్రలో తొలిసారి తెలంగాణకన్నా ఏపీలోనే అధిక ధర
- గిట్టుబాటు ధరతో కూటమి ప్రభుత్వ నిర్ణయాలపై రైతుల హర్షం
- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడికి పామాయిల్ రైతుల ప్రత్యేక కృతజ్ఞతలు
- రైతులకు రికార్డు ధర లభించిందన్న మంత్రి అచ్చెన్న

అమరావతి (చైతన్యరథం): పామాయిల్ పంట సాగు చరిత్రలో ఆంధ్రప్రదేశ్ 'అధర'హో అనిపించింది. తెలంగాణతో పోలిస్తే మన రాష్ట్రంలోనే అధిక ధర లభించడం మన రైతుల్లో ఆనందోత్సాహాలు నింపింది. ఈ చారిత్రాత్మక పరిణామానికి కారణమైన కూటమి ప్రభుత్వ నిర్ణయాలపై పామాయిల్ రైతులు, పామాయిల్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వారు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇతర సంప్రదాయ పంటల నుంచి పామాయిల్ సాగు వైపు రైతులు అధిక సంఖ్యలో మొగ్గుచూపుతున్నారని, కూటమి ప్రభుత్వ విధానాలతో తొలిసారి పామాయిల్ రైతులు నిజమైన సంతృప్తి పొందుతున్నారన్నారు. ముఖ్యంగా సరైన సమయంలో గిట్టుబాటు ధర ప్రకటించడంతో ఆర్థిక భరోసా కలిగిందని, పామాయిల్ సాగు విస్తరణతో రాష్ట్రంలో క్రాప్ డైవర్సిఫికేషన్ విజయవంతంగా అమలవుతోందన్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా పామాయిల్ సాగు రైతులకు భరోసాగా మారిందన్నారు. సాగు వ్యయాన్ని తగ్గించేలా డ్రిప్ పరికరాలపై సబ్సిడీని సరైన సమయంలో అందించడం ప్రభుత్వం తీసుకున్న అత్యంత కీలక నిర్ణయమని ప్రశంసించారు. పంట దిగుబడి వచ్చిన వెంటనే సరైన సమయంలో గిట్టుబాటు ధర కల్పించడం వల్ల మార్కెట్ ఒడిదుడుకులకు భయపడాల్సిన అవసరం లేకుండా రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా తీసుకుంటున్న నిర్ణయాలు పామాయిల్ సాగుకు కొత్త దిశను చూపుతున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తీసుకున్న ఈ దూరదృష్టి నిర్ణయాలతో రానున్న రోజుల్లో పామాయిల్ సాగు మరింత విస్తరిస్తుందని, రాష్ట్రం ఆయిల్‌పామ్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు సారధ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

### రైతులకు రికార్డు ధర: మంత్రి అచ్చెన్నాయుడు

2025-26ఆయిల్ ఇయర్ (నూనె సంవత్సరం)కు గాను 20.01% ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో (ఓఈఆర్)ను ప్రభుత్వం ప్రకటించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మన రాష్ట్ర పామ్ ఆయిల్ రైతులకు మెట్రిక్ టన్నుకు రూ.20,680/- లభించిందన్నారు.జనవరి నెలకు తెలంగాణ రాష్ట్ర పామ్‌ఆయిల్ రైతులకు మెట్రిక్ టన్నుకు రూ.20,456 లభించగా ఏపీ రైతులకు రూ.20,680 లభించిందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తెలంగాణ కన్నా మన రైతులకు మెట్రిక్ టన్నుకు రూ. 224 అదనంగా లభించిందని తెలిపారు. ఆయిల్ పామ్ విస్తీర్ణం,ఉత్పత్తి, ఉత్పాదకతలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ తొలి స్థానంలో ఉందని, రాష్ట్రవ్యాప్తంగా 1.97 లక్షల మంది రైతులు 2.49 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేస్తూ, లాభదాయక పంటగా మలుస్తున్నారన్నారు. 2024-25 నూనె సంవత్సరానికి ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాల వల్ల ఆయిల్‌పామ్ రైతులకు మెట్రిక్ టన్నుకు సగటున రూ.19,579 లభించిందని, ఇది గత పదేళ్లలోనే అత్యధికమని మంత్రి వెల్లడించారు. ఈ ధరలతో రైతుల్లో విశ్వాసం పెరిగి ఆయిల్‌పామ్ సాగుపై సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 24,535 హెక్టార్లలో కొత్త ఆయిల్‌పామ్ తోటల విస్తరణ సాధించామని, ఇది గత దశాబ్దంలోనే రికార్డుగా నిలిచిందని తెలిపారు. ఇప్పటివరకు రూ.181.28 కోట్ల నిధులువిడుదల చేసి, రూ.137.28 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. జాతీయ నూనె గింజల మిషన్ కింద రైతులకు ఉచిత మొక్కలు, సాగు ప్రోత్సాహకాలు, పరికరాలపై భారీ రాయితీలు అందిస్తూ ఆయిల్ పామ్‌ను రాష్ట్రంలో భవిష్యత్తు పంటగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# రాయలసీమ అభివృద్ధిపై జగన్ చర్చకు సిద్ధమా?

- ఎవరు ఏం చేశారో అసెంబ్లీలో చర్చకు సిద్ధం
- దమ్ముంటే 11న వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలి
- ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేందుకే దొంగ దీక్షలు
- సీమ పేరుతో వైఎస్ కుటుంబం వేల కోట్లు దోచుకుంది
- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజం



మంగళగిరి (చైతన్యరథం): గత ఐదేళ్లు రాయలసీమను నిర్లక్ష్యం చేసిన జగన్ నేడు దీక్షల పేరుతో డ్రామాలు ఆడితే ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. రాయలసీమకు మీ ప్రభుత్వంలో మీరు చేసింది, మా ప్రభు త్వంలో మేం ఏం చేశామో చర్చకు సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే వైసీపీ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ మేరకు గురువారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో పెడితే... అందులో కనీసం రూ.2 వేల కోట్లు కూడా రాయలసీమ ప్రాజెక్టు లకు ఖర్చు చేయలేదు. వర్షాభావం తక్కువగా ఉన్న రాయలసీ మలో చంద్రబాబు ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌కు శ్రీకారం చుడితే... రైతులకు ఎంతో ఉపయోగకరమైన డ్రిప్ ఇరిగేషన్‌ను జగన్ అధికారంలోకి రాగానే రద్దు చేశాడని ధ్వజమెత్తారు.

**ఆయన పాలనలోనే సీమ లిఫ్ట్ ఆగింది**

రాయలసీమ ఎత్తిపోతల పథకం 2020లో జగన్ ముఖ్యమం త్రిగా ఉన్న సమయంలోనే ఆగిపోయింది. ఇదే విషయాన్ని జగన్ స్నేహితుడు, తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు స్వయంగా చెప్పారు. బీఆర్ఎస్ కేసులు వేసి రాయలసీమ లిఫ్ట్ ఆపేశామని... దానిపై జగన్ ఎందుకు స్పందించడం లేదు. తన హయాంలో ఆగిపోయిన రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు నాలుగేళ్లు అధికారంలో ఉన్నా కూడా ఎందుకు జగన్ పట్టించుకోలేదు. ఎందుకు ఎన్జీటీలో ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు చేయలేదు. అధికారం పోయిన రెండేళ్లకు జగన్ కు రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు గుర్తొచ్చింది. ప్రధాని మోదీని అనేక సార్లు ఢిల్లీలో కలిసి ఎందుకు రాయలసీమ లిఫ్ట్‌పై మాట్లాడలేదు. రాయలసీమ అభివృద్ధికి సంబంధించి ఏ రంగాన్ని పట్టించుకుండా నేడు దీక్షలు చేస్తామంటే ప్రజలు నమ్మరు. కాళేశ్వరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నాడు కర్నూలులో జగన్ దీక్ష చేశాడు. అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం ప్రారంభోత్సవానికి వెళ్లి కేసీఆర్ ఇంట్లో బిర్యానీలు తిని వచ్చాడు. అప్పుడు రాయలసీమ ఎత్తిపోతల పథకం జగన్‌కు గుర్తుకు రాలేదు. కేసీఆర్‌ను రాయలసీమ లిఫ్ట్‌కు ఎందుకు ఒప్పించలేక పోయావు? నేడు అధికారం కోల్పోయి ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేందుకు దీక్షల పేరుతో డ్రామాలకు తెరతీశారు. రాయల సీమ పేరుతో వైఎస్ఆర్ కుటుంబం వేల కోట్లు సంపాదించింది. ఆ సొమ్ముతోనే సాక్షి పత్రికా, ఛానెల్ పెట్టారు, ప్యాలెస్‌లు కట్టు కున్నారు. జగన్ రాజకీయం ఆస్తులు సంపాదించుకోవడం కోసమే తప్పితే రాయలసీమ ప్రజల కోసం, రాయలసీమ రైతుల కోసం కాదు. అధికారంలో ఉంటే ఒకలా అధికారం లేకపోతే మరోలా డ్రామాలు ఆడటం జగన్‌కే చెల్లిందని మండిపడ్డారు.

**ముచ్చుమర్రితో 798 అడుగుల నుంచే నీటిని తీసుకోవచ్చు**

సీఎం చంద్రబాబు సారథ్యంలో 2017లోనే ముచ్చుమర్రి వద్ద 13 పంపులతో నీటిని తరలించేలా ప్రాజెక్టును నిర్మించాం. శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా 798 అడుగుల నుంచి నీటిని తీసుకునే వెసులుబాటు ఉంది. ముచ్చుమర్రి ద్వారా కేసీ కెనాల్‌కు లింక్ చేసి తెలుగుగంగ, హెచ్ఎన్ఎస్ఎస్, ఎస్ఆర్ ఎస్బీ, హంద్రీనీవాకు నీటిని తరలించే అవకాశం ఉంది. కేవలం చంద్ర బాబుకు పేరు వస్తుందనే అక్కసుతోనే జగన్ రాయలసీమ లిఫ్ట్ పేరుతో అనుమతులు లేకున్నా, అనుమతులు రావని తెలిసినా పనులు మొదలుపెట్టి రాష్ట్ర ప్రభుత్వంపై ఎన్జీటీ ఫైన్ విధించేలా పనులు చేశారు. కనీస అవగాహన లేకుండా రాయలసీమ లిఫ్ట్ పేరుతో రూ.990 కోట్ల మట్టి పనులు చేసుకుని బిల్లులు చెల్లించు కున్నారు. నిజంగా రాయలసీమకు నీరు ఇవ్వాలనే చిత్తశుద్ధి జగన్ కు ఉంటే ఎందుకు హంద్రీనీవా కాలువ విస్తరణ చేయలేదు? ఎందుకు అలగనూరు, గోరుకల్లు, శ్రీశైలం, తుంగభద్ర వంటి ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయించలేదు. కడప జిల్లా లో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 60 మంది ప్రాణాలు పోయినా జగన్ పట్టించుకోలేదు. మూడేళ్లు అన్నమయ్య ప్రాజెక్టుకు అతీగతీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**తక్కువ కాలంలోనే సీమకు రూ.4.5 లక్షల కోట్ల పెట్టుబడులు**

రాయలసీమలో వలసలు నివారించి పరిశ్రమలు స్థాపించి ఇక్క డి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లు పనిచేస్తున్నారు. అందుకు నిదర్శనమే ఈ 18 నెలల పాలన. రూ.5 వేల కోట్ల అభివృద్ధి పనులు కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక వాడల్లో పనులు జరుగుతున్నాయి. 18 నెలల్లో రూ.4.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాయలసీమలోని నాలుగు జిల్లాలకు వచ్చాయి. 2.5 లక్షల ఉద్యోగాలు ఈ పెట్టుబడుల ద్వారా రాబోతున్నాయి. దేశంలోనే అనంతపురంను హార్టికల్చర్ హబ్‌గా నిలబెట్టిన ఘనత చంద్రబాబు ది. 18 నెలల్లోనే రూ.8 వేల కోట్లు రాయలసీమ ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ఖర్చు చేసింది. హంద్రీనీవాకు రూ.3,870 కోట్లు ఖర్చు చేశాం. రికార్డ్ టైంలో 190 రోజుల్లోనే 40 టీఎంసీల నీటిని కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు తరలించాం. రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులు, డ్యామ్‌లు, చెరువులు జలకళతో కళకళలాడుతున్నాయి. నేడు కూడా 360 టీఎంసీల నీరు నిల్వ ఉంచాం. జగన్ రెడ్డి రాయలసీమకు ద్రోహం చేస్తే... చంద్రబాబు న్యాయం చేస్తున్నాం. గోరుకల్లు, అలగనూరు, శ్రీశైలం ప్రాజెక్టుల మరమ్మతులకు కూడా జగన్ నిధులు ఇవ్వలేదు. నేడు కూటమి ప్రభుత్వంలో రూ.320 కోట్లు ఈ ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు ఇచ్చింది. రాయలసీమపై మాట్లాడే హక్కు జగన్ కు లేదు. రాయలసీమకు ద్రోహం చేశారు కాబట్టే ప్రజలు మీకు బుద్ధి చెప్పారు. 52 ఎమ్మెల్యే సీట్లల్లో కేవలం 7 సీట్లు ఇచ్చి మీకు బుద్ధి చెప్పారు. అయినా మీ బుద్ధి ఇంకా మారలేదు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా, డ్రోన్ హబ్‌గా కూటమి ప్రభుత్వంలో తీర్చిద్ది దుతున్నాం. కరువు కాటకాలకు, వలసలకు నిలయమైన రాయలసీమలో నేడు అభివృద్ధి సిరులు కురుస్తున్నాయని స్పష్టం చేశారు. జగన్ నిజంగా రాయలసీమ వాడే అయితే రాయలసీమ అభివృద్ధిపై సాగునీటి ప్రాజెక్టులకు చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. దమ్ముంటే జగన్ రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చకు రావాలని కోరారు. ఈ నెల 11న జరిగే అసెంబ్లీ సమావేశాలకు 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలతో రండి.. చర్చించేందు కు మేం సిద్ధంగా ఉన్నాం.. ప్రజలకు వాస్తవాలు ఏమిటో కూడా తెలుస్తాయని స్పష్టం చేశారు.

## పరిమళించిన మానవత్వం

**- ఏజెంట్ చేతిలో మోసపోయిన ఆంధ్రా మహిళ**

**- ఒమన్ వెళ్తుండగా అస్వస్థత**

**- ఆదుకుని స్వస్థలానికి చేర్చిన ఎన్నారై టీడీపీ**

అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన షేక్ అబిదా బేగం అనే మహిళ కుటుంబ పోషణ కోసం ఒమన్ దేశం వెళ్లింది. వర్క్ వీసాకు బదులుగా ఏజెంట్ ద్వారా నెల క్రితం బయల్దేరగా ప్రయాణం సమయంలోనే అస్వస్థతకు గురైంది. తక్షణం స్పందించిన విమానాశ్రయం అధికారులు, క్లినిక్ సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలించారు. సుమారు 15 రోజుల చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం మెరుగుపడింది. అదే సమయంలో ఈ విషయం తెలుసుకున్న టీడీపీ ఎన్ఆర్ఐ సభ్యులు ఆసుపత్రి యాజమాన్యాన్ని సంప్రదించారు. వెంటనే మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలోని టీడీపీ ఎన్ఆర్ఐ సెల్ కో-ఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్, స్థానిక డెక్కన్ వింగ్‌తో కలిసి పూర్తి సహాయ సహకారాలు అందించారు. ట్రీట్మెంట్‌కి సంబంధించిన బిల్లులు, ఆమె తిరుగు ప్రయాణానికి అవసరమైన విమాన టిక్కెట్టు కోసం ఆర్థిక సహాయాన్ని అబిదా బేగంకు అందజేసి మానవత్వం చాటుకున్నారు.

ఒమన్ నుంచి బుధవారం హైదరాబాద్ బయల్దేరిన ఆమె స్వస్థలమైన ధర్మవరం చేరుకునేందుకు టీడీపీ ఎన్ఆర్ఐ సెల్ సహాయం చేసింది.

ఈ సందర్భంగా అబిదా బేగం తన అనుభవాన్ని మీడియాతో పంచుకుంది... 'మహిళలు ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దు... గల్ఫ్ దేశాలకు ఉద్యోగాల కోసం వెళ్లాలనుకునే వారు తప్పనిసరిగా ఏపీఎన్ఆర్టీ లేదా మీ ప్రాంతంలోని టీడీపీ నాయకులను లేదా టీడీపీ ఎన్ఆర్ఐ సెల్‌ను, నిర్ధారిత అధికారిక వర్గాలను మాత్రమే సంప్రదించాలి' అని విజ్ఞప్తి చేసింది. తనకు ప్రాణ రక్షణ కల్పించినందుకు కన్నీటి పర్యంతమవుతూ తన తరపున, తన కుటుంబం తరపున ధన్యవాదాలు తెలిపారు. తనను ఆదరించిన టీడీపీకి, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కి, టీమ్‌కి కృతజ్ఞతలు తెలిపింది.



# కూటమి ప్రభుత్వంపై నమ్మకంతోనే పెట్టుబడులు

- ముంబయి, మహారాష్ట్రలకు ధీటుగా ఆంధ్రప్రదేశ్
- ఇది మాటల ప్రభుత్వం కాదు..చేతల ప్రభుత్వం
- తలసరి ఆదాయం 12 శాతం పెరిగింది
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్



మంగళగిరి (చైతన్యరథం): దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా నేడు కూటమి ప్రభుత్వ పాలన, రాష్ట్రానికి తరలివస్తున్న పెట్టుబడుల గురిం చే చర్చ జరుగుతోందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ తెలిపారు. ఇది మాటల ప్రచారం కాదు, దేశ వ్యాప్తంగా వచ్చిన సర్వేలు, గణాంకాలే దీనికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఏ సర్వే చూసినా ఆంధ్రప్రదేశ్ సుమారు 25.3 శాతం పెట్టుబడులతో దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచిందని, పెట్టుబడుల విషయంలో ముంబయి, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలను కూడా వెనక్కి నెట్టిందని చెప్పారు. గతంలో పెట్టుబడిదారులు భయపడి పారిపోయిన రాష్ట్రానికి, ఇప్పుడు పెట్టుబడిదారులు పోటీ పడి రావడం కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి స్పష్టమైన ఉదాహరణ. ఉద్యోగాల విషయానికి వస్తే, మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా ఉద్యోగాలు తీసుకొచ్చిన ఘనత మంత్రి నారా లోకేష్‌కే దక్కుతుందని తెలిపారు. మాటల్లో ఉద్యోగాలు కాదు, చేతల్లో ఉద్యోగాలు చూపిం చిన నాయకత్వం ఇదేనని స్పష్టం చేశారు. గత పాలనలో నిరుద్యోగ యువతను మోసం చేసిన పరిస్థితులు ఇప్పుడు పూర్తిగా మారాయి. ఆర్థికాభివృద్ధిని చూసినా, జగన్ ప్రభుత్వంతో పోల్చితే కూటమి ప్రభుత్వంలో తలసరి ఆదాయం 12 శాతం పెరిగిందని గణాంకాలతో వెల్లడించారు. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలు పెరిగితేనే తలసరి ఆదాయం పెరుగుతుందని, ఇది కూటమి ప్రభుత్వ పాలన ఫలితమేనని తెలిపారు. గాజువాకలో స్టీల్ ప్లాంట్‌కు నిధులు విడుదల చేయించి, ఆ ప్రాంత అభివృద్ధికి దిశ చూపడం ద్వారా అక్కడి ప్రజల ఆదాయ స్థాయి పెరిగిందన్నారు. గత ప్రభుత్వంలో మహిళలపై అఘాయిత్యాలు, అరాచకాలు, రాజకీయ కుతంత్రాలతోనే ఐదేళ్లు గడిచిపోయాయని ధ్వజమెత్తారు. మహిళలకు రక్షణ లేకుండా, న్యాయం దొరకకుండా చేసిన పాలన అది అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాత్రం మహిళలను కించపరిచే ముందు నేరస్తులు భయపడే పరిస్థితి ఏర్పడిందని, ఇది చట్టబద్ధ పాలనకు నిదర్శనమన్నారు. నేరాల పరిస్థితిని కూడా పోల్చిచూపుతూ గత ప్రభుత్వంతో పోల్చితే కూటమి ప్రభుత్వంలో క్రైమ్ రేటు గణనీయంగా తగ్గిందని చెప్పారు. పాలనలో క్రమశిక్షణ ఉంటేనే సమాజంలో భద్రత ఉంటుందని, ఇప్పుడు రాష్ట్రంలో అదే కనిపిస్తోందని పేర్కొన్నారు. రాజధాని అమరావతి విషయంలో కూడా చంద్రబాబు చూపించిన నాయకత్వాన్ని గుర్తు చేశారు. అమరావతి కావాలనే ఉద్యమాలు, పోరాటాలు, అరెస్టులు, నిరసనల వాతావరణం నుంచి బయటకు తీసుకువచ్చి సుందరమైన రాజధానిగా అమరావతిని మళ్లీ అభివృద్ధి పథంలో పెట్టిన ఘనత చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. ఒకప్పుడు అమరావతి ఏ స్థితిలో ఉందో.. ఇప్పుడు ఏ స్థాయికి చేరుకుందో గూగుల్ మ్యాప్‌లో చూస్తే స్పష్టంగా తెలుస్తుంది. అంతేకాకుండా భారతదేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్ట్‌గా గుర్తింపు పొందిన గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను ప్రధాని చేతులమీదుగా విశాఖలో శంకుస్థాపన చేయించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌తో విశాఖ పేరు ప్రపంచ పటంపై మరింత బలంగా నిలిచిందన్నారు. పోర్టు సిటీల అభివృద్ధి ద్వారా తెలుగు ప్రజలు గర్వపడేలా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళు తున్నారని చెప్పారు. మొత్తంగా చూస్తే కూటమి ప్రభుత్వం అంటే అభివృద్ధి, భద్రత, పెట్టుబడులు, ఉద్యోగా లు అన్నింటికీ నమ్మకమైన చిరునామాగా మారిందని స్పష్టం చేశారు. గతంలో విధ్వంసం చూసిన రాష్ట్రం.. ఇప్పుడు ప్రపంచం మాట్లాడు కునే స్థాయికి ఎదగడం చంద్రబాబు నాయకత్వానికి నిదర్శనమని తెలిపారు.

## చాగంటి మాట..

# విద్యార్థుల భవితకు బంగారు బాట



**- హోం మంత్రి వంగలపూడి అనిత**

పాయకరావుపేట (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డులో గల తిమ్మాపురం ఆదర్శ పాఠశాల వద్ద 'విద్యా దీప్తి-సంస్కార స్ఫూర్తి' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రవచన చక్రవర్తి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నైతిక విలువలు) చాగంటి కోటేశ్వరరావుకు హోం మంత్రి వంగలపూడి అనిత ఘన స్వాగతం పలికారు. సుమారు రెండు వేల మంది విద్యార్థులకు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై చాగంటి ఉద్బోధించారు.

మంత్రి అనిత మాట్లాడుతూ... విద్యార్థి లోకానికి నైతిక విలువలు అందించడానికి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని, రాబోయే తరానికి బంగారు భవిష్యత్ అందించేందుకు పలు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారని చెప్పారు. చాగంటి నోటి నుంచి వచ్చే ప్రతి మాట విద్యార్థుల భవితకు బంగారు బాట అవుతుందన్నారు. సమాజంలో మంచి మనిషిగా పేరు సంపాదించేందుకు ఇలాంటి ప్రవచనాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

### చాగంటి ప్రవచన సారాంశం

అమ్మ కంటే గొప్పవారు ఈ లోకంలో లేరు. అమ్మలా త్యాగం చేసేవారు ఎవరూ ఉండరు. పిల్లల కోసం తల్లి అవసరమైతే ప్రాణం కూడా త్యాగం చేస్తుంది. తల్లి రుణం తీర్చుకోవడం పిల్లలకు సాధ్యం కాదు. అమ్మను మోసం చేయడం మానవత్వానికి కళంకం. మనిషి ఎదగాలంటే కష్టపడాలి. రాయి ఎన్నో ఉలి దెబ్బలు తింటేనే దేవాలయంలో విగ్రహం అవుతుంది. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు మహాత్ముల జీవిత చరిత్రలనూ చదవాలి. ప్రతి విద్యార్థికీ ఒక లక్ష్యం ఉండాలి. గురువును, తండ్రిని గౌరవించడం నేర్చుకోవాలి. సమయం చాలా విలువైనది. దానిని సద్వినియోగం చేసుకోవాలి. చదవడాన్ని బరువుగా కాకుండా అదృష్టంగా భావించాలి. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు చాగంటి ఉద్బోధించారు.

విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు చాగంటి సమాధానం ఇచ్చారు. పిల్లలు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. విద్యా సమపార్జన చాల ముఖ్యమన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

**- 'వెలిగల్లు' ద్వారా ప్రతి చెరువుకూ నీరిందిస్తాం**
**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**
**- సుద్దమల్ల పంచాయతీ రేకులకుంట చెరువుకు జలహారతి**



రామాపురం (చైతన్యరథం): 'రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం... వెలిగల్లు జలాశయం ద్వారా ప్రతి చెరువుకూ నీరిందిస్తాం... వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తాం' అన్నారు రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన సంక్షేమ శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం సుద్దమల్ల పంచాయతీ పరిధిలోని రేకలకుంట చెరువుకు గురువారం ఆయన జలహారతి ఇచ్చారు. ఇరిగేషన్ అధికారులు, టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పూజలు నిర్వహించి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోకుండా కేవలం మాటలకే పరిమితమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీ ప్రకారం పథకాలను ప్రజలకు చేరువ చేస్తోందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు అన్నదాత సుఖీభవ, సబ్సిడీపై డ్రిప్ పరికరాలు సకాలంలో అందేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మంత్రి రాంప్రసాద్ రెడ్డికి వీరబల్లి నాగబసిరెడ్డి దుశ్శాలువా కప్పి గజమాలతో సత్కరించారు.

# 'స్వచ్ఛ శ్రీశైలం'కు పూర్తి సహకారం

**- శ్రీశైలం అటవీ ప్రాంతంలో చెత్తను ఏప్రిల్‌లోపు తొలగిస్తాం**
**- మూడు ఇ-వాహనాలు ఇస్తాం**
**- దోర్నాల వద్ద ప్రాసెసింగ్ సెంటర్ పెట్టండి**
**- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్**



శ్రీశైలం (చైతన్యరథం): నంద్యాల జిల్లా శ్రీశైలం అటవీ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తని ఏప్రిల్ నెలలోపు తొలగిస్తామని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ హామీ ఇచ్చారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, ఆత్మకూరు డివిజన్ శ్రీశైలం సబ్ డివిజనల్ అటవీ అధికారి ఎం.బబితకుమారి, నంద్యాల మునిసిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కలిసి పట్టాభిరామ్ శ్రీశైలం సమీపంలోని అటవీ ప్రాంతాన్ని అక్కడ పేరుకుపోయిన చెత్తను గురువారం పరిశీలించారు. ఆ చెత్త వల్ల అటవీ ప్రాంతానికి కలిగే ఇబ్బందులను అటవీ అధికారి... స్వచ్ఛ అంధ్ర కార్పొరేషన్ చైర్మన్‌కు వివరించి ఆ చెత్తని తొలగించమని కోరారు. ఈ చెత్త మొత్తాన్ని ఏప్రిల్ నాటికి క్లియర్ చేయిస్తామని చైర్మన్ పట్టాభిరామ్ హామీ ఇచ్చారు.

### స్వచ్ఛ శ్రీశైలంగా తీర్చిదిద్దేందుకు పూర్తి సహకారం

శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని స్వచ్ఛ శ్రీశైలంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పూర్తిగా సహకారం అందిస్తారని శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యులకు, అధికారులకు పట్టాభిరామ్ హామీనిచ్చారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, సభ్యులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఇతర అధికారులతో పట్టాభిరామ్ గురువారం సమావేశమయ్యారు. శ్రీశైలంలో పారిశుధ్య సమస్యలు, స్వచ్ఛ శ్రీశైలంపై చర్చించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ తరపున చెత్త సేకరణకు మూడు ఎలక్ట్రిక్ వాహనాలను ఇస్తామని హామీ ఇచ్చారు. శ్రీశైలంలో రోజుకు 16 టన్నుల చెత్త వస్తోందని, దానిని ప్రాసెసింగ్ చేయడానికి సమీపంలోని దోర్నాలలో దేవస్థానం వారు ప్రాసెసింగ్ సెంటర్ పెడితే మంచిదని చైర్మన్ పట్టాభిరామ్ దేవస్థానం వారికి సలహా ఇచ్చారు. అక్కడ ప్రాసెసింగ్ సెంటర్ పెడితే ఎవరికీ ఏ ఇబ్బందీ ఉండదని తెలిపారు. అక్కడ ప్రాసెసింగ్ సెంటర్ నిర్వహణకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ విషయమై దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశంలో చర్చించి తమ నిర్ణయం తెలియజేస్తామని బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. శ్రీశైలంలో చెత్త ఎక్కువగా ఉత్పత్తి చేసే హోటల్స్, సత్రాలు... వంటి వాటి ప్రతినిధులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, తడి చెత్త, పొడి చెత్త వేరుచేయడం, ఇతర చెత్త నిర్వహణకు సంబంధించిన అంశాలపై వారికి అవగాహన కల్పిస్తామని పట్టాభిరామ్ చెప్పారు.

### మల్లికార్జునస్వామి వారి సందర్శన

శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామిని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గురువారం ఉదయం దర్శించారు. ఆయనకు వేదపండితులు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, ఈవో ఎం.శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పట్టాభిరామ్‌కు స్వామివారి చిత్రపటాన్ని ఈవో అందజేశారు.

## గోదావరి పుష్కరాల నాటికి విద్యుత్ శాఖ పనులు పూర్తి

**- మంత్రి గొట్టిపాటి రవికుమార్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): గోదావరి మహా పుష్కరాలకు తూర్పు గోదావరి జిల్లాలో విద్యుత్ శాఖకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఆయన రాజమహేంద్రవరలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో విద్యుత్ శాఖ జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి సమగ్ర ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట అదనపు సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను ముందుగానే సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. అఖండ గోదావరి పుష్కరాల కోసం సబ్ స్టేషన్ల స్థలాల గుర్తింపు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని భూములను ముందుగానే 'ఇయర్ మార్క్' చేయాలని ఆదేశించారు.

ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద జిల్లాలో చేపడుతున్న విద్యుత్ పునర్ వ్యవస్థీకరణ పనులను వేగవంతం చేయాలని, 2026 మార్చి నాటికి ఏపీ ట్రాన్స్‌కో పరిధిలోని సబ్‌స్టేషన్ పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆదేశించారు. జిల్లాలో ప్రతిపాదిత 17 సబ్‌స్టేషన్లకు సంబంధించిన డీపీఆర్‌ల వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేస్తున్న సోలార్ పరికరాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. సబ్‌స్టేషన్ల నిర్మాణంలో లేదా ఇతర విద్యుత్ పనుల్లో సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా పని చేయాలని, పుష్కరాల సమయంలో విద్యుత్ శాఖ సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ఉండాలని మంత్రి పేర్కొన్నారు.

## స్వయం సమృద్ధి సంస్థలుగా ఎఫ్‌పీవోలు

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



అమరావతి (చైతన్యరథం): గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో అనుసంధానం చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. ఎఫ్‌పీవోలకు సాంకేతిక సహకారం అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల (ఎన్జీవో) ప్రతినిధులు, సెర్ప్ అధికారులతో విజయవాడలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన సమీక్షించారు. సెర్ప్-ఎఫ్‌పీవోల నిర్మాణం, వాటి బలోపేతం, ప్రస్తుత స్థాయిని అంచనా వేసేందుకు ఒక ప్రత్యేక 'టూల్' అభివృద్ధిపై చర్చించారు. 'ఒక ఎఫ్‌పీవో-ఒక ఉత్పత్తి' విధానంలో భాగంగా వాల్యూ చైన్ అభివృద్ధి, ఎఫ్‌పీవోల స్థాయిలో చేపడుతున్న వివిధ జీవనోపాధి కార్యక్రమాలపై కూలంకషంగా చర్చించారు. ప్రతీ నెల, సంవత్సర కాలానికి స్పష్టమైన రోడ్ మ్యాప్, జీవనోపాధి ప్రణాళికలను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. విజయవంతమైన ఎఫ్‌పీవోల కేస్ స్టడీలను వీడియో డాక్యుమెంటరీలుగా రూపొందించాలని సూచించారు. ఎన్జీవోల పురోగతిపై సమీక్షించడానికి ఒకే రకమైన ఫార్మాట్ రూపొందించాలన్నారు. ఎన్జీవో భాగస్వాములు సంబంధిత జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్లను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో సెర్ప్ కార్యదర్శి వాకాటి కరుణ, డిప్యూటీ సీఈవో ఓ.శ్రీరాములునాయుడు, హైపర్ ఇంటర్నేషనల్, బ్రెడ్స్, కాల్లుడి, డిజిటల్ గ్రీన్, వాసన్, విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖపై 95 శాతం సంతృప్తి స్థాయే లక్ష్యం

- 19 నెలల్లో ఒక్క రూపాయి ఛార్జీ కూడా పెంచలేదు
- ఆర్డీఎస్ఎస్‌తో గ్రామాల్లోనూ 24 గంటల సరఫరా
- వైసీపీ పాలనలో బిల్లులు పెంచి..నేడు వాళ్లే ధర్నాలు
- గొడవలు సృష్టించి జనాల్లోకి వెళ్లాలని జగన్ ప్రయత్నం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



మండపేట(చైతన్యరథం): ప్రజల్లో విద్యుత్ శాఖపై 95 శాతం సంతృప్తి స్థాయి కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా ముందుకు వెళుతున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గురువారం పర్యటించారు. మండపేట నియోజకవర్గం పరిధిలోని మండపేటతో పాటు టేకి గ్రామంలో ఒక్కొక్కటి రూ.2.61 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 19 నెలల కాలంలో ఒక్క రూపాయి విద్యుత్ ఛార్జీ కూడా పెంచలేదన్నారు. విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబుకు ఎంతో అనుభవం ఉందని, ఆయన అనుభవంతోనే వైసీపీ ధ్వంసం చేసిన విద్యుత్ వ్యవస్థను మరలా గాడిలో పెడుతున్నామన్నారు. ఎక్కడా లో ఓల్టేజ్ సమస్య లేకుండా చూడాలని సీఎం ఆదేశించారని స్పష్టం చేశారు. ఇందులో భాగం గానే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 200 సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో కొన్ని నిర్మాణం పూర్తి కాగా, మరికొన్ని నిర్మాణ దశలోనూ, ఇంకొన్ని టెండర్ దశలోనూ ఉన్నాయని తెలిపారు.

**ఒక్కో యూనిట్‌పై రూ.1.19 తగ్గింపు..**

విద్యుత్ శాఖకు సంబంధించి ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో రూ.175 కోట్లలో నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనులతో ఫీడర్ల బైఫరి కేషన్ చేస్తున్నామని పేర్కొన్నారు. దీంతో రైతులకు 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించడంతో పాటు వినియోగదా రులకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొ న్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 75,000 వ్యవసా య విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని వనరు లు ఉన్నా గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క యూనిట్ విద్యుత్‌ను కూడా అదనంగా ఉత్పత్తి చేయలేదని విమర్శించారు. ప్రైవేటు సంస్థల నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లు చేయడంతో ప్రజలపై రూ.30 వేల కోట్ల అదనపు భారం పడిందన్నారు. తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెంచిన ఛార్జీలపై వాళ్లే ధర్నాలు చేస్తున్నారని, వారు పెంచిన విద్యుత్ ఛార్జీలపై అసెంబ్లీలోనూ ప్రశ్నలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలతో డిసెంబర్‌లో ఏపీఈఆర్సీ రూ.5 వేల కోట్ల భారం ప్రజలపై వేసిందన్నారు. ఆ భారాన్ని ప్రజలపై వేయకుండా కూటమి ప్రభుత్వమే భరించే విధంగా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా వైసీపీ ట్రూ అప్ చేసిన 40 పైసల్లో ఇప్పటికే 13 పైసలు ట్రూ డౌన్ చేశాం..మిగిలిన మొత్తాన్నీ త్వరలోనే ట్రూ డౌన్ చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల సమయానికి ఒక్కో యూనిట్‌కు రూ.1.19 తగ్గించేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికలు రూపొందించారని వివరించారు.

**అభ్యంతరకర భాషతో రెచ్చగొడుతున్నారు..**

వైసీపీ నేతలు అభ్యంతరకర భాషతో తెలుగుదేశం శ్రేణులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గొడవలను ప్రోత్సహించి, గొడవలు సృష్టించి ప్రజల్లోకి వెళ్లడానికి జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎంగా చేసిన వ్యక్తి మాట్లాడ కూడని, సభ్య సమాజం అసహ్యించుకునే విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలకు కూడా ఒక వేదిక ఉందని తెలిపిన మంత్రి..ప్రజల ఓట్లతో గెలిచిన 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు ఒక్కరోజు కూడా అసెంబ్లీకి రాలేదని తెలిపారు. గత ప్రతిపక్షంలో తాము 15 మందిమే ఉన్నా ప్రజా సమస్యలపై పోరాడామని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో చదివే పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు కల్పించాలన్న ధ్యేయంతో పనిచేస్తున్నామని వెల్లడించారు.

## అప్పటి పాలకులకు తెలిసే నెయ్యి కల్తీ

**- ఆర్థికమంత్రి పయ్యావుల**



అమరావతి (చైతన్యరథం): తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో ప్రజలకు వాస్తవాలకు తెలియాలని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అందుకే కొన్ని అంశాలను బయటపెడుతున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు నివాసంలో కూటమి నేతల కీలక భేటీ అనంతరం గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో పయ్యావుల మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు. వైసీపీ హయాంలో తిరుమల లడ్డూలో నాణ్యత లేదు, సువాసన రాలేదని ఫిర్యాదులు వచ్చాయి. నెయ్యి నూనెలా జారిపోతోందని అప్పట్లో ఈవో ధర్మారెడ్డికి పోటు కార్మికులు చెపితే..ఆర్గానిక్ నెయ్యి అని వారికి అబద్ధాలు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధి నిర్వహణలో భాగంగా ఈవో శ్యామలరావు నాలుగు ట్యాంకర్ల నెయ్యి శాంపిళ్లను ఎన్డీడీబీకి పంపారు. ఆ సంస్థ ఇచ్చిన నివేదికలో నివ్వెరపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. నెయ్యి కల్తీ జరిగిందని ఎన్డీడీబీ నివేదిక తేల్చింది. సోయాబీన్, సన్‌ఫ్లవర్, ఫిష్ ఆయిల్, కోకోనట్ ఆయిల్, పామాయిల్, వెజిటెబుల్ ఆయిల్ కలిసినట్లు పేర్కొంది. జంతుకొవ్వు కలిసినట్లు నివేదికలో తెలిపింది. దీనిపై ఎంతో ఆవేదనతో ఎన్డీబీబీ నివేదికను శాసనసభాపక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు బయటపెట్టారు. నెయ్యి కల్తీ ఘటన అప్పటి పాలకులకు తెలిసే జరిగింది. ఇంత తెలిసిన తర్వాత కూడా టీటీడీ మాజీ చైర్మన్ ఈ విషయాన్ని తొక్కిపెట్టారు. 60 లక్షల లీటర్లు కల్తీ నెయ్యి సరఫరా చేశారు, రూ.234 కోట్లు దుర్వినియోగమైందని అని మంత్రి పయ్యావుల వెల్లడించారు. నెయ్యి అని పిలుస్తున్న పదార్థం భోలేబాబా డెయిరీలో తయారు చేశారు. నెయ్యిలా మార్చేందుకు రకరకాల కెమికల్స్ కలిపారని పయ్యావుల కేశవ్ తెలిపారు.

## ఫైనాన్స్ వ్యాపారం ముసుగులో భారీ దోపిడీ

# పెద్దిరెడ్డి అండతో భూ కబ్జా..

**పట్టా భూమిలో దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం**

**గ్రీవెన్స్‌సెల్‌లో సమస్యలపై అర్జీలు**

**అర్జీలు స్వీకరించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**



మంగళగిరి(చైతన్యరథం): ఫైనాన్స్ వ్యాపారం ముసుగులో నమ్మించి మోసగించారని ప్రజావినతుల్లో బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన గుండా శ్రీనివాసరావు టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం సమస్య ను వివరిస్తూ వినతిపత్రం ఇచ్చారు. తన మిత్రులు ఏచూరి రామకృష్ణ, ఊటుకూరి వెంకట రామాంజనేయులు కలిసి స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో ఆటో ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాను. వీరి వద్దకు కారంపూడి బస్టాండ్ సెంటరులో పలు ఫైనాన్స్ పేర్లతో వ్యాపారం చేసే తండా చిన సైదా వచ్చి తనకు తెలంగాణ, ఏపీ విద్యుత్ శాఖ ఉద్యోగుల నుంచి భారీగా ఆర్డర్లు ఉన్నాయని నమ్మబలికాడు. తన బ్యాంక్ స్టేట్‌మెంట్లను చూపి పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించాడు. చిన సైదా మాటలను నమ్మి తను, తన స్నేహితులం కలసి స్థానిక రైతుల వద్ద నుంచి నగదు సేకరించి జనవరి 06, 2024: రూ.1,02,28,500 (10 ప్రామిసరీ నోట్లు), ఫిబ్రవరి 06, 2024: రూ.1,11,72,800/- (11 ప్రామిసరీ నోట్లు), మార్చి 06, 2024: రూ. 40,86,450/- (4 ప్రామిసరీ నోట్లు, వ్యాపార ఒప్పందం), మే 28, 2024: రూ. 1,37,84,000/- (13 ప్రామిసరీ నోట్లు), జూన్ 14, 2024: రూ. 1,38,80,400/- (13 ప్రామిసరీ నోట్లు), జూలై 23, 2024: రూ. 1,02,33,300/- (10 ప్రామిసరీ నోట్లు) మొత్తంగా ఇప్పటివరకు సుమారు రూ.6.33 కోట్లకు పైగా నగదును చిన సైదా వసూలు చేశాడు. ఇందుకు షూరిటీగా ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చి అకౌంట్ పుస్తకాల్లో సంతకాలు చేసినప్పటికీ డబ్బు తిరిగి చెల్లించే విషయంలో కాలయాపన చేస్తూ మోసానికి పాల్పడు తున్నాడు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబులకు వినతిపత్రం ఇచ్చారు.

**భూమికి తప్పుడు రికార్డులతో ఆక్రమణ**

చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కారేటిగారిపల్లె గ్రామానికి చెందిన చెంగల్రాయనాయుడు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో గత 60 ఏళ్లుగా తమ అనుభవంలో ఉన్న వ్యవ సాయ భూమిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి తమపై కక్షగట్టి సర్వే నెం.242/16లోని 48 సెంట్ల భూమిని తమ అను చరుడైన జయగోపాల్ పేరున అక్రమంగా హక్కులు కల్పించారు. ఈ విషయంలో సంబంధిత రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు రికార్డులు చేయించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**పట్టా భూమిలో రోడ్డు వేశారు**

పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాలువాయి గ్రామానికి చెందిన మాధవి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తమ పట్టా భూమిని దొంక రోడ్డు అని చెప్పి బలవంతంగా రోడ్డు వేసేందుకు ప్రయత్నం చేయడంతో కోర్టును ఆశ్రయించి ఇంజంక్షన్ ఆర్డర్ కూడా తెచ్చుకున్నాం. అయినప్పటికీ కోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా తమ పట్టా భూమిలోనే రోడ్డు నిర్మాణం చేపట్టారు. జిల్లా సర్వేయర్, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్, ఎంఆర్ఓ తదితర అధికారులు సంయుక్తంగా పరిశీలించి ఇది పట్టా భూమే అని నిర్ధారించినా, అక్రమ రోడ్డు తొలగింపుపై చర్యలు జరగడం లేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

**భూమికి దారి సౌకర్యం కల్పించాలి**

బాపట్ల జిల్లా వేటపాలెం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన వెంకటరత్నం గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 16/6లో తనకు 0.44 1/2 సెంట్ల భూమి ఉంది. దానిలో 40 సెంట్ల భూమిని అమ్మివేశాను. మిగిలి న 0.04 1/2 సెంట్ల భూమిని దక్షిణ భాగంలో అప్పగించినప్పటికీ ఆ భూమికి పడమర వైపు సరైన దారి కల్పించకుండా ఇవ్వడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో తన భూమిని వినియోగించుకోవడం కష్టంగా మారింది. కనీసం రాకపోకల కోసం దారి కల్పించి ఇవ్వాలని సంబంధిత అధికారులను పలుమా ర్లు కోరినప్పటికీ స్పందన లేదు. వారిపై చర్యలు తీసుకుని భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**భూమికి హద్దులు చూపించాలి**

పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాలువాయి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామ శివారులోని సర్వే నెం.356/1, 356/2లలో తనకు మొత్తం 2.16 ఎకరాల వ్యవసాయ భూమి రికార్డుల ప్రకారం ఉంది. కానీ ఆన్‌లైన్‌లో భూమి కేవలం 2.00 ఎకరాల మేరకే కనిపిస్తోంది. ఈ వ్యత్యాసం కారణంగా తనకు చెందాల్సిన మిగిలిన భూమి సరి హద్దులు స్పష్టంగా చూపించేందుకు సర్వేయర్ ద్వారా కొలతలు వేసి సబ్‌డివిజన్ చేయించి, తనకు ఉన్న పూర్తి 2.16 ఎకరాల వ్యవసాయ భూమికి హద్దులు నిర్ధారించాల్సిందిగా కోరుతూ తహ సీల్దారు కార్యాలయాన్ని పలుమార్లు సంప్రదించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. అలాగే సర్వేయర్‌ను కూడా పలుమార్లు కోరినప్పటికీ కొలతలు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తు న్నారు. వారిపై చర్యలు తీసుకుని భూమి సమస్యను పరిష్కరిం చాలని కోరాడు.

**భూమి అమ్ముకోవడానికి అనుమతించండి**

ఎన్టీఆర్ జిల్లా నిడమానూరు గ్రామానికి చెందిన ఫణేశ్వరరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో వ్యవసాయ భూమి ఎకరం 17 సెంట్లు ఉంది. కుటుంబ అవసరాలు, పిల్లల చదువుల నిమిత్తం అప్పుల పాలై భూమిని అమ్మదలచినప్పటికీ ఇన్నర్ రింగ్ రోడ్‌కు 500 మీటర్ల పరిధిలో ఉందని చెప్పి అనుమ తి ఇవ్వడం లేదు. గత ఏడేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండ టంతో అప్పుల భారం తీవ్రంగా పెరిగిందని, జీవనాధారం లేక ఇబ్బందులు పడుతున్నాను. తన భూమి విక్రయానికి సంబంధించిన చట్టపరమైన స్పష్టతను ఇచ్చి తగిన పరిష్కార మార్గం చూపాలని కోరాడు.

# దేశంలో పునరుత్పాదక ఇంధన శక్తి కేంద్రంగా ఏపీ

- నీతి ఆయోగ్ బ్లూ ప్రింట్ సిద్ధం
- సీఎస్‌కు అందజేసిన నీతి ఆయోగ్ సీఈవో
- వినియోగదారులకు చవకైన, విశ్వసనీయ విద్యుత్ సరఫరా లక్ష్యం

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఎనర్జీ ట్రాన్సిషన్ బ్లూ ప్రింట్ ముసాయిదాను నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం గురువారం ఏపీ సచివాయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ని కలిసి అందజేశారు. ఈ బ్లూ ప్రింట్ ద్వారా ఏపీని దేశంలోని మూడు ప్రధాన పునరుత్పాదక ఇంధన కేంద్రాల్లో ఒకటిగా అభివృద్ధి చేయడానికి స్పష్టమైన దిశా నిర్దేశం చేసింది. రాష్ట్రంలోని వినియోగదారులందరికీ విశ్వసనీయమైన, చవకైన, శుభ్రమైన విద్యుత్ అందించడమే దీని ప్రధాన లక్ష్యం. ASSET (Accelerating Sustainable State Energy Transition)...ఈ వేదిక స్వర్ణాంధ్ర విజన్, దీర్ఘకాలిక పారిశ్రామిక అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా 2035 నాటికి రాష్ట్ర విద్యుత్ రంగాన్ని సుస్థిరత, సమర్థత, శుభ్రమైన ఇంధన వినియోగ దిశగా మారుస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 47 శాతం పునరుత్పాదక ఇంధనాల నుంచే వస్తోంది. 2035 నాటికి రాష్ట్ర అవసరాల కోసం 35 జీగావాట్ సోలార్, 12 జీగావాట్ విండ్, 55-60 గిగావాట్ అవర్ ఎనర్జీ స్టోరేజ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికలో పేర్కొన్నారు. అదనంగా దేశవ్యాప్త ఎగుమతుల కోసం 30 జీగావాట్ సోలార్, 25-30 జీగావాట్ విండ్, 10-12 జీగావాట్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు ప్రతిపాదించబడ్డాయి.

నీతి ఆయోగ్ అంచనా ప్రకారం 2035 నాటికి విద్యుత్ కొనుగోలు ఖర్చు యూనిట్‌కు రూ.3.90-4.00 వరకు తగ్గే అవకాశం ఉంది. సరఫరా వ్యయాన్ని యూనిట్‌కు రూ.6లోపుగా తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల గృహ వినియోగదారులు, రైతులు, పరిశ్రమల యాజమాన్యాలు గణనీయంగా లబ్ధి పొందుతారు. రాష్ట్ర ఎనర్జీ ట్రాన్సిషన్ కోసం రూ. 3.30-3.40 లక్షల కోట్ల పెట్టుబడి అవసరం కాగా, అదనంగా దేశవ్యాప్త పునరుత్పాదక ఇంధన ఎగుమతి హబ్ నిర్మాణానికి రూ.4.00-4.20 లక్షల కోట్ల పెట్టుబడి అవకాశాలున్నాయి. ఈ పెట్టుబడుల్లో 90 శాతం ప్రైవేట్ రంగం నుంచే వచ్చే అవకాశం ఉండగా, వీటి ద్వారా రాష్ట్రంలోనే 5-6 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయని అంచనా.

మౌలిక వసతుల అభివృద్ధి, రంగ సంస్కరణల్లో భాగంగా, ట్రాన్స్‌మిషన్ రంగంలో 2035 నాటికి రూ. 65,000--70,000 కోట్ల పెట్టుబడులు ప్రతిపాదించబడ్డాయి. గ్రీన్ ఎనర్జీ కారిడార్, GIS సబ్‌స్టేషన్లు, ఎఇజ కారిడార్‌లు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించి ట్రాన్స్‌మిషన్ నెట్వర్కును ఆధునికీకరించనున్నారు. పంపిణీ రంగంలో రూ.40వేల కోట్ల పెట్టుబడితో నెట్వర్కులను బలోపేతం చేయడం, నష్టాలను తగ్గించడం, సరఫరా విశ్వసనీయతను మెరుగుపరచడం, లాభదాయకత వైపు మార్పులు తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ బ్లూ ప్రింట్ ఈ ఏడాది మార్చి ప్రారంభంలో తుది రూపం దాల్చి నీతి ఆయోగ్ ఆధ్వర్యంలోని కేంద్ర స్టీరింగ్ కమిటీకి సమర్పించబడుతుంది. మార్చి మధ్య నాటికి అమలు ప్రారంభమవుతుందని, అమలును పర్యవేక్షించడానికి ప్రత్యేక ఎనర్జీ వార్ రూమ్ ఏర్పాటు చేస్తారని అధికారులు తెలిపారు.

సమావేశంలో నీతి ఆయోగ్ ప్రోగ్రాం డైరెక్టర్ సీహెచ్ పార్థసారథి రెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి, ISEG ఫౌండేషన్ డైరెక్టర్ శిరీష్ సాంకే, నీతి ఆయోగ్ ఉన్నతాధికారులు రోనీ ఖన్నా, కిషోర్, చీ=జుణజాూా వీసీ, ఎండీఎం.కమలాకరబాబు పాల్గొన్నారు.

## నేడు టీటీడీ ఈవోగా రవిచంద్ర బాధ్యతల స్వీకరణ



తిరుమల (చైతన్యరథం): టీటీడీ ఈవోగా నియమితులైన ముద్దాడ రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆయన గురువారం రాత్రి తిరుమల చేరుకున్నారు. తిరుమల గాయత్రి నిలయం అతిథి గృహానికి చేరుకున్న రవిచంద్రకు అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు.

## బూతులకు జగన్ ప్రోత్సాహం

**- మంత్రి మండిపల్లి**

అమరావతి (చైతన్యరథం): బూతులు మాట్లాడేవారి ఇంటికి వెళ్లి పరామర్శలు చేయడం జగన్‌కే సాధ్యమని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎద్దేవా చేశారు. ట్విట్టర్‌లో రెట్టలు వేస్తూ, అడ్డమైన రాతలు రాసే వ్యక్తిని పరామర్శించడం ఒక వింతగా పేర్కొన్నారు. అంబటి రాంబాబు నోటిదురుసుకు మూల కారణం జగనే. విమర్శల పేరుతో దూషణలను ప్రోత్సహించడమే వైసీపీ రాజకీయ సంస్కృతి. ప్రజాస్వామ్యంలో విమర్శలు వేరు, వ్యక్తిగత దూషణలు వేరు.. జగన్‌కు ఈ తేడా తెలియదు. అంబటిని పరామర్శించడం ద్వారా దూషణలకు మద్దతిచ్చినట్లే. బాధ్యతాయుత రాజకీయాలకు ఇది విరుద్ధమని మంత్రి మండిపల్లి స్పష్టం చేశారు.

## కొండపి నియోజకవర్గంలో రోడ్లకు రూ.22.61 కోట్లు విడుదల

**- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు మంత్రి డోలా కృతజ్ఞతలు**

ప్రకాశం/తూర్పునాయుడుపాలెం (చైతన్యరథం): కొండపి నియోజకవర్గంలోని పలు రోడ్లకు రూ.22.61 కోట్లు విడుదల చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జువ్విగుంట ఉప్పలపాడు వయా శివరాయినిపేట రోడ్డుకు రూ.6.7కోట్లు, నాగిరెడ్డిపాలెం చెరుకూరు వయా పైరెడ్డిపాలెం రోడ్డుకు రూ.2.50 కోట్లు, సింగరాయకొండ-రామానందపురం రోడ్డుకు రూ.1.73 కోట్లు, పెల్లురు-వాసేపల్లిపాడు రోడ్డుకు రూ.2.38కోట్లు, కొణిజేడు-పొందూరు రోడ్డుకు రూ.2.41కోట్లు, టంగుటూరు ఆలకూరపాడు వయా మదనూరు రోడ్డుకు రూ.3.20కోట్లు, టంగుటూరు-తాళ్లపాలెం రోడ్డుకు రూ.కోటి, కామేపల్లి-కంద్రిక రోడ్డుకు రూ.2.81కోట్లు, అనకర్ల- రాగలగడ్డపాలెం రోడ్డుకు రూ.51లక్షలు విడుదల చేశారు. కొండపి నియోజకవర్గంలో రోడ్లకు పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

## రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్‌లు..

**16న సీఆర్డీఏ లాటరీ**



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు వేగవంతం చేస్తున్నట్లు పురపాలక, పట్టణాభి వృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈ నెల 16 న ప్లాట్ ల కేటాయింపునకు సీఆర్డీఏ లాటరీ నిర్వహించనుందన్నారు. ఈ - లాటరీ ద్వారా రైతులకు నిబంధనల ప్రకారం ప్లాట్లు కేటాయిస్తారని మంత్రి నారాయణ తెలిపారు. ప్లాట్‌లు పొందిన రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు.

**పలు ప్రాజెక్టుల పరిశీలన**

రాజధానిలో పలు ప్రాజెక్టుల నిర్మాణాలను మంత్రి నారాయణ గురువారం పరిశీలించారు. సీడ్ యాక్సిస్ రోడ్డును ఓల్డ్ హైవేకు కలిపే స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను, గుంటూరు ఛానల్ పై సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానించే బ్రిడ్జి పనులను పరిశీలించిన మంత్రి నారాయణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. ఇప్పటికే వెస్ట్ బైపాస్ పై ఒకవైపు వాహనాల రాకపోకలకు ఎన్‌హెచ్ అధికారులు అనుమతించిన విషయం తెలిసిందే. వెస్ట్ బైపాస్ రోడ్డు రెండు వైపులా అనుమతిస్తే గుంటూరు, విశాఖపట్నం నుంచి నేరుగా రాజధానిలోకి ప్రవేశించే అవకాశం వస్తుంది.

## ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు నూరు శాతం ఖర్చు చేయాలి

**- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి**
**- సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష**



అమరావతి (చైతన్యరథం): ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను నూరు శాతం ఖర్చు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. గురువారం ఆయన వెలగపూడిలోని సచివాలయంలో తన శాఖ అధికారులతో సమీక్షించారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, అట్రాసిటీ బాధితులకు పరిహారం, నూతన హాస్టళ్ల నిర్మాణం, హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు, అడ్మిషన్లు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వినియోగానికి యాక్షన్ ప్లాన్ రూపొందించి 100 శాతం ఖర్చు చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని హాస్టళ్లలో అడ్మిషన్లు శత శాతం పూర్తి కావాలన్నారు. పీఎం అజయ్ కింద నిర్మిస్తున్న నూతన హాస్టళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, అంబేద్కర్ గురుకులాల్లో త్వరితగతిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అద్దె భవనాల్లో ఉన్న హాస్టళ్లకు శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

# 2027 నాటికి పోలవరం పూర్తి లక్ష్యం

## నదుల అనుసంధానంతోనే సస్యశ్యామలం - పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ - సాగునీటి సంఘాల సదస్సుకు హాజరు

అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, రైతాంగ శ్రేయస్సే ధ్యేయంగా నదుల అనుసంధాన ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని రాష్ట్ర పర్యాటక మంత్రి, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. గురువారం అమరావతి పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సాగునీటి వినియోగదారుల సంఘాల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో నీటిపారుదల శాఖపై కనీస అవగాహన లేని మంత్రులను చూశామని, నేడు 24 గంటలు కష్టపడే మంత్రి నిమ్మల రామానాయుడు నేతృత్వంలో నీటిపారుదల శాఖ పరుగు లు పెడుతోందని హర్షం వ్యక్తం చేశారు. గతంలో 'సోమవారం–పోలవరం' కార్యక్రమం ద్వారా ప్రాజెక్టును పరుగులు పెట్టించిన చంద్రబాబు..2027 నాటికి పోలవరం పూర్తి చేసి తీరాలన్న పట్టుదలతో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం నీటిపారుదల వ్యవస్థను గాడిలో పెట్టి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తూ పూర్తి చేస్తోందని తెలిపారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం ద్వారా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలను సుసంపన్నం చేస్తున్నామని పేర్కొన్నారు. నదుల అనుసంధానం వల్లే నేడు అనంతపురం జిల్లా కోనసీమను మించిన ప్రగతిని సాధిస్తోందని గుర్తు చేశారు. అనివార్య కారణాల వల్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ సభకు రాలేకపోయారని తెలిపారు. తుంగభద్ర డ్యామ్ 19వ గేట్ కొట్టుకుపోయినప్పుడు సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించి మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ లను పంపించి కేవలం 5 రోజుల్లోనే సమస్యను పరిష్కరించడం అసామాన్యమని కొనియాడారు. 786 కిలోమీటర్ల పొడవైన హంద్రీనీవా కాలువను బాగు చేసే పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 6,047 నీటి సంఘాలు, 267 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 58 ప్రాజెక్టు కమిటీలు అత్యంత బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నీటి యాజమాన్య నిర్వహణ, చెరువులు నింపడం, భూగర్భ జలాల పెంపు వంటి అంశాల్లో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం మేరకు పనిచేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ మాధవ్, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నీటి సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



# హజ్ యాత్ర విజయవంతానికి కార్యాచరణ

- ఎంబార్కేషన్ నుంచి వెళ్లే వారికి లక్ష సాయం
- న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఫరూక్
- ఏర్పాట్లపై అధికారులతో ప్రత్యేక సమీక్ష

విజయవాడ(చైతన్యరథం): పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే భక్తులందరికీ సకల సౌకర్యాలు కల్పించడం కోసం ప్రత్యేకంగా అన్ని చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెల్లడించారు. గురువారం హజ్ యాత్ర -2026 ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. విజయవాడ నగరంలోని లబ్బీపేట పద్మశాలీయ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన సమీక్షకు మైనారిటీ మంత్రి ఫరూక్ హాజరయ్యారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా, సభ్యులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫారూక్ షుబ్లీ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల హజ్ సొసైటీలు, హజ్ యాత్ర ఇన్‌స్పెక్టర్లు, శిక్షకులు, తదితరులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్




మాట్లాడుతూ ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారందరికీ యాత్ర విజయవంతం కోసం, ఎలాంటి ఇబ్బందులు లేకుండా, రవాణా, వసతి, భద్రత తదితర ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని అన్నారు. జిల్లాల వారీగా ఉన్న హజ్ సొసైటీలు తమ తమ పరిధిలో హజ్ యాత్రి కులకు వ్యాక్సినేషన్, యాత్రలో అవలంబించవలసిన విషయాలపై కూలంకషంగా వివరించేందుకు ప్రత్యేకంగా సమావేశాలు నిర్వ హించాలని సూచించారు. ఇమిగ్రేషన్, మక్కా యాత్రలో అక్కడి వసతుల సౌకర్యాలు తదితర ఏర్పాట్లపై గత ఏడాది తరహాలోనే ఇన్‌స్పెక్టర్లు దగ్గరుండి చూసుకోవాలని ఆదేశించారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి పవిత్రమైన మక్కా హజ్ యాత్రకు వెళ్లే ప్రయాణికులకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందించే ఒక లక్ష రూపాయల ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి హజ్‌కు వెళ్లే వారందరికీ రూ.లక్ష ఆర్థిక సాయం అందిం చేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు మంజూరు చేసిందనే విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాల ఎంబార్కేషన్ కేంద్రాల నుంచి వెళ్లే యాత్రికుల విమాన చార్జీల కంటే ఎక్కువ మొత్తం విజయవాడ నుంచి వెళ్లే వారిపై పడుతున్న భారం తగ్గిం చేందుకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నా రు. ఈ సమీక్షలో హజ్ కమిటీ సీఈవో గౌస్ పీర్, సిబ్బంది పాల్గొన్నారు.

# లొద్ద జలపాతం ప్రారంభం

### పాల్గొన్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సాలూరు(చైతన్యరథం): మండలంలోని కొదమ గిరిజన పంచాయతీలో "లొద్ద జలపాతం" ప్రారంభించిన మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి ప్రారంభించారు. ఆకాశాన్ని అంటిన కొండలు.. అగాధం లాంటి లోయలు.. స్వచ్ఛమైన వాతావరణం..చల్లని గాలి.. పచ్చని చెట్లు..ఇదే లొద్ద గిరిజన గ్రామం. ఇక్కడ తొలిసారి లొద్ద గ్రామానికి రహదారి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిం ది. ఎన్నికల ముందు వచ్చి మాట ఇచ్చి.. ఇప్పుడు మళ్లీ వచ్చి రోడ్డు మంజూరు చేసి మాట నిలుపుకున్నామని మంత్రి తెలిపా రు. లొద్ద జలపాతానికి 6 కిలోమీటర్ల రోడ్డును రూ.6 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి కార్యక్ర మాలపై ఆ ప్రాంత గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రిపై పూలవర్షం కురిపించి హారతులు, సంప్రదాయ గిరిజ న నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. గిరిజన ప్రాంతాల అభి వృద్ధి, పర్యాటక ప్రోత్సాహం, స్థానిక ఉపాధి అవకాశాల సృష్టికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# క్వాంటం వ్యాలీ మరో మైలురాయి

### రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే విజన్ : కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరావతి అభివృద్ధిలో మరో చారిత్రాత్మక మైలురాయిగా ఫిబ్రవరి 7న క్వాంటం వ్యాలీకి శంకుస్థాపన జరగడం రాష్ట్ర భవిష్యత్తును ప్రపంచ స్థాయికి తీసుకె ళ్లే కీలక అడుగుగా నిలిస్తుందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. "మార్పు మొదలైంది... అమరావతి క్వాం టం వేగంతో ముందుకు సాగుతోంది" అని స్పష్టం చేశారు. క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ అత్యాధునిక టెక్నాలజీ, రీసెర్చ్, ఇన్నోవేషన్ రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా అవతరించబోతోందన్నారు. ఇది కేవలం ఒక ప్రాజెక్టు కాదని, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే దీర్ఘకాలిక విజన్‌కు నిదర్శనమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, టెక్నాల జీపై ఉన్న అపార అనుభవమే అమరావతిని భవిష్యత్ రాజధా నిగా తీర్చిదిద్దుతోందని పేర్కొన్నారు. నాలెడ్జ్ ఎకానమీ, ఇన్నోవేష న్, హైటెక్ పరిశ్రమలే రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభాలని ముఖ్యమంత్రి ఎప్పటి నుంచో విశ్వసిస్తూ అదే దిశగా అమరావతిని నిర్మిస్తున్నా రని అన్నారు. "ప్రపంచంతో పోటీ పడగల రాజధాని- గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించే అమరావతి" అన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. లోకేష్ యువ నాయకత్వం, ఆధునిక ఆలోచ నలతో 'క్వాంటం అమరావతి– గ్లోబల్ ఆంధ్రప్రదేశ్ అనే కాన్సెప్ట్ మరింత బలంగా ముందుకు సాగుతోందని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి ఉద్యోగాలు, స్టార్టప్ అవకాశాలు, డీప్‌టెక్, క్వాంటం టెక్నాలజీ రంగాల్లో నైపుణ్య అభివృద్ధే లోకేష్ ప్రధాన లక్ష్యమని అన్నారు. యువత ఉద్యోగాల కోసం రాష్ట్రం విడిచిపెట్టా ల్సిన అవసరం లేకుండా ప్రపంచమే ఆంధ్రప్రదేశ్‌కు రావాలి అన్నదే ఆయన విజన్ అని వివరించారు. క్వాంటం వ్యాలీ ద్వారా వేలాది హై స్కిల్ ఉద్యోగాలు, భవిష్యత్‌కు ఉపయోగపడే కెరీర్ అవకాశాలు యువతకు లభిస్తాయని స్పష్టం చేశారు. కార్మిక శాఖగా పరిశ్రమలకు అవసరమైన స్కిల్ ట్రైనింగ్, ఉద్యోగ భద్రత, ఆధునిక పని సంస్కృతి ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. అమరావతి అభివృద్ధి ఇటుకలు సిమెంట్ వరకు మాత్రమే కాకుండా భావితరాలకు అవకాశాలు, గౌరవం, గ్లోబల్ గుర్తింపు అందించే మహా విజన్‌గా ముందుకు సాగుతోం దని తెలిపారు. క్వాంటం వ్యాలీ శంకుస్థాపనతో ఆంధ్రప్రదేశ్ ప్రపంచ స్థాయి టెక్నాలజీ హబ్‌గా ఎదిగే దిశగా మరో బలమైన అడుగు పడిందని పేర్కొన్నారు.

# స్థానిక అసోసియేషన్లకే జీవీఎంసీ పార్కుల నిర్వహణ

**● ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**



మధురవాడ (చైతన్యరథం): స్వతంత్ర నగర్ కాలనీలో అనేక ఏళ్లుగా నివాసాలు ఏర్పరచుకున్న పేదలకు న్యాయం చేసేలా శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. స్వతంత్ర నగర్ పార్కును.. దాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలోని ఇళ్లను గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 2014-19 మధ్యలో తాను మంత్రిగా ఉన్నప్పుడు 30 మందికి ఇళ్ల పట్టాలిచ్చినట్టు చెప్పారు. మిగిలిన వారికి కూడా ఇళ్ల పట్టాలివ్వాలని అడుగుతున్న నేపథ్యంలో సాధ్యాసాధ్యాలపై జోనల్ కమిషనర్ను నివేదిక అందజేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపిస్తామని తెలిపారు. 6వ వార్డులోని యోగా థీమ్ పార్కును స్థానిక అసోసియేషన్ సమర్ధంగా నిర్వహిస్తోందని ప్రశంసించారు. అదే బాటలో 5, 7, 8 వార్డుల్లోని జీవీఎంసీ పార్కుల నిర్వహణ కూడా స్థానికంగా ఉన్న అసోసియేషన్లకు అప్పగించనున్నట్లు చెప్పారు. అన్ని పార్కుల్లోనూ విధిగా ప్రాథమిక వసతులు సమకూర్చాలన్నారు.

# సమన్వయంతో జాతరను దిగ్విజయంగా నిర్వహించాలి

**● అధికారులకు ఎమ్మెల్యే కళా వెంకట్రావు సూచన**



చీపురుపల్లి (చైతన్యరథం): ఈనెల 22 నుంచి మూడు రోజులపాటు జరగనున్న ఉత్తరాంధ్ర ప్రాంత ఆరాధ్యదైవం చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో దిగ్విజయంగా నిర్వహించాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, మండల పరిషత్, అగ్నిమాపక, ఎక్సైజ్, గ్రామీణ నీటి సరఫరా, వైద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు జాతర విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు మూడు రోజులపాటు అందుబాటులో ఉండాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జాతర ప్రాంగణంలో 50 సీసీ కెమెరాలు, మూడు డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేయాలని డీఎస్పీ ఎస్ రాఘవులు సూచించారు. జాతరకు బందోబస్తు అతి కీలకమని అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. వినోద, సాంస్కృతి కార్యక్రమాలు జరిగే వేదిక చుట్టూ భారీ గేట్లు ఏర్పాటు చేయాలన్నారు. సాయంత్రం ఐదు గంటలు దాటాక శ్రీకాకుళం రహదారిలో రావివలస కూడలు దాటాక రద్దీ అధికంగా ఉంటుందని, రోడ్డు పక్కన దుకాణాలను ఏర్పాటు చేయవద్దని కమిటీ సభ్యులకు డీఎస్పీ సూచించారు. కొత్తవలస, ఎస్. కోట, గజపతినగరం గరివిడి, గర్భం మేజర్ పంచాయతీ నుంచి పారిశుద్ధ్య సిబ్బందిని డిప్యుటేషన్పై వేసి పారిశుద్ధ్య పనులు చేపడతామని ఎంపీడీవో సురేష్ తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, సీఐ జి. శంకర్రావు, ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, కూటమి నాయకులు త్రిమూర్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# గుండ అప్పల సూర్యనారాయణ జీవితం స్ఫూర్తిదాయకం

**●ఆయన వారసులు రాజకీయాల్లోకి రావాలి**



శ్రీకాకుళం (చైతన్యరథం): తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు గుండ అప్పల సూర్యనారాయణ మృతి తనను ఎంతో బాధించిందని తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ అన్నారు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకొని గురువారం సాయంత్రం అరిసవెల్లి శ్రీకాకుళంలో వారి ఇంటికి వెళ్లి వారి సతీమణి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలుగు శక్తి కార్యక్రమాల్లో, సమావేశంలో ఆయన నిత్యం తనతో పాటు పాల్గొని మమ్మల్ని ఎంతో ప్రోత్సహించే వారని బి.వి.రామ్ అన్నారు. నీ అంత ధైర్యవంతుడు ఎవరూ లేరని అప్పలసూర్యనారాయణ ఎప్పుడు చెప్పే వారిని గుర్తు చేసుకున్నారు. ఆయన మహానుభావుడు, నిగర్వి, ఎవరినైనా చిరునవ్వుతో పలకరించే అప్పల సూర్యనారాయణ మా మధ్య లేకపోవడం జీర్ణించుకోలేకపోతున్నాం. ఆయన స్వర్గస్తులు కావడం నిజంగా బాధాకరం. ఎన్టీ రామారావు క్యాబినెట్లో తొలిసారిగా మంత్రి పదవిలోకి తీసుకున్నారు. ఆయన అనుభవాలు రాజకీయ భవిష్యత్తు తరాలకు తెలియాలి. ఆయన తరపున వారసులు రాజకీయాల్లోకి రావాలని సిఎం చంద్రబాబునాయుడు వారి వారసులను ప్రోత్సహించి రాజకీయాల్లోకి తీసుకురావాలని కోరారు. ఆయన భావాలు, ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్తామని జోహార్లు అర్పించారు.

# సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే తోయక



పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా, కురుపాం నియోజకవర్గం, కొమరాడ మండలం గుణనాపురం గ్రామానికి చెందిన కలిశెట్టి రమాదేవి అనారోగ్యానికి గురైన విషయం కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయకజగదీశ్వరి దృష్టికి రావడంతో, ఆయనకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.30,028/- చెక్కును మంగళవారం నాడు కురుపాం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంపు కార్యాలయంలో బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన ప్రతి ఒక్కరికీ సహాయ చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇలాంటి బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సేనాపతి శేఖర్ పాత్రుడు మార్కెట్ వైస్ ఏఎంసి గౌరీ శంకర్, జనసేన మండల కన్వీనర్ తెంటు శ్రీకర్ మరియు ప్రధాని కాదు కొమరాడ మండల ప్రధాన కార్యదర్శి మరాడన కిషోర్, కొమరాడ క్లస్టర్ కన్వీనర్ బొంగు భాను, జనసేన నాయకులు పప్పల గోపాలకృష్ణ, స్థానిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పరిపాలన సౌలభ్యం రీత్యా పనులు వేగవంతం

**●పరిపాలన వికేంద్రీకరణ ఘనత సీఎం చంద్రబాబునాయుడుదే**

**●ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**



రంపచోడవరం (చైతన్యరథం): పరిపాలనాభివృద్ధి వేగవంతంగా ఉండాలంటే సౌలభ్యం ప్రాముఖ్యమని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన గుర్తేడుమండల ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తొలుత ఆమె పలు శాఖల భవనాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం గుర్తేడు సర్పంచ్ గొర్లె దుష్యంతుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం సంస్కరణలు చేయటంలో ముందంజలో ఉంటుందన్నారు. అలాగే ప్రజా సౌలభ్యంపై ఒక నిర్దిష్టమైన ప్రణాళిక కలిగి ప్రజా సంక్షేమ, అభివృద్ధిపై నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెదేపా వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పరిపాలన వికేంద్రీకరణలో కీలకంగా కృషి చేసారన్నారు. ఆయన కృషి ద్వారా మండలాల వ్యవస్త ఏర్పడిందన్నారు. అప్పట్లో గుర్తేడు ప్రాంత గ్రామాలు వై.రామవరం మండలంలో ఉండటం ఈ ప్రాంత ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే చాలా దూరభారం, వ్యయ ప్రయాసలు పడేవారన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో పునరాలోచన చేసి నూతనంగా గుర్తేడు మండలాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. నేటి నుండి మండల కేంద్రమైన గుర్తేడులోనే అన్ని శాఖల కార్యనిర్వహణ చేయటం జరుగుతుందన్నారు. దానిని ప్రజలు మంచిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టండి

**● అధికారులకు ఎం.వి ప్రణవ్‌గోపాల్ ఆదేశాలు**



విశాఖపట్నం (చైతన్యరథం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ నెల 18వ, 19వ తేదీలలో విశాఖలో జరుగుతున్న (IFR) అంతర్జాతీయ యుద్ధనౌకల విన్యాసాల సందర్భంగా VMRDA నిర్వహిస్తున్న ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో చేపడుతున్న మరమ్మత్తు పనులను, పచ్చదనం పెంపునకు సంబంధించిన పనులను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్‌గోపాల్ మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్‌భరత్ ఆదేశించారు. వివిధ పర్యాటక ప్రాంతాల్లో ప్రగతిని క్షేత్రస్థాయిలో చైర్మన్ ఎం.వి ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్‌భరత్ కలిసి సంయుక్తంగా పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖలో జరిగే అంతర్జాతీయ యుద్ధ నౌకల విన్యాసాల సమీక్షను విజయవంతం చేసేలా పలు సూచనలు చేశారని చైర్మన్ ఎం.వి ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనలతో వి.ఎం.ఆర్.డి.ఎ పరిధిలో అన్ని పర్యాటక ప్రాంతాలని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అన్నీ చోట్ల ఎక్కడక్కడ డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసి, శుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, అదేవిధంగా టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్‌భరత్ మాట్లాడుతూ... పచ్చదనం మరింత పెంచాలని, సందర్శకులకు త్రాగునీటి సదుపాయం కల్పించాలని, వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే విజయచంద్ర




పార్వతీపురం (చైతన్యరథం): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే నా ఎజెండా అని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు వినతల రూపంలో అందించిన సమస్యలను పరిశీలించి వాటిలో తక్షణమే పరిష్కరించాల్సినవి అక్కడికక్కడే పరిష్కార మార్గాన్ని చూపారు. మరి కొన్ని సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. పార్వతీపురం నియోజవర్గంలో ఉన్న ప్రతి సమస్యను తక్షణ పురస్కారానికి కృషి చేస్తానని అన్నారు.

## ఆర్వోబి నిర్మాణంలో సమన్వయంతో పనిచేయాలి

**●అధికారులకు ఎమ్మెల్యే బడేటి చంటి పలు సూచనలు**



ఏలూరు (చైతన్యరథం): నగర ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే పవర్ పేట రైల్వేగేటు వద్ద నిర్మించే రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగితే అనుకున్న ప్రయోజనాలు పొందవచ్చునని ఏలూరు ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షులు బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు పవర్ పేట రైల్వేగేటు వద్ద ఆర్వోబి నిర్మాణానికి సంబంధించి డిపిఆర్ ఖరారు చేసేందుకు క్షేత్రస్థాయి పరిశీలనను గురువారం నిర్వహించారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసి విజయవాడ జోన్-2 చైర్మన్‌రెడ్డి అప్పలనాయుడు, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్‌తో పాటూ వివిధ శాఖల అధికారులు ఆ ప్రాంతంలో పరిశీలన జరిపారు. పవర్‌పేట స్టేషన్ ప్రాంతంలోని రైల్వేగేటు మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. అయితే ఇటుగా రైళ్ళు వెళ్ళిన సమయంలో గేటు మూసివేయడం, తిరిగి తెరిచేంత వరకూ వాహనాలు బారులు తీరడం వెరసి అక్కడ ట్రాఫిక్ సమస్య పెద్ద తలనొప్పిగానే మారింది. ఎన్నో ఏళ్ళగా ఈ సమస్య పరిష్కారానికి ఎంతో మంది ప్రజాప్రతినిధులు కృషిచేస్తామని చెప్పారే తప్ప... తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. దీంతో ఇక్కడ బ్రిడ్జి నిర్మాణానికి ప్రాథమిక అనుమతులు లభించడంతో డిపిఆర్ సిద్ధంచేసే పనిలో అధికారులు ముందడుగు వేశారు. దీనిలో భాగంగానే గురువారం ఆ ప్రాంతంలో పర్యటించి ఎక్కడ వరకూ ఆర్వోబి నిర్మిస్తారు, సర్వీసు రోడ్డు ఏ పక్కన వస్తాయి తదితర అంశాలను పరిశీలించారు. కొన్నిచోట్ల మార్కింగ్‌లు కూడా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి రైల్వే అధికారులను అడిగి పలు విషయాలను తెలుసుకున్నారు. ప్రజలకు ఉపయోగకరమైన ఈ ఆర్వోబి నిర్మాణం విషయంలో అన్నిశాఖల అధికారులు చురుగ్గా వ్యవహరించాలని సాధ్యమైనంత వరకు గేటు పరిసర ప్రాంత నివాసులకు నష్టం జరగకుండా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, తహశీల్దార్ గాయత్రి దేవి, రైల్వే, ఆర్అండ్‌బి, రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## హరిజనవాడలో అభివృద్ధి పనులకు శ్రీకారం



నూజివీడు (చైతన్యరథం) : ప్రధానమంత్రి గ్రామీణ యోజన పథకం ద్వారా పోతురెడ్డిపల్లి గ్రామపంచాయతీకి ఎస్సీ ఏరియాలో డ్రైన్లకు 20 లక్షల రూపాయలు నిధులు మంజూరైయ్యాయని వాటితో హరిజనవాడలో డ్రైన్లకు కేటాయించడం జరిగిందని టీడీపీ నాయకులు తెలిపారు. గురువారం డ్రైన్లకు శంకుస్థాపన చేసిన నాయకులు మాట్లాడుతూ... తమ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు అడిగిన వెంటనే నిధులు విడుదల చేసిన నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, పనులు చేయటం మొదలు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల పార్టీ అధ్యక్షులు మదల వాసు, మాజీ సర్పంచ్ అక్కినేని చందు, పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ అక్కినేని బెనర్జీ, గ్రామ పార్టీ అధ్యక్షులు బాబి, మున్ని, తాడేపల్లి సునీత, స్థానిక కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ఆలయాల పునర్నిర్మాణాలకు నిధులు మంజూరు చేయండి



ప్రత్తిపాడు (చైతన్యరథం): జిల్లా కేంద్రమైన తూర్పుగోదావరిలోని ప్రత్తిపాడు గ్రామంలోన కొండపై స్వయంభుగా వెలసిన శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి వారి దేవాలయ పునర్నాణానికి శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వరపుల సత్యప్రభకు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. గణపతి, భద్రకాళీ, అంజనేయస్వామి ఆలయాలు, యాగశాల శిథిలమై పోయాయని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. తితిదే నుంచి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆ ఆలయాల పునర్నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజా కింగు బాబురాజు, సభ్యులు ముక్కు సుబ్రహ్మణ్యం, బేతా ఈశ్వరరావు, సింగిలిదేవి సత్తిరాజు, రాసంశెట్టి రాజా, కందా వీరాస్వామి, తిరుపతిరావు తదితరులు వినతిపత్రం ఇచ్చినవారిలో ఉన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి : అదితి



విజయనగరం (చైతన్యరథం): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అధికారులకు సూచించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయాలకు ఆమె ప్రింటర్లను అందించారు. నగరంలోని డివిజన్లు, గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల అవసరాలు గుర్తించాలని, ప్రతి కుటుంబం సంతోషంగా ఉండే విధంగా ప్రభుత్వ సేవలు అందించాలని ఆమె సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ప్రజలు ఉద్యోగులు భాగస్వాములు కావాలని కోరారు. మేయర్ విజయలక్ష్మి, కమిషనరు అప్పలరాజు, ఏఎంసీ చైర్మన్ నర్సింగ్ రావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## శానంపూడి - మతుకుమలి కాజ్వే నిర్మాణానికి చీఫ్ విప్ జీవీ శంకుస్థాపన



వినుకొండ (చైతన్యరథం): నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జీవీ ఆంజనేయులు గారు అన్నారు. గురువారం శావల్యాపురం మండలం శానంపూడి గ్రామం నుంచి మతుకుమల్లి వరకు వెళ్లే మార్గంలో వాగుపై 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న కాజ్వే పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. జీవీ మాట్లాడుతూ..వర్షాకాలంలో ఈ వాగు పొంగి ప్రవహించడం వల్ల శానంపూడి, మతుకుమల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారని, ఈ కాజ్వే నిర్మాణంతో ఆ సమస్య శాశ్వతంగా తొలగిపోతుందని తెలిపారు. రూ. 40 లక్షల నిధులతో చేపట్టే ఈ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి బి.టి. రోడ్లు, డ్రైనేజీలు మరియు రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

## రానున్న పుష్కరాలకు సన్నద్ధంగా ఉండాలి : ముప్పిడి



కొవ్వూరు (చైతన్యరథం): రానున్న పుష్కరాలను పెద్దఎత్తున నిర్వహించేందుకు ప్రభుత్వం అన్నివిధాలుగా కృషి చేస్తుందని కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో గోదావరి ఒడ్డున వున్న లంకలను అధికారులతో కలిసి పరిశీలించారు. గట్టు ప్రక్కన వున్న భూములను పీపీపీ మోడ్‌లో డీసీఆర్ తయారు చేసి అందంగా తీర్చి దిద్దాలనే లంక భూములలో పర్యటిస్తున్నామన్నారు. లంక భూములలో టూరిజం డిపార్ట్మెంట్ ద్వారా తాత్కాలిక భవనాలు, కాటేజీలు లేదా వచ్చే టూరిస్టుల కోసం పర్మినెంట్‌గా భావాలు నిర్మించాలని, వంతెన సమీపంలో ఐకాన్ టూరిజం పార్క్ అభివృద్ధి చేయాలని, ఇతర అభివృద్ధి పనులకు రూ. 35.50 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ముఖ్యమంత్రికి, టూరిజం మంత్రి ప్రతిపదనలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో RDO రాణి సుస్మిత, సూరపని చిన్ని, అర్జిల్లి రామకృష్ణ, ఉప్పులూరి బాబ్జి, కొవ్వూరు తాసిల్దార్, RD టూరిజం, మూర్తి, వెంకటాచలం, విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోజుకో ఊరిలో... రాత్రి వేళలో వేటాడుతున్న పెద్దపులి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లాలో మాటు వేసిన పెద్దపులి ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. రోజుకో ఊరిలో సంచరిస్తూ రాత్రివేళల్లో వేటాడుతూ, ఉదయం పూట సేద తీరుతోంది. గ్రామాల్లోని పశువులపై పెద్దపులి పంజా విసురుతోంది. పుణ్యక్షేత్రం గ్రామంలోని పామాయిల్ తోటలో ఆవును చంపిన పెద్దపులి, జి.ఎర్రంపాలెంలోని 3 ఆవులను మింగేసి మరో మూగజీవిని తీవ్రంగా గాయపరిచింది. పులిని పట్టుకునేందుకు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినా చిక్కడం లేదు. హడలెత్తిస్తున్న పెద్దపులిని మత్తుమందు ఇచ్చి బంధించేందుకు అధికారులు యత్నిస్తున్నారు.

**థర్మల్ డ్రోన్స్ ద్వారా పులిజాడ:**
ఎర్రంపాలెంలో కలెక్టర్, ఎస్పీ, అటవీశాఖ అధికారుల పర్యటించారు. థర్మల్ డ్రోన్స్ ద్వారా పులిజాడ గుర్తించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ కీర్తి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పులి కదలికలపై విశ్లేషణ జరుగుతుందని ఆమె అన్నారు. పులి మళ్లీ ఇదే ప్రాంతానికి వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని ఆమె పేర్కొన్నారు. రాత్రిపూట ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. పులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ, పోలీసులకు సమాచారం ఇవ్వాలని పులిని పట్టకోవడానికి ప్రజల సహకారమే అత్యంత కీలకమని కలెక్టర్ కీర్తి అన్నారు.

**పుణే నుంచి రెస్క్యూ బృందం:**
అంతేకాకుండా పెద్దపులిని పట్టుకునేందుకు పూర్తి సాంకేతికతను వినియోగిస్తున్నామని రాజమహేంద్రవరం సీసీఎఫ్? బీఎన్ఎన్ మూర్తి తెలిపారు. ప్రజలు పెద్దపులి ప్రశాంతతకు భంగం కలిగించవద్దని విజ్ఞప్తి చేశారు. రాజానగరం మండలం జి. ఎర్రంపాలెంలో పెద్దపులి ఆవు దూడలను చంపేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. పులికి మత్తు ఇచ్చి సురక్షితంగా పట్టుకునేందుకు జాతీయ పులుల సంరక్షణ అథారిటీ నుంచి అన్ని అనుమతులు తీసుకున్నామని తెలిపారు. పూణే నుంచి రెస్క్యూ చారిటబుల్ ట్రస్ట్ సంబంధించిన ఐదుగురు సభ్యుల బృందం జీరంపాలెం చేరుకుంది. అటవీ అధికారులతో కలిసి బృందం సభ్యులు ఘటన స్థలిని పరిశీలించారు.

**సమాజానికి నిస్వార్థ సేవ చేయడమే నిజమైన రాజకీయం**

# కొండవీడును ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి ఆశయం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆధ్వర్యంలో 2019 ఫిబ్రవరిలో కొండవీడు ఉత్సవాలు నిర్వహించామని, మరలా ఇన్నేళ్ల తర్వాత అప్పటికంటే ఘనంగా భావితరాలకు కొండవీడు చారిత్రక గొప్పతనం తెలిసేలా 7, 8 తేదీల్లో ఉత్సవాలకు శ్రీకారం చుట్టామని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం కొండవీడు ఫెస్ట్ -2026 ప్రచార కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేట పట్టణంలో నిర్వహించిన 2కె రన్‌లో ప్రత్తిపాటి పాల్గొన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, డీ.ఎఫ్.ఓ, ఇతర ప్రధానాధికారులు, కూటమి నాయకులతో కలిసి రన్‌లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రెడ్డిరాజుల ఘనచరిత్రకు ప్రతీక అయిన కొండవీడు కోట గొప్పతనం భావితరాలకు తెలియచేయాలన్న ఆలోచనతోపాటు, కోటను ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయంలో భాగంగా భారీ ఎత్తున కొండవీడు ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ చూడని, అనుభూతి చెందని ప్రత్యేక కార్యక్రమాలు ఉత్సవాల్లో ఏర్పాటు చేశామన్నారు. కొండ పైన, దిగువన పర్యాటకుల ఆనందమే లక్ష్యంగా వివిధ వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ప్రత్తిపాటి చెప్పారు. కొండవీడు ఉత్సవాల ప్రారంభ వేడుకలకు ప్రత్యేక అతిథులుగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి రానున్నారని ప్రత్తిపాటి చెప్పారు. వారితో పాటు ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారని ప్రత్తిపాటి తెలిపారు. 7వ తేదీ సాయంత్రం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, పలువురు శాసనసభ్యులు వేడుకల్లో సందడి చేస్తారన్నారు. 8వ తేదీ ఉదయం రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేశ్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి విచ్చేస్తారని, సాయంత్రం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీమంత్రి గంటా శ్రీనివాసరావులు ప్రత్యేక అతిథులుగా విచ్చేయనున్నట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు. వీరే కాకుండా మరికొందరు ప్రజాప్రతినిధులు ఉత్సవాల్లో పాల్గొని సందడి చేస్తారని ఆయన చెప్పారు. డైనమిక్ కలెక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో, కొండవీడు ఉత్సవాలతో పాటు కోటప్పకొండ తిరునాళ్ల కార్యక్రమాలు ప్రజలు మెచ్చేలా ఈ ఏడాది భారీస్థాయిలో జరగనుందని ప్రత్తిపాటి తెలిపారు. 2కె మారథాన్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహించిన భారీ జాబ్ మేళా ఘన విజయాన్ని సాధించింది. ఈ కార్యక్రమంలో వందలాది మంది యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాను ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మరియు స్కిల్స్ డెవలప్‌మెంట్ మరియు ట్రైనింగ్ విభాగం సమన్వయంతో ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 15 ప్రముఖ జాతీయ మరియు బహుళజాతి సంస్థలు పాల్గొని యువతకు ప్రత్యక్ష నియామక అవకాశాలు కల్పించాయి. ఐటీ, ఫార్మా, తయారీ, హెల్త్‌కేర్, రిటైల్, ఫైనాన్స్ తదితర రంగాల్లో పలు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు. 10వ తరగతి నుండి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఫార్మసీ, నర్సింగ్ తదితర అర్హతలు కలిగిన అభ్యర్థులు పాల్గొన్నారు. పురుషులు మరియు మహిళలకు సమాన అవకాశాలు కల్పించబడ్డాయి. ఈ జాబ్ మేళా ద్వారా వేమూరు నియోజకవర్గంలోని గ్రామీణ మరియు పట్టణ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రజాస్వామ్యం పేరు చెప్పే హక్కు కూడా వైసీపీకి లేదు..!

- తిరుపతి లడ్డులో తీగ లాగితే శ్రీశైలంలో డొంక కదిలింది
- వైసీపీ పెంచి పోషించిన విషపు విత్తనాలే ఆపార్టీని దహించివేస్తున్నాయి : దేవినేని ఉమామహేశ్వరరావు



విజయవాడ (చైతన్యరథం): వైసీపీ నాయకులకు ప్రజాస్వామ్యం, హక్కులు, విలువలపై మాట్లాడే అర్హతే లేదని టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గొల్లపూడిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వైసీపీ పార్టీ, జగన్మోహన్ రెడ్డిపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పల్నాడులో టీడీపీ కార్యకర్తలపై జరిగిన దాడుల అనంతరం బాధితులను పరామర్శించేందుకు వెళ్లకుండా, చంద్రబాబు నాయుడు నివాసం వద్ద గేట్లకు తాళాలు వేసిన వారు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరమని ఉమ ఎద్దేవా చేశారు. "అది ప్రజాస్వామ్యమా..? లేక నియంతృత్వమా..?" అంటూ ప్రశ్నించారు. గుంటూరు పరామర్శల సందర్భంగా కల్తీ నెయ్యి కేసులో బాబాయ్‌కు క్లీన్ చిట్ ఇచ్చారని చెప్పుకుంటూ మాట్లాడుతున్న వైసీపీ నేతల మాటలకు నైతిక విలువలే లేవన్నారు. "తిరుపతి లడ్డులో తీగ లాగితే... శ్రీశైలంలో లడ్డు డొంక కదిలినట్టు వ్యవహారం బయటపడుతోంది" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైవీ సుబ్బారెడ్డికి తెలియకుండానే చిన్నప్పన్న వందల కోట్ల రూపాయల లావాదేవీలు జరిపాడా? అని ప్రశ్నించిన ఉమ, ఈ మొత్తం వ్యవహారంపై వైసీపీ నేతలు ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలన్నారు. కుసంస్కారంగా బూతులు మాట్లాడిన వారిని పొగడుతూ, అదే రాజకీయ సంస్కారమన్నట్టు మాట్లాడటం వైసీపీ దౌర్భాగ్య రాజకీయానికి నిదర్శనమని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యే జుట్టుపట్టుకొని లాక్కొస్తామంటూ మాట్లాడిన మాటలు వైసీపీ నేతల మానసిక స్థాయిని బయటపెడుతున్నాయని మండిపడ్డారు. అమరావతిలో మహిళా రైతును కడుపులో తన్నించిన చరిత్ర ఉన్నవారు, ఈరోజు హక్కులు, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఉమ అన్నారు. యూనిఫాంలు విప్పదీస్తామంటూ మాట్లాడటం ఏ సంస్కారమని ప్రశ్నించారు. "వైసీపీ పెంచి పోషించిన విషపు విత్తనాలే ఈరోజు బూతుల వృక్షాలుగా మారి ఆ పార్టీని దహించివేస్తున్నాయి. ప్రజలు అన్నీ గమనిస్తున్నార"న్నారు.

# ఇదేమి పరామర్శ జగన్? : ఎమ్మెల్యే నసీర్

- మీరు చేసింది పరామర్శా? రాజకీయ జాతరా?
- ఏనాడైనా ప్రజా సమస్యలపై స్పందించావా?



గుంటూరు (చైతన్యరథం): అధికారంలో ఉన్నప్పుడు పరదాలు కట్టుకుని ప్రజలను కలవకుండా దాక్కున్న పులివెందుల ఎమ్మెల్యే జగన్.. ఇప్పుడు అంబటి పరామర్శ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ శ్రేణులను గుంటూరు తరలించి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించి జాతర చేయమేమిటని? గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ ప్రశ్నించారు. స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో గురువారం కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే నసీర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ... సుమారు రెండేళ్ల కాలంలో ఏ రోజు అయినా ప్రజల కోసం బయటికి వచ్చావా? ఇదేమి పరామర్శ జగన్ అంటూ మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టినా ఇంకా వైసీపీకి బుద్ధి రాలేదన్నారు. తాడేపల్లి నుంచి గుంటూరుకు కేవలం 35 నిమిషాల సమయం పడుతుందని, అలాంటి కార్యక్రమానికి సుమారు ఏడు గంటలపాటు యాత్రలా చేయడమేమిటని నిలదీశారు. ట్రాఫిక్‌తోపాటు అంబులెన్స్‌లకు కూడా దారి ఇవ్వాలనే ఇంగితజ్ఞానం మరిచి యాత్ర చేశారని, దీనిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంపై దాడి, తెలుగుదేశం పార్టీ స్పోక్ పర్సన్ పట్టాభి ఇంటిపైకి వెళ్లి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసిన విషయం గుర్తు లేదా అని నిలదీశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తూర్పు గోదావరి జిల్లాలో చంద్రబాబునాయుడు యాత్రను జీవో నంబర్ వన్ సాకుతో అడ్డుకున్న విషయం మరిచావా? మంత్రి లోకేశ్ పాదయాత్రను అడ్డుకుంది మీరు కాదా? మాస్కులు లేవని ప్రశ్నించినందుకు డాక్టర్ సుధాకర్‌పై పిచ్చివారనే ముద్రవేసి చంపేసింది మీరు కాదా? అసెంబ్లీ సాక్షిగా తమ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబంపై దాడికి పాల్పడిన విషయం గుర్తు లేదా? ఎవరిది జంగిల్ రాజ్యం? ఎవరు జంగిల్ రాజా? ఒక్కసారి ఆలోచించుకో జగన్? అంటూ ఎమ్మెల్యే నసీర్ నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఏ రోజైనా ఎప్పుడైనా ప్రజల గురించి మాట్లాడావా? రప్పా రప్పా అంటూ సైకోల్లాగా వ్యవహరిస్తోన్న వైసీపీ శ్రేణుల తీరుపై ఏనాడైనా స్పందించావా జగన్? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా చేసిన తప్పులు తెలుసుకుని ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, మరోసారి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

# జగన్ కల్తీ నెయ్యి దేవాలయాలు అపవిత్రం : వాసు పాదిల

- దేవాలయాలను అవినీతితో ఆదాయ వనరుగా మార్చుకున్నారు

మండిపడ్డ గుంటూరు పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి

గుంటూరు (చైతన్యరథం): "దేవాలయంలో ప్రసాదం పవిత్రత భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక పరంపరకు ప్రతీక. ప్రసాదంలో అపవిత్రత చోటు చేసుకోవడం అంటే కేవలం నాణ్యత లోపం కాదు, కోట్లాది భక్తులపై జరిగిన తీవ్రమైన దెబ్బ. గత వైసీపీ ప్రభుత్వం ఆధ్యాత్మిక దేవాలయాలను అవినీతితో, ఆదాయ వనరుగా మార్చుకున్నారు. డబ్బు కోసం గడ్డి తినే వాళ్లే ఇలాంటి నీచకర్మలకు పాల్పడతారు. జగన్మోహన్ రెడ్డి పాలన ఆద్యంతం కల్తీలే – మాటల్లో మాయ, చేతల్లో దోపిడీ. తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి కలపడం ద్వారా దేవాలయ పవిత్రతను భంగం చేశారు. ఈ వ్యవహారంతో కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దేవాలయ టెండర్లలో పారదర్శకత పూర్తిగా లేకుండా పోయింది. ప్రసాదాల సరఫరాలో నాణ్యత నియంత్రణను ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. తద్వారా రూ. 250 కోట్ల అవినీతికి పాల్పడ్డారు. అదే విధంగా శ్రీశైలం మల్లన్న సన్నిధిలోనూ ఇలాంటి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వస్తున్నాయి. కల్తీ నెయ్యిలో భాగంగా దాదాపు రూ, 16 కోట్ల దోపిడికి పాల్పడ్డారు. జరిగిన, జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన దేవాలయాల్లో కల్తీ నెయ్యి జరిగిందన్న అనుమానాలు వస్తున్నాయి. కల్తీ నెయ్యి కోసం ప్రమాదకర రసాయనాలు వాడారని తెలుస్తుంది. అంటే హిందువుల ఆరోగ్యాలని హరించి, తద్వారా లబ్ధి పొందే కుట్రలకు జగన్మోహన్‌రెడ్డి తెరతీశారు. హిందువుల దేవాలయాలపై ఆయనకు భక్తి, మక్కువ లేవు కాబట్టే దేవాయాలను అడ్డం పెట్టుకొని అక్రమార్జనకు పాల్పడ్డారు. గత వైసీపీ హయాంలో దేవాలయ ఉద్యోగులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చారు. భక్తుల విశ్వాసాన్ని పట్టించుకోని పాలన కొనసాగింది. దేవాలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా కాక వ్యాపార కేంద్రాలుగా చూశారు. అక్రమాలపై ప్రశ్నించిన వారిపై బెదిరింపులు, కేసులు పెట్టారు. కాబట్టి దేవాలయాలకు సంబంధించిన ప్రతి అంశంపైనా స్వతంత్ర విచారణ అవసరం. బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి. ఆలయ నిధులు భక్తులకే ఉపయోగపడేలా చూడాలి. ప్రసాదాల తయారీలో నాణ్యత ప్రమాణాలు కఠినంగా అమలు చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చట్టబద్ధమైన రక్షణ అవసరం. దేవాలయాల పవిత్రత కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత. పురాణాల ప్రకారం దేవాలయం కేవలం కట్టడమే కాదు అది భక్తి, విశ్వాసం, ధర్మానికి ప్రతీక.. ఆలయ పవిత్రతను భంగం చేయడం అంటే ధర్మాన్ని అవమానించడమే. దేవాలయ సంపద భక్తులది దానిపై దోపిడీ చేయడం మహాపాపమని శాస్త్రాలు స్పష్టంగా చెబుతున్నాయి. కాబట్టి, దేవాలయాలు, హిందువుల మనోభావాలు, ఆలయాలకు సంబంధించిన ప్రతి అంశంలో సమగ్ర, స్వతంత్ర విచారణ జరగాల్సిందే." అని వాసు పాదిలి వ్యాఖ్యానించారు.

# ప్రతి సమస్యకూ శాశ్వత పరిష్కారం

## ప్రజా దర్బార్‌లో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు, (చైతన్యరథం): కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరక్కుండా.. వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 40వ డివిజన్‌లో జరిగిన ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు పాల్గొన్నారు. స్థానిక ప్రజల నుంచి ఆయన వినతి పత్రాలను అందుకున్నారు. ఇల్లు, ఇళ్ల స్థలాలతో పాటు పెన్షన్ కు సంబంధించి అర్జీలు వచ్చినట్లు వివరించారు.. కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి స్పాట్ లోనే పరిష్కరించినట్లు వివరించారు. మిగిలిన వాటిని కూడా మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రజా దర్బార్ పేరుతో మంత్రి పొంగూరు నారాయణ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. సిటీని నాలుగు క్లస్టర్స్ గా విభజించి .. ఒక్కో క్లస్టర్‌ను ఒక్కో అదనపు కమీషనర్‌కు భాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. సమస్యను ఎన్ని రోజుల్లో పరుస్కరిస్తామో బాధితులకు ఫోన్ చేసి చెప్పడంతో పాటు దాన్ని పరిష్కరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పెద్ద పెద్ద నగరాలకు పరితమైన ఎండ్ టు ఎండ్ రోడ్లు మంత్రి నారాయణ సహకారంతో నెల్లూరులో వేస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి మంత్రి పెద్ద పీట వేస్తున్నారని.. ఇలాంటి ప్రజా నాయకుడ్ని తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో గతంలో చూడలేదన్నారు.. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కార్పోరేషన్ అధికారులు, డివిజన్ అధ్యక్షులు గండవరం నాని, గండవరం గండవరం విశాలాక్షి, సునా, కుముద టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామాగా రాయదుర్గం

## ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు స్పష్టీకరణ



రాయదుర్గం, (చైతన్యరథం): రానున్న రోజుల్లో రాయదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధికి అసలు సిసలు చిరునామాగా మారుస్తానని ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ప్రకటించారు. రాయదుర్గం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణంలో గురువారం నిర్వహించిన ఇంటిపట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన అనుభవం, దార్శనికత, వ్యక్తిగత పరిచయాలతో పాటు నిరంతరం శ్రమించేతత్వం నేడు ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు దూసుకెళ్లేలా చేస్తున్నాయన్నారు. వీటితో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం, మంత్రి నారా లోకేష్ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యతతో రాష్ట్రం సంక్షోభం నుంచి గట్టెక్కగలుగుతోందన్నారు. ఇతర దేశాల నుండి ఆంధ్ర రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వరదలా తరలిరావడం వెనుక వీరి కఠోర శ్రమ ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడం, పెట్టుబడిదారులను మెప్పించడం ఆషా మాషీ వ్యవహారం కాదన్నారు. కూటమి పాలనపై సంపూర్ణ విశ్వాసంతో వందల మంది రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తున్నారన్నారు. వీటి ద్వారా లక్షలాది మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. మరోవైపు రాష్ట్రంలో మౌలిక వసతులు, రహదారులు, వ్యవసాయ, సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ముఖ్యంగా పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, మహిళలకు, బాలికలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, అన్నదాతలకు పెట్టుబడి రాయితీ, తల్లికి వందనం పేరుతో చదువుకుంటున్న పిల్లలకు ఆర్థిక సహాయం లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పక చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ కలలుగన్న సంక్షేమ శ్రేయో రాజ్య స్థాపనలో భాగంగా ఇల్లులేని ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందులో భాగంగా రాయదుర్గం నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 4126 మంది పేదలకు ఇళ్ల పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ఈరోజే భారీ స్థాయిలో 3వేల మందికి పట్టాలు పంపిణీ చేయడం తన జీవితంలో మర్చిపోలేనన్నారు. రాయదుర్గం నియోజకవర్గ సంక్షేమ చరిత్రలో ఈరోజు నిజంగా సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ అధ్యాయమని కాలవ హర్షం వ్యక్తపరిచారు. భవిష్యత్తులో పేదలకు పూర్తిస్థాయిలో శాశ్వత గృహ నిర్మాణం అమలు చేసి తీరతామన్నారు. రాయదుర్గాన్ని అన్ని విధాల పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలను వైసీపీ ప్రభుత్వం నయవంచనకు గురిచేసిందని కాలవ ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాలనలో ఏనాడు జగన్ రెడ్డి ప్రజల అవసరాలు గుర్తించి అందుకు అనుగుణంగా పనులు చేపట్టలేదన్నారు. ప్రతి అడుగులోనూ స్వార్థం, రాజకీయ లబ్ధి, వ్యక్తిగత ప్రయోజనాలనే అప్పట్లో జగన్మోహన్ రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు చూసుకున్నారన్నారు. 2017లో గత టిడిపి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో ప్రారంభించిన హంద్రీనీవా విస్తరణ పనులను జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్తిగా ఆపివేసిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా గడిచిన ఆరున్నర ఏళ్ల కాలంలో సుమారు 20వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయగా, జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో కేవలం రూ.2వేల కోట్లు మాత్రమే వ్యయం చేశానన్నారు. సీమ ద్రోహులుగా మిగిలిపోయిన వైసీపీ వారిని ఒకసారి గెలిపించినందుకే రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయేలా చేశారన్నారు. రాజకీయ పబ్బం గడుపుకొనే వైకాపా నేతలను మరోసారి క్షమించే స్థితిలో సీమ ప్రజలు లేరని జోష్యం చెప్పారు.

### మా మంచి దేవుడు చంద్రబాబు...

రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధి విషయంలో చంద్రబాబు నోటివెంట లేదన్న మాట ఇప్పటివరకు వినలేదన్నారు. గత టిడిపి పాలనలో అయినా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నైనా రాయదుర్గం ప్రాంతంపై ఆయనకు ఎనలేని ప్రేమ, మమకారం, ఆప్యాయత కొనసాగుతున్నాయన్నారు. తాను ఎప్పుడూ ఏ ఫైల్ తీసుకెళ్లిన మంజూరు చేస్తూ వస్తున్నారన్నారు. సంబంధిత అధికారులకు కూడా తన పనులు ఏమైనా ఉంటే త్వరగాచేసి పంపమని ఆదేశాలు ఇస్తున్నారన్నారు. ఆయన నాయకత్వంలో పని చేస్తున్నందుకు చాలా గర్వంగా ఉందన్నారు. ప్రజల సహకారంతో ఆయన రాష్ట్రానికి మరెంతో సేవ చేయాలని కోరుకోవాలని ఎమ్మెల్యే కాలవ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గొడిసెలపల్లి హనుమంత రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరులు నాగల్లీ రాజు, పోరాళ్ల పురుషోత్తం, ఉప్పర ఆనంద్, పట్టణ టిడిపి అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు లాలేప్ప, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, మండలాల కన్వీనర్లు కాలవ సనన్న, మోహన్ రెడ్డి, వన్నారెడ్డి, బలరామిరెడ్డి, హనుమంతుతో పాటు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల వెంకటేశులు, కడ్డిపూడి మహబూబ్ బాషా, పూజారి శివప్రసాద్, కౌన్సిలర్ పద్మావతి, ప్రశాంతి, బండి భారతి, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు మహిళలు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో

# ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి, (చైతన్యరథం): శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఫిబ్రవరి 8 నుండి 16వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గురువారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 6.30 నుండి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఉదయం 11 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతించారు.

### విరాళంగా పరదాలు

తిరుపతికి చెందిన మణి రెండు పరదాలు, రెండు కురాళాలు ఆలయానికి విరాళంగా అందించారు. రానున్న బ్రహ్మోత్సవాల్లో వీటిని వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకశ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మీ, విజివో గిరిధర్, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట రమేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ధనశేఖర్, మునికుమార్, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి రోజు ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ వాహనసేవల ముందు కోలాటాలు, భజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించనున్నారు.

### బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలు

**08-02-2026**
ఉదయం ... ధ్వజారోహణం... రాత్రి పెద్దశేష వాహనం

**09-02-2026**
ఉదయం ... చిన్నశేష వాహనం... రాత్రి హంస వాహనం

**10-02-2026**
ఉదయం -- సింహ వాహనం... రాత్రి ముత్యపు పందిరి వాహనం

**11-02-2026**
ఉదయం ... కల్పవృక్ష వాహనం... రాత్రి సర్వభూపాల వాహనం

**12-02-2026**
ఉదయం ... పల్లకీ ఉత్సవం (మోహినీ అవతారం)... రాత్రి గరుడ వాహనం

**13-02-2026**
ఉదయం ... హనుమంత వాహనం... మధ్యాహ్నం వసంతోత్సవం
సాయంత్రం ... స్వర్ణరథం
రాత్రి ... గజ వాహనం

**14-02-2026**
ఉదయం... సూర్యప్రభ వాహనం.. రాత్రి ... చంద్రప్రభ వాహనం

**15-02-2026**
ఉదయం... రథోత్సవం... రాత్రి ... అశ్వవాహనం

**16-02-2026**
ఉదయం ... చక్రస్నానం.... రాత్రి ... ధ్వజావరోహణం



శ్రీకాళహస్తి, న్యూస్టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల పది నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు రావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి బుధవారం ఆహ్వానించారు. బోర్డు చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి తదితరులు ఉన్నారు.

# గ్రామీణాభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### మండల అధికారులతో మంత్రి సవిత సమీక్ష



పెనుకొండ, (చైతన్యరథం): పట్టణ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ఐదు మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఈఈ, డీఈ తదితర అధికారులతో మంత్రి సవిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా గ్రామాల్లో ఉన్న సమస్యలు, పంచాయతీల్లో చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి వివరంగా చర్చించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యలు త్వరగా పరిష్కరించాలి అని అధికారులకు మంత్రి సవిత ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ అధికారులు మురళి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



# జగన్ పాలనలో ఒరగబెట్టిందేంటో చెప్పాలి

### శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సవాలు

శ్రీశైలం, (చైతన్యరథం): సీమ వైసీపీ నేతల చలో పోతిరెడ్డిపాడు పై ఘాటుగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పందించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమ ప్రాజెక్టుల ఏమి వెలగబెట్టారో చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. నాడు పోతిరెడ్డి పాడు నుంచి తెలుగుగంగ ద్వార సీమకు సాగునీరు అందించిన మహానుభావుడు స్వర్గీయ ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాజెక్టులన్నింటినీ గాడిలోపెట్టారన్నారు. ప్రతి ప్రాజెక్టులో పుష్కలంగా పూర్తిస్థాయిలో నీటి నిల్వ ఉందన్నారు. ఖరీఫ్‌లో పుష్కలంగా సాగునీరు అందించామన్నారు. ఇప్పుడు రబీలో కూడా అందిస్తామన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో రైతులు కానీ, వైసీపీ కార్యకర్తలు కానీ సాగునీటికి ఇబ్బంది ఉందని ధర్నాలు చేశారా అని నిలదీశారు. రెండు కార్లపంటలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. పొలాలకు ఆయకట్టు రోడ్లు వేశామన్నారు.

తద్వారా పొలాల విలువలు పెంచామన్నారు. మరి సీమకు ఏమి ద్రోహం జరిగిందని తప్పుడు కూతలతో ప్రజలను మోసం చేస్తారన్నారు. వైసీపీ నేతల జీవితమే అబద్దాల పుట్టేనని ఎద్దేవా చేశారు. రైతులు, ప్రజలు వైసీపీ నేతలను నిలదీసి అడగందని పిలుపునిచ్చారు. వారి కళ్లకు పంటపొలాల్లో పారే సాగునీటిని చూపించాలని కోరారు.

# త్వరలో నగరానికి 10సిటీ బస్సులు

### అనంతపురం ఆర్ఎం కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ, పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం, (చైతన్యరథం): ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో 2కోట్లతో ఆర్ఎం కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ జరిగింది. ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి, ఇతర ప్రజాప్రతినిధులు, ఆర్ఎం, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. 30ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న ఆర్ఎం కార్యాలయం నిర్మాణం జరుగుతోందని వైసీపీ ప్రభుత్వంలో దీని గురించి అసలు పట్టించుకోలేదని ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శించారు. పూల నాగరాజు ఛైర్మన్ అయ్యాక ఆర్టీసీ రీజియన్‌కు రూ. 20కోట్ల వరకు నిధులు తీసుకొచ్చారన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలో పరిస్థితులు మారాయన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. అనంతపురం నగరానికి 10 ఎలక్ట్రిక్ సిటీ బస్సులు రానున్నాయని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో స్త్రీ శక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని, శ్రీకాకుళం నుంచి హిందూపురం వరకు ఉచితంగా ప్రయాణిస్తున్నారని వెల్లడించారు. 20 నెలల్లో అర్బన్ నియోజకవర్గంలో 130కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఛైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేశామన్నారు. గత పాలకులు ఉద్యోగుల గురించి, ప్రయాణీకుల సౌకర్యాల గురించి పట్టించుకోలేదన్నారు. రేటింగ్ లో మేము 75శాతంతో ముందున్నామన్నారు. బస్టాండ్ల రూపురేఖలు మారుస్తున్నామన్నారు. ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఉద్యోగులకు మెడికల్ అన్ ఫిట్, ప్రమోషన్ల వంటి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. 200 కుటుంబాలకు మేలు చేసే విధంగా మంత్రి లోకేష్ చేశారన్నారన్నారు. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణాలు కల్పించామన్నారు. ఏప్రిల్, మే నెలల్లో కొత్త బస్సులు వస్తాయన్నారు.

# అసలు దొంగలను పట్టుకునేందుకే విచారణ

అమరావతి, (చైతన్యరథం): కోట్లాది మంది భక్తులు విశ్వసించే శ్రీ వెంకటేశ్వర స్వామివారికి జరిగిన ఈ ద్రోహాన్ని రాజకీయాలకు అతీతంగా ఖండించాలని, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. అమరావతిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవుడిని అడ్డం పెట్టుకుని కుట్రలు చేయడం మాకు రాదని. అందుకే కల్తీ నెయ్యి వెనుకాల ఉన్న అసలు కల్తీగాళ్లను, మాయగాళ్లను ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెట్టడానికి కట్టుబడి పనిచేస్తున్నామని ఆయన తెలిపారు కల్తీ నెయ్యి కేసులో అసలు సూత్రధారులను, లబ్దిదారులను, నిజమైన నిందితులను బయటపెట్టడానికి విచారణ కమిషన్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. విచారణలోని అంశాలు, చార్జిషీట్ లోని వివరాలు, ప్రభుత్వ నివేదికల్లోని విభేదాలను సమీక్షించి వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు ఈ కమిషన్ ఏర్పడిందని ఆయన తెలిపారు తిరుమలలో ఇన్ని తప్పులు జరుగుతుంటే నాటి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? అని ఆయన ప్రశ్నించారు 2020లో ఎటువంటి అధ్యయనం, శాస్త్రీయత లేకుండా టెండర్ కండిషన్లు ఎందుకు మార్చారని, టెండర్ కండిషన్లు మార్చి అర్హత లేని కంపెనీలకు టెండర్‌లో పాల్గొనే అవకాశం ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. చుక్క పాలు లేకుండా మొత్తం రసాయనాలతో తయారుచేసే కంపెనీలు వైసీపీ దృష్టిలో స్టార్టప్ కంపెనీ లా? దేశంలో పేరుగాంచిన ల్యాబ్ కల్తీ జరగకపోతే కల్తీ జరిగినట్టు ల్యాబ్ రిపోర్ట్ ఇవ్వగలదా? వైసీపీ 'మేము తప్పు చేయలేదు, మీరు ఏ దర్యాప్తు చేసినా మా నిజాయితీ బయటకు వస్తుంది' అని ఎందుకు స్వాగతించడం లేదు? తప్పు చేశారు కాబట్టి కాబట్టే కదా... భయం ముంచుకొస్తుంటే ఇలా ఎదురుదాడి చేస్తున్నారన్నారు.

**ఢిల్లీ పర్యటనలో భాగంగా ఒంగోలు పార్లమెంట్ సభ్యు మాగుంట శ్రీనివాసులురెడ్డి తేనేటి విందు కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహచర ఎమ్మెల్యేలు, టీడీపీ ఇంచార్జ్, కార్పొరేషన్ ఛైర్మన్‌లతో కలిసి పాల్గొన్న కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి**





# రాయలసీమకు వైఎస్ఆర్, జగన్ చేసింది శూన్యం

### ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మండిపాటు

కదిరి, (చైతన్యరథం): కృష్ణానదిలో మిగులు జలాలు కోరబోమని వైఎస్ఆర్ బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌కు లేఖ రాసి రాయలసీమ రైతుల గొంతు కోస్తే అప్పర్ భద్ర నిర్మిస్తున్నా జగన్ పట్టించుకోకుండా తీరని ద్రోహం చేశాడని కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ ధ్వజమెత్తారు. కృష్ణా జలాల్లో 512 టీఎంసీల నీటిని కేసీఆర్‌తో ఒప్పించి సంతకం చేయించి చంద్రబాబు సాధించారన్నారు. అయితే సెక్షన్ 3పై చర్చించేలా జగన్ రెడ్డి అపెక్స్ కౌన్సిల్‌లో వాదనలు వినిపించకుండా రాష్ట్రానికి ద్రోహం చేశారన్నారు. నేడు తెలంగాణ ప్రభుత్వం నీటి కేటాయింపులపై డిమాండ్ చేయడానికి జగన్ నిర్లక్ష్యపు దోరణే కారణమన్నారు. ఐదేళ్ల పాలనలో 102 సాగునీటి ప్రాజెక్టులను జగన్ రెడ్డి రద్దు చేసి సీమన ఎడారి చేశాడు. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి ఎలాంటి అనుమతులు లేకపోయినా రూ.3,825 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించి రూ.900 కోట్ల మట్టి పనులు చేసుకొని బిల్లులు చెల్లించుకున్నారని ఆరోపించారు. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో సీమకు రూ.2 వేల కోట్లే ఖర్చు చేశారు. 2014,19 లో చంద్రబాబు ప్రభుత్వం రూ.12,011 కోట్లు, ఈ 19 నెలల్లో రూ.8 వేల కోట్లు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేస్తోంది. జగన్ ఇసుక దోపిడీకి అన్నమయ్య ప్రాజెక్టుకు కొట్టుకుపోయి 39 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఫించా డ్యామ్ దెబ్బతిందని, అలగనూరు బ్యాకేజీ జలాశయం గట్టు క్రిందికి కుంగి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 2021 నుండి నీటి విడుదల ఆపివేయబడింది. గాలేరు, నగరి ప్రాజెక్టుకు కీలకమైన గోరుకల్లు జలాశయం నిర్వహణ ప్రమాదంలో పడింది. 5 సంవత్సరాలలో ఒక రూపాయి కూడా జగన్ రెడ్డి విడుదల చేయలేదన్నారు. అవుకు జలాశయం నిర్వహణను గాలికొదిలేశారన్నారు. ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు ఇవ్వకపోవడంతో తుంగభద్ర డ్యామ్ 19వ క్రస్ట్ గేట్లు కొట్టుకుపోయాయన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు చొరవతో క్రాష్ ప్రోగ్రామ్ లాగా పనులు చేసి కేవలం 5 రోజుల్లో గేట్లను మరమ్మతు చేయించారన్నారు. ఈ చర్య ద్వారా సుమారు 40 టీఎంసీల నీటిని కాపాడగలిగామన్నారు. ప్రస్తుత తుంగభద్ర క్రస్ట్ గేట్ల రిమోట్ కంట్రోల్ సిస్టమ్ పనులు రూ.54.42 కోట్లతో కొనసాగుతున్నాయని వివరించారు. ప్రతి సంవత్సరం గోదావరిలో సముద్రంలో కలిసిపోతున్న సుమారు 3000 టీఎంసీల నీటిలో నుండి 200 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం ద్వారా రాయలసీమ శాశ్వత అవసరాలను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాంమన్నారు. బొల్లాపల్లి జలాశయానికి 173 టీఎంసీల నీటిని నిల్వ చేయగల సామర్థ్యం కలిగి ఉండి, రాయలసీమ భవిష్యత్ అవసరాలను తీర్చడమే కాకుండా, రాయలసీమను రతనాల సీమగా చేయడమే చంద్రబాబు లక్ష్యమన్నారు.

# లోక్‌సభలో ప్రధాని ముట్టడికి కాంగ్రెస్ వ్యూహం

## అది తెలిసే రావద్దన్నానని స్పీకర్ ఓంప్రకాశ్ బిర్లా వెల్లడి



లోక్‌సభలో ప్రధాని మోదీని ముట్టడించాలని కాంగ్రెస్ సభ్యులు వ్యూహం రూపొందించినట్లు స్పీకర్ ఓంబిర్లా వెల్లడించారు. విపక్షాల నిరసనల దృష్ట్యా ఆయన్ను సభకు రావొద్దని సూచించానని పేర్కొన్నారు. "నిన్న పార్లమెంట్లో చోటుచేసుకున్న పరిణామాలు దురదృష్టకరం. కాంగ్రెస్ మహిళా ఎంపీల ప్రవర్తనను ఖండిస్తున్నాను. విపక్షాల తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని వెల్లడించారు. తనకు అందిన సమాచారం ఆధారంగా, ప్రధాని భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఆ కారణం వల్లే ప్రధాని సభలో ప్రసంగించలేకపోయారని తెలిపారు. సభకు రాకుండా ఉండేందుకు అంగీకరించిన ప్రధాని.. అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఇవ్వలేదన్నారు. అందుకు ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు పీటీఐ కథనం వెల్లడించింది. ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని లోక్‌సభ గురువారం ఆమోదించింది. "ఈ తీర్మానంపై ప్రధాని మోదీ మాట్లాడకపోవడం అరుదైన అంశం. ప్రసంగించేందుకు మోదీ అందుబాటులోనే ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ సభ్యుల ప్లానుకు సంబంధించిన సమాచారం రావడంతో బుధవారం సభను వాయిదా వేయాలని స్పీకర్ నిర్ణయించారు" అని లోక్‌సభ వర్గాలు పేర్కొన్న సంగతి తెలిసిందే. లద్దాఫ్ ఘర్షణపై భారత సైన్యం మాజీ అధిపతి నరవణ రాసిన పుస్తకం గురించి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రస్తావించడంలో సభలో గందరగోళ వాతావరణం కొనసాగుతోంది. మరోవైపు, నిన్న అమెరికాతో ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ విపక్ష మహిళా ఎంపీలు ప్రధాని స్థానం వద్దకు బ్యానర్లతో వెళ్లేందుకు సిద్ధమైన సమయంలో సభ వాయిదాపడిన సంగతి తెలిసిందే. అయితే, ఆ సమయంలోనూ మోదీ సభలో లేరు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం లేకుండానే దీనికి ఆమోదం తెలపడం గమనార్హం. ధన్యవాద తీర్మానంలో ప్రతిపక్షాలు సూచించిన సవరణలపై స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించారు. మెజార్టీ లేకపోవడంతో ఆ సవరణలను సభ నిరాకరించింది. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్న స్పీకర్ సభ్యులకు చదివి వినిపించారు. ఆ సమయంలోనూ విపక్ష సభ్యులు నిరసనలు చేపట్టారు. వారి ఆందోళనల నడుమే మూజువాణీ ఓటుతో ఈ తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. ఆ సమయంలో ప్రధాని మోదీ సభలో లేరు. ప్రతిపక్ష నేతలు నిరసన నేపథ్యంలో మోదీ బుధవారం ప్రసంగించలేకపోయిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం బుధవారం సాయంత్రం ధన్యవాద తీర్మానంపై చర్చలో భాగంగా ప్రధాని ప్రసంగించాల్సి ఉంది. అయితే, విపక్షాల నిరసనల నేపథ్యంలో ఈ ప్రసంగం లేకుండానే సభ గురువారానికి వాయిదా పడింది.

### రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్

మరోవైపు రాజ్యసభలోనూ గురువారం గందరగోళ వాతావరణం నెలకొంది. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడేందుకు అనుమతి ఇవ్వడం లేదని రాజ్యసభ ఎంపీ మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. ఆయన వ్యాఖ్యలను అధికార పార్టీ ఎంపీలు ఖండించారు. దీంతో ఇరు పక్షాల మధ్య వాగ్వాదం నెలకొంది. అనంతరం ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

# బెర్తు లభించని ఆర్ఏసీ ప్రయాణికుడికి చార్జీ తగ్గింపు

## రైల్వే అధికారులకు పార్లమెంటరీ కమిటీ ఆదేశం



రైలు ప్రయాణంలో ఆర్ఏసీ కేటగిరి కింద బుక్ చేసుకున్న టికెట్లకు పూర్తి ఛార్జీ వసూలు చేయడం సమర్ధనీయం కాదని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. ఆర్ఏసీలోనే ఉండి బోర్డింగ్ సమయంలో బెర్త్ లభించని ప్రయాణికులకు ఛార్జీలో కొంత మేర తిరిగి ఇవ్వాలని సూచించింది. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపింది. "పంక్చువాలిటీ అండ్ ట్రావెల్ టైమ్ ఇన్ ట్రైన్ ఆపరేషన్స్ ఇన్ ఇండియన్ రైల్వేస్" పేరుతో పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో ప్రజాపద్దుల కమిటీ పేర్కొంది. ప్రస్తుతం ఆర్ఏసీ కింద బెర్త్ బుక్ చేసుకునే ప్రయాణికుల నుంచి పూర్తి మొత్తంలో టికెట్ ఛార్జీ వసూలు చేస్తున్నారు. ఇదే కేటగిరి కింద ఉండే మరో ప్రయాణికుడితో బెర్త్ పంచుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇద్దరు ప్యాసింజర్లు పూర్తి మొత్తాన్ని చెల్లిస్తున్నారు. ఇలాంటి ప్రయాణికులకు టికెట్‌లో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించాలని, ఇందుకు సంబంధించి తీసుకున్న చర్యలను తెలియజేయాలని పార్లమెంటరీ కమిటీ ఆదేశించింది.

# ఎట్టకేలకు రోడ్డెక్కిన భారత్ టాక్సీ

## యాప్‌ను ప్రారంభించిన హోం మంత్రి అమిత్ షా



ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఊబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సేవలు విజయవంతమైన నేపథ్యంలో ఎట్టకేలకు అందుబాటులోకి తెచ్చారు. తొలుత ఢిల్లీ రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు లభిస్తాయి. రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య (అస్సాం) వరకు భారత్ ట్యాక్సీ సేవలను తీసుకొస్తామని అమిత్ పేర్కొన్నారు. ఇందులో లాభాలు డ్రైవర్లకే వెళతాయని చెప్పారు. ఈ ప్లాట్ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దేశంలో క్యాబ్ బుకింగ్ సేవల్లో ఊబర్, ఓలా, ర్యాపిడో వంటి సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయి. డ్రైవర్ల నుంచి ఆయా సంస్థలు కొంతమొత్తం కమీషన్గా వసూలు చేస్తున్నాయి. వారి శ్రమను ఆయా కంపెనీలు దోచుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద 2025 జూన్ 5న 'భారత్ ట్యాక్సీ'కి కేంద్రం రూపకల్పన చేసింది. జీరో కమీషన్, సర్జ్ ప్రైసింగ్ లేని విధానం, డ్రైవర్లకు లాభాలు పంచిపెట్టడం దీని ముఖ్య ఉద్దేశం. దిల్లీ-ఎన్సీఆర్, గుజరాత్లో డిసెంబర్ 2 నుంచి ప్రయోగాత్మకంగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల డ్రైవర్లు ఇందులో చేరగా.. లక్ష మంది యూజర్లు రిజిస్టర్ అయ్యారు. రోజుకు 10 వేల రైడ్లు జరిగాయి. సుమారు రూ.10 కోట్లను డ్రైవర్లకు లాభాలుగా అందించినట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పేర్కొంది. డ్రైవర్లకు 'సారథి' పేరిట ఆరోగ్య, ప్రమాద బీమా, రిటైర్మెంట్ సేవింగ్స్ కూడా లభిస్తాయి.



# బొగ్గుగనిలో భారీ పేలుడు : పది మంది కూలీలు మృతి

మేఘాలయలో బొగ్గుగనిలో గురువారం భారీ ప్రమాదం జరిగింది. అందులో పేలుడు సంభవించడంతో 10 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసు కథనాల ప్రకారం, గనిలో బొగ్గు తవ్వకాలు చేపడుతున్న సమయంలో ఈ పేలుడు జరిగింది. దాంతో కూలీలు అందులో చిక్కుకుపోయారు. వారిలో ఎక్కువమంది అస్సాంకు చెందినవారిగా తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అయితే పేలుడుకు గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. మేఘాలయలో ర్యాట్ హోల్ మైనింగ్, అశాస్త్రీయ పద్ధతుల్లో తవ్వకాలను 2014లోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ నిషేధించింది. సమాంతరంగా సన్నని గుంతలు తవ్వుతూ బొగ్గును బయటకు తీసే పద్ధతినే ర్యాట్ హోల్ మైనింగ్‌గా వ్యవహరిస్తారు. ఇలా నేలలో ఇరుకైన గుంతలను తవ్వడాన్నే ర్యాట్ హోల్‌గా పేర్కొంటారు. సుమారు నాలుగు అడుగుల వెడల్పుతో మాత్రమే ఉంటుంది. కేవలం ఒక్క మనిషి మాత్రమే వెళ్లగలడు. కాగా, ఎన్జీటీ నిషేధాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.

# దశాబ్దాల నిరీక్షణ తర్వాత వందేళ్ల వృద్ధుడికి న్యాయం



దశాబ్దాల నిరీక్షణ తర్వాత 100 ఏళ్ల వృద్ధుడికి న్యాయం దక్కింది. 40 ఏళ్ల తర్వాత హత్య కేసులో అతడిని నిర్దోషిగా తేలుస్తూ అలహాబాద్ హైకోర్టు తాజాగా తీర్పునిచ్చింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఓ భూవివాదం కాస్తా తీవ్రరూపం దాల్చి, ఒకరి హత్యకు దారితీసింది. ఉత్తర్ ప్రదేశ్‌లో 1982లో జరిగిన ఈ హత్య ఘటనలో మైకు ప్రధాన నిందితుడు కాగా, ధనీరామ్, సత్తిదిన్ హత్యకు ప్రేరేపించారని అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసును విచారించిన హమీరుర్ సెషన్స్‌కోర్టు 1984లో ధనీరామ్, సత్తిదిన్‌కు జీవితఖైదు విధించింది. మైకు మాత్రం అరెస్టు కాలేదు. సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆ ఇద్దరు 40 ఏళ్ల క్రితం అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటినుంచి ఆ పిటిషన్ పెండింగ్‌లోనే ఉండిపోయింది. అది విచారణ దశలో ఉండటంతో బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. ఈ కేసు ఎటూ తేలకుండానే కొన్నేళ్లక్రితం సత్తిదిన్ మృతి చెందాడు. ఈ హత్య కేసు తాజాగా హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మైకుని అరెస్టు చేయకపోవడాన్ని కోర్టు ప్రస్తావించింది. ధనీరామ్ అప్పీల్‌పై నిర్ణయంలో అసాధారణ జాప్యం, ప్రాసిక్యూషన్‌లో లోపాలను ఎత్తిచూపిన న్యాయస్థానం, తాజాగా తీర్పునిచ్చింది. అలాగే అతడి వయసును పరిగణనలోకి తీసుకొని నిర్దోషిగా తేల్చింది.

# చమురు కొనుగోళ్లలో దేశ ప్రజల ఇంధన భద్రతకే ప్రాధాన్యం

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు నిలిపేసి.. అమెరికా, వెనెజువెలా నుంచి దిగుమతి చేసుకుంటుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. ఈ అంశంపై భారత విదేశాంగశాఖ స్పందించింది. 140 కోట్లమంది దేశ ప్రజల ఇంధన భద్రతే తమకు అత్యంత ప్రాధాన్య అంశమని, చమురు సేకరణ విషయంలో ప్రభుత్వ విధానాలకు ఇదే మూలమని స్పష్టం చేసింది. మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా విబిన్న సరఫరాదారులను ఆశ్రయించడం అనేది ప్రభుత్వ వ్యూహంలో భాగమని పేర్కొంది. "వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో వెనెజువెలా చాలా కాలంగా భారత్ భాగస్వామిగా ఉంది. గతంలో ఆ దేశం నుంచి చమురు, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నాం. ఇంధన భద్రత విషయంలో మా విధానాలకు అనుగుణంగా, వెనెజువెలా సహా ఏ దేశం నుంచైనా ముడి చమురు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాం" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్ ధీర్ జయస్వాల్ ఓ మీడియా సమావేశంలో చెప్పారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం దేశ ఎగుమతులు, పరిశ్రమలు, ఉద్యోగ కల్పన, వృద్ధి, ప్రజల సంక్షేమానికి ఊతమిస్తుందని తెలిపారు. మరోవైపు.. ఇటీవలి ఇరాన్ ఆందోళనల సమయంలో అక్కడ ఉన్న భారతీయులు మృతి చెందినట్లు, తప్పిపోయినట్లు నివేదికలేవీ లేవని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు పార్లమెంటుకు తెలిపింది. టెహ్రాన్లోని భారత రాయబార కార్యాలయం స్థానిక భారత పౌరులతో నిత్యం సంప్రదింపుల్లో ఉందని విదేశాంగశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. తాజా అంచనాల ప్రకారం.. ఆ దేశంలో దాదాపు 10 వేలమంది ప్రవాస భారతీయులు ఉన్నట్లు చెప్పారు.



# ఏ దేశం నుంచైనా భారత్ చమురు కొనొచ్చు

## - అది వారి ఇష్టం..వారి స్వేచ్ఛ



మాస్కో: ప్రపంచంలోని ఏ దేశం నుంచైనా భారత్ చమురును కొనుగోలు చేయవచ్చుని, ఆ దేశానికి ఆ స్వేచ్ఛ ఉందని రష్యా స్పష్టం చేసింది. విభిన్న ముడి చమురు సరఫరాదారులను ఆ దేశం ఆశ్రయించడం కొత్తేమీ కాదని పేర్కొంది.

**రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి పెస్కోవ్**

'భారత్‌కు రష్యా ఒక్కటే చమురును సరఫరా చేయడం లేదన్న విషయం మాతో పాటు అంతర్జాతీయ ఇంధనరంగ నిపుణులందరికీ తెలుసు. ఆ దేశం ఎప్పటి నుంచో ఇతర దేశాల నుంచీ చమురును కొనుగోలు చేస్తోంది.

అందువల్ల భారత్ చమురు కొనుగోళ్లను నిలిపేయడం కొత్త విషయంగా తోచడం లేదు' అని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్యానించారు.

భారత్, రష్యాల మధ్య హైడ్రోకార్బన్ల వాణిజ్యం ఇద్దరికీ లాభదాయకమని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా తెలిపారు.

**'పూర్తిగా ఆపలేవు'**

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారతీయ రిఫైనరీలు పూర్తిగా ఆపలేవని ఆ దేశ జాతీయ ఇంధన భద్రతా నిధి నిపుణుడు ఇగోర్ యుష్కోవ్ స్పష్టం చేశారు. 'అమెరికా ఎగుమతి చేసే షేల్ చమురు తక్కువ గ్రేడ్లు కలిగి ఉంటుంది. గ్యాస్ కూడా తక్కువ కండెన్సేట్లో ఉంటుంది. వాటితో పోలిస్తే రష్యా భారీ, సల్ఫర్ అధికంగా ఉండే యూరల్స్ను సరఫరా చేస్తుంది. తక్కువ గ్రేడ్లు ఉండే చమురును అమెరికా నుంచి భారత్ అధిక ధరకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అంటే ప్రత్యామ్నాయం అంత సులభం కాదని అర్థమవుతోంది. పైగా రష్యా రోజుకు 15 లక్షల నుంచి 20 లక్షల బ్యారెళ్ల చమురును సరఫరా చేస్తోంది. అంత పరిమాణంలో అమెరికా చేయలేదు' అని యుష్కోవ్ వ్యాఖ్యానించారు. 2022 లో భారత్ అమెరికా, ఇతర దేశాల నుంచి చమురు కొనడంవల్ల బ్యారెల్ ధర 120 డాలర్లకు పెరిగిందని వివరించారు.

## ఎప్‌స్టీన్‌కు సమయం ఇచ్చినందుకు చింతిస్తున్నా..

# అందుకు క్షమాపణలు చెబుతున్నా..

**ఆ ఆరోపణలన్నీ అవాస్తవాలే - ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై బిల్‌గేట్స్ స్పందన**

ఎప్‌స్టీన్ లైంగిక నేరాల కేసుకు సంబంధించిన దస్త్రాల్లో తన పేరు ప్రస్తావనకు రావడంపై మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్ గేట్స్ తాజాగా స్పందించారు. చిన్నారులపై అకృత్యాలకు పాల్పడిన ఎప్‌స్టీన్‌కు సమయం ఇచ్చినందుకు తాను పశ్చాత్తాపపడుతున్నా నని అన్నారు. అతడికి కేటాయించిన ప్రతి క్షణానికి తాను ప్రస్తు తం చింతిస్తున్నానని అన్నారు. క్షమాపణలు కూడా చెబుతున్న ట్లు తెలిపారు. అయితే ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో తనపై వచ్చిన ఆరోపణ లన్నీ అవాస్తవమేనని బిల్ గేట్స్ స్పష్టం చేశారు. అవన్నీ అసంబద్ధ ఆరోపణలని తేల్చి చెప్పారు. ఎప్‌స్టీన్ తనను కావాలనే టార్గెట్ చేసినట్టు అనిపిస్తోందని అన్నారు. 'జెఫ్రీ ఎప్‌స్టీన్ రాసుకున్న ఆ ఈమెయిల్స్‌ను ఎవరికీ పంపించలేదు. అసలు ఆ మెయిల్స్ అన్నీ అసత్యాలే. అసలు అతడి మనసులో ఏముందో నాకు అర్థం కావట్లేదు. నన్ను కావాలనే టార్గెట్ చేశాడని అనిపిస్తోంది' అని గేట్స్ ఓ మీడియా సంస్థకు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నా రు. ఎప్‌స్టీన్ కుంభకోణానికి సంబంధించి అమెరికా న్యాయశాఖ ఇటీవల విడుదల చేసిన డాక్యుమెంట్స్‌లో బిల్ గేట్స్ ప్రస్తావన కూడా వచ్చిన విషయం తెలిసిందే. రష్యా యువతులతో సన్నిహి తంగా మెలిగిన గేట్స్ సుఖ వ్యాధి బారిన పడ్డాడని ఎప్‌స్టీన్ ఓ మెయిల్‌లో రాసుకొచ్చాడు. అంతేకాకుండా గేట్స్ తన భార్య మెలిండాకు సీక్రెట్‌గా ఇచ్చేందుకు యాంటీబయాటిక్స్ కావాలనీ కోరినట్టు



తెలిపాడు. ఎప్‌స్టీన్ 2019లో జైల్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించాడు. అతడు ఆత్మహత్య చేసుకున్నట్టు కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలపై గేట్స్ మాజీ భార్య మెలిండా కూడా స్పందించారు. పెళ్లైన 27 ఏళ్ల తరువాత ఆమె 2021లో భర్త బిల్ గేట్స్ నుంచి విడాకులు తీసుకున్నారు. నాటి పరిస్థితులు తన వైవాహిక జీవితంలో అత్యంత కఠిన క్షణాలని గుర్తుచేసుకు న్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోని అంశాలతో ముడిపడిన వారందరూ సమాధానం చెప్పాల్సిందేనని కోరారు. ఆ రొచ్చు నుంచి బయటకు వచ్చినందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని కామెంట్ చేశారు.

# స్వీయ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం

**ముడిచమురు కొనుగోళ్లపై భారత్ - ట్రేడ్ డీల్‌పై స్పందించిన విదేశాంగ శాఖ**

ఢిల్లీ: రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు భారత్ అంగీకరించిందని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. భారత్‌పై సుంకాలను తగ్గించామని సోషల్ మీడియాలో ప్రకటిస్తూ ఈ అంశాన్నీ వెల్లడించారు. తమ మధ్య ట్రేడ్ డీల్ కుదిరిందని ప్రకటించిన సందర్భంగా భారత్– రష్యా చమురు అంశాన్ని ప్రస్తావించారు ట్రంప్. ఈ విషయమై భారత విదేశాంగ శాఖ తొలిసారిగా స్పందించింది. ఇంధన రంగంలో ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో తాము 140 కోట్ల మంది దేశ ప్రజల ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేసింది. 'దేశ ఇంధన భద్రత, చమురు కొనుగోళ్లపై భారత ప్రభుత్వం ఇప్పటికే తన వైఖరిని పలుమార్లు బహిరంగంగా స్పష్టం చేసింది. 140 కోట్ల మంది భారత ప్రజల ఇంధన భద్రతను కాపాడటానికే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోంది. మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాలను అనుసరించి వివిధ దేశాల నుంచి ఇంధన దిగుమతులను కొన సాగించే వ్యూహాన్ని భారత్ అనుసరిస్తోంది. భారత్ ఇప్పటివరకూ తీసుకున్న నిర్ణయాలు, ఇకపై తీసుకునే నిర్ణయాలన్నీ ఇదే పంథా లో ఉంటాయి' అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఓ ప్రకటనలో తెలిపారు. రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయ డంతో పాటు వెనెజువెలా, అమెరికాల నుంచి ముడి చమురు దిగుమతులకు భారత్ సిద్ధంగా ఉందని కూడా ట్రంప్ పేర్కొ న్నారు. ఈ అంశంపై కూడా రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. వెనెజువెలాతో ఎంతో కాలంగా భారత్‌కు వాణిజ్య భాగస్వామ్యం ఉందని గుర్తు చేశా రు. వెనెజువెలా చమురు కొనుగోలుకు తాము సుముఖంగానే ఉన్నామన్నారు. దీంతో పాటు వాణిజ్య పరంగా అవకాశం ఉన్న అన్ని చోట్ల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇక ట్రంప్ ప్రకటనపై ఇటీవలే రష్యా కూడా స్పందించింది. చమురు కొనుగోళ్లను నిలిపివేసినట్టు తమకు భారత్ నుంచి ఎలాంటి సమాచారం అందలేదని తెలిపింది. భారత్–అమెరికా దౌత్య బంధాన్ని తాము గౌరవిస్తామని రష్యా ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. అదే సమయంలో భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి అంతే ప్రాముఖ్యతను ఇస్తామని అన్నారు. తమ తొలి ప్రాధాన్యత ఇదేనని కూడా స్పష్టం చేశారు.

## భారత్, యూఎస్ ట్రేడ్ డీల్.. త్వరలో సంయుక్త ప్రకటన!



తమ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరినట్టు భారత్, అమెరికా ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే డీల్‌కు సం బంధించి పూర్తి వివరాలు అందులో పేర్కొనలేదు. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు మరో 4–5 రోజుల్లో సంయుక్త ప్రకటన విడుదల చేయనున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఆ తరువాత ఈ ఒప్పందంలోని వివరాలపై పూర్తి స్పష్టత రానుంది. భారత్‌తో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఇందుకు ప్రతిగా భారత ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా అమెరికా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. త్వరలో ట్రంప్ ప్రభుత్వంలోని కీలక అధికారులు భారత్‌లో పర్యటించ నున్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇరు దేశాల సంయుక్త ప్రకటన తరువాత డీల్‌లోని పూర్తి వివరాలపై స్పష్టత రానుంది. వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేని నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై ఇప్పటికే ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ ఒప్పందంపై ఇటీవల కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ కూడా స్పందించారు. డీల్‌కు సంబంధించి తొలి దశ అంశాలపై మార్చి నెలలో ఇరు దేశాలు సంతకాలు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం, భారత్‌పై టారిఫ్‌ను 18 శాతానికి తగ్గిస్తూ అమెరికా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తుందని వివరించారు. భారతీయ వ్యవసాయం, డైరీ ఉత్పత్తుల, మత్స్య రంగానికి ఈ డీల్‌లో రక్షణలు లభిస్తాయని తెలుస్తోంది. ఈ అంశాలపై ఇరు దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో డీల్‌లో జాప్యం జరిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇక ట్రంప్‌నకు ప్రధాని మోదీ కాల్ చేయకపోవడంతో ఒప్పందం చివరి నిమిషంలో ఆగిపోయిందని అమెరికా మంత్రి లట్నిక్ చెప్పడం మరింత కలకలానికి దారి తీసింది. గతంలో జరిగిన ఇతర వాణిజ్య ఒప్పం దాలన్నిటిలో కేంద్రం వ్యవసాయ రంగానికి రక్షణలు దక్కించు కుంది. అమెరికా డీల్‌తో కూడా ఇదే ఒరవడి కొనసాగనుందని సమాచారం.

## ఆదాయార్జనలో మస్క్ రికార్డు



అమెరికా: ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఆదాయార్జనలో రికార్డులు సృష్టిస్తూ దూసుకెళ్తున్నారు. స్పేస్ ఎక్స్, ఎక్స్ ఏఐ విలీనంతో పాటు, టెస్లా షేర్ల విలువ కూడా పెరగడంతో ప్రపంచంలోనే 800 బిలియన్ డాలర్ల నికర సంపదను అధిగమించిన మొదటి వ్యక్తిగా మాస్క్ రికార్డుల కెక్కారు. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం మస్క్ రాకెట్ కంపెనీ స్పేస్ ఎక్స్, కృత్రిమ మేధ కంపెనీ ఎక్స్ఏఐ విలీనం తర్వాత ఆయన వ్యక్తిగత సంపద భారీగా పెరిగి 852 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.70 లక్షల కోట్లు)కు చేరుకుంది. గత నాలుగైదు నెలలుగా మస్క్ సంపద జెట్ స్పీడుతో పెరుగుతూ పోతోంది. ఇదే వేగం కొనసాగితే.. మరికొన్ని రోజుల్లోనే ఆయన ప్రపంచంలోనే మొదటి ట్రిలియనీర్ (1 ట్రిలియన్ డాలర్ల సంపద) అయ్యే అవకాశం ఉంది.



# నైజీరియాలో నరమేధం

**200 మంది ఊచకోత**

నైజీరియాలో దారుణం చోటుచేసుకుంది. సాయుధ మూక నరమేధం సృష్టించింది. రెండు గ్రామాల్లోని ప్రజలపై దాడులు చేసి 200 మందిని అతి దారుణంగా చంపేశారు. పలు ఇళ్లు, దుకా ణాలను కూడా తగలబెట్టారు. క్వారా రాష్ట్రంలోని వోరో, నూక అనే రెండు గ్రామాల్లో ఈ దాడులు జరిగాయి. వోరో స్థానిక నాయ కుడు సైదు బాబాఅహ్మద్ మాట్లాడుతూ ప్రజలను చుట్టుముట్టి వారి చేతులను వెనక్కి కట్టి ఆ తర్వాత కాల్చి చంపేశారని తెలిపా రు. దాడి సమయంలో కొంతమంది ప్రజలు ప్రాణభయంతో పరు గులు తీశారని.. ప్రస్తుతం వారి ఆచూకీ తెలియడం లేదని వెల్లడిం చారు. తాజా ఘటనకు సంబంధించి స్థానిక మీడియాలో వీడియో లు ప్రసారమయ్యాయి. అందులో వీధుల్లో పెద్దఎత్తున మృతదేహా లు పడి ఉన్నట్లు కన్పించాయి. ఈ దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అమ్నెస్టి ఇంటర్నేషనల్ మానవ హక్కుల సంఘం ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. దుండగులు దాదాపు ఐదు నెలల నుంచి గ్రామస్థులకు హెచ్చరిక లేఖలు పంపుతున్నారని.. అయినా భద్రతాపరమైన చర్యలు తీసుకోలేదని మండిపడింది. ఇటీవల నైజీరియా సైన్యం ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో ఆపరేషన్లు నిర్వహించి 150 మందిని మట్టుబెట్టింది. ఈ సైనిక చర్యకు ప్రతిస్పందనగానే తాజా దాడులు జరిగాయని క్వారా గవర్నర్ అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. దీన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఇదిలాఉండగా.. కాట్సినా రాష్ట్రంలో కూడా దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక పోలీసులు తెలిపారు.

# డబ్ల్యూపీఎల్ విజేత బెంగళూరు

## మెరిసిన స్మృతి మంధాన






మహిళల ప్రీమియర్ లీగ్ టోర్నీని బెంగళూరు గెలుచుకుంది. గురువారం జరిగిన డబ్ల్యూపీఎల్–2026 ఫైనల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై 6 వికెట్లతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఘన విజయం సాధించింది. 204 పరుగుల లక్ష్యఛేదనలో స్మృతి మంధాన (87, 41 బంతులు, 12 ఫోర్లు, 3 సిక్సులు), జార్జియా వోల్ (79, 54 బంతుల్లో, 14 ఫోర్లు) చెలరేగి ఆడి ఆర్సీబీకి రెండోసారి కప్పు సాధించారు. ఓపెనర్ గ్రేస్ హారిస్ (9) తక్కువ స్కోరుకే వెనుతిరిగినప్పటికీ స్మృతి, జార్జియా రెండో వికెట్‌కు 92 బంతుల్లో 165 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి జట్టు విజయానికి బాటలు వేశారు. 19.4 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఆర్సీబీ లక్ష్యాన్ని ఛేదించింది. ఢిల్లీ బౌలర్లలో చినెల్లే హెన్రీ 2, మిన్ను మని, నందినీ శర్మ చరో వికెట్ తీశారు.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. కెప్టెన్ జెమీమా(57) అర్ధ సెంచరీతో ఆకట్టుకుంది. అలానే లారా వోల్వార్ట్(44), లిజెల్ లీ(37), చినెల్లే హెన్రీ (35), షఫాలీ వర్మ(20) కూడా రాణించడంతో ఢిల్లీ భారీ స్కోర్ చేసింది. ఇక ఆర్సీబీ బౌలర్లలో సయాలీ సత్ఘరే, అరుంధతి రెడ్డి, నాడిన్ డి క్లర్క్ తలో వికెట్ సాధించారు. లారా వోల్వార్ట్ రౌనౌటయింది.

ఢిల్లీ ఓపెనర్లరు లిజెల్ లీ, షఫాలీ వర్మలు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్(57) బెంగళూరు బౌలర్లపై విరుచకుపడింది. అయితే 72 పరుగు వద్ద లీ పెవిలియన్ చేరింది. అయినా జెమీమా తన దూకుడును తగ్గించలేదు. ఈ క్రమంలో లారా వోల్వార్ట్‌తో కలిసి 76 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. 148 పరుగుల వద్ద సయాలీ బౌలింగ్‌లో నాడిన్ క్లర్క్ కు క్యాచ్ ఇచ్చి మూడో వికెట్ గా జెమీమా ఔటైంది. చివర్లో లారా, హెన్రీ బెంగళూరు బౌలర్లకు చుక్కలు చూపించారు. వీరిద్దరూ దూకుడుగా ఆడటంతో ఢిల్లీ 203 పరుగుల భారీ స్కోర్ చేసింది. హెన్రీ 15 బంతుల్లో 35 పరుగులు చేసిందంటే.. ఏ రేంజ్ లో చెలరేగిందో అర్థం చేసుకోవచ్చు. బెంగళూరు బౌలర్లు ఎవ్వరూ ఆశించిన మేర రాణించలేదు. ఢిల్లీ బ్యాటర్ల వికెట్ తీసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

# పాక్ నిర్ణయంతో భారీ నష్టం: బంగ్లా

టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తటస్థ వేదికైన శ్రీలంకలో ఈ మ్యాచ్ జరుగుతున్నప్పటికీ పాక్.. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ మెగా టోర్నీ నుంచి బంగ్లాదేశ్‌ను ఐసీసీ తొలగించడంతో వారికి మద్దతుగా పాక్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే ఈ విషయంలో పాక్‌కు బంగ్లాదేశ్ షాకిచ్చింది. భారత్‌తో మ్యాచ్ ఆడబోమంటూ పాక్ తీసుకున్న నిర్ణయంపై బంగ్లాదేశ్ తొలిసారి స్పందించింది. ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ జరగకపోతే క్రికెట్ ప్రపంచం మొత్తం ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతుందని బంగ్లాదేశ్ సీనియర్ డైరెక్టర్ ఒకరు స్థానిక మీడియాతో అన్నారు. అలానే తమ వాటా కూడా తగ్గిపోతుందని, ఆర్థిక నష్టాన్ని చేకూర్చే ఇలాంటి విధానాలను తాము కోరుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. పాక్ వైఖరి ఇతర బోర్డుల నష్టం తెచ్చిపెట్టేలా ఉందని ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు. భారత్, పాక్ మ్యాచ్ వివాదం.. ఐసీసీ సెంట్రల్ రెవెన్యూ పూల్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ)కు చెందిన మరో సీనియర్ అధికారి కూడా వ్యాఖ్యానించారు.

# భారత్‌తో మ్యాచ్ ఆడం

**- పాక్ ప్రధాని**



టీ20 వరల్డ్ కప్–2026లో భారత్‌తో తమ జట్టు మ్యాచ్ ఆడబోదని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ మరోసారి ధ్రువీకరించారు. ఇస్లామాబాద్‌లో మంత్రివ ర్గాన్ని ఉద్దేశిస్తూ గురువారం మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మేం టీ20 వరల్డ్ కప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడబోమనే విషయంలో చాలా స్పష్టతతోనే నిర్ణయం తీసుకున్నాం. క్రీడల్లో రాజకీయాలు ఉండకూ డదు. మేం సరైన నిర్ణయమే తీసుకున్నామన్నారు. కానీ తమ జట్టు భారత్‌తో ఆడకపోవడానికి గల కారణాలను ఆయన వెల్లడించలేదు.

అయితే పాక్ నిర్ణయాన్ని ఐసీసీ ఇప్పటికే తప్పు పట్టింది. ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధమంది. ఎంపిక చేసిన మ్యాచ్‌లు మాత్రమే ఆడతామనడం సమంజసం కాదంది. అయినా పాక్ తన మంకుపట్టు వీడటం లేదు. పొట్టి ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకారం టీమ్ ఇండియాతో పాక్ ఈ నెల 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా మ్యాచ్ ఆడాల్సిఉంది. అయితే బంగ్లాదేశ్‌కు మద్దతుగా పొట్టి ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను ఆడబోమని పాకిస్థాన్ అంటోంది. అదే జరిగితే పాక్‌పై ఐసీసీ ఆంక్షలు విధించే అవకాశముంది. ఆర్థికంగానూ పాకిస్థాన్ తీవ్రంగా నష్టపోనుంది.

# మేం కొలంబో వెళతాం: సూర్య




టీ20 ప్రపంచ కప్ –2026లో భారత్‌తో తాము ఆడాల్సిన లీగ్ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించినప్పటికీ తాము మాత్రం కొలంబో వెళతామని టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చెప్పారు. షెడ్యూల్ ప్రకారం భారత్, పాక్ మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోలో జరగాల్సి ఉంది. మ్యాచ్ ఆడకూడదని పాక్ తీసుకున్న నిర్ణయంపై సూర్యకుమార్ యాదవ్ తాజాగా స్పందించాడు. పాకిస్థాన్ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించినా భారత జట్టు కొలంబోకు వెళ్తుందన్నాడు. వారి (పాకిస్థాన్) నిర్ణయం నా నియంత్రణలో లేదని భావిస్తున్నాను. ఆడాలా.. వద్దా అనేది వారి ఇష్టం. గత ఏడాది ఆసియా కప్‌లో మేం పాక్‌తో మూడు మ్యాచ్లు ఆడాం. మా మైండ్‌సెట్ చాలా క్లియర్గా ఉంది. పాకిస్థాన్‌తో ఆడబోమని మేం చెప్పలేదు. వారే వద్దనుకున్నారు. మ్యాచ్‌ను ఐసీసీ షెడ్యూల్ చేసింది. కొలంబో వెళ్లడానికి మాకు విమాన టికెట్లు కూడా బుక్ అయ్యాయి. ప్రస్తుతం మా దృష్టంతా ఫిబ్రవరి 7న యూఎస్ఏతో ఆడాల్సిన మ్యాచ్‌పైనే ఉందని అని సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నాడు.

# ఓపెనర్‌గా ఇషాన్‌కు లైన్ క్లియర్




టీ20 ప్రపంచ కప్–2026లో భారత జట్టు ఓపెనర్‌గా ఎవరు వస్తారనే ప్రశ్నకు సమాధానం దొరికింది. ఇటీవల టీమిండియా ఓపెనింగ్ స్థానంలో పలు కీలక పరిణామాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అసలు ఓపెనర్లుగా ఎవరు వస్తారనే సందేహం క్రికెట్ అభిమానుల్లో వ్యక్తమవుతోంది. అయితే భారత జట్టు తరపున ఒక ఓపెనర్‌గా అభిషేక్ శర్మ కన్‌ఫర్మ్ కాగా, మరో ఓపెనర్ ఎవరనే ప్రశ్నకు బుధవారం సౌతాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌తో సమాధానం దొరికినట్లయింది. నవీ ముంబయి వేదికగా బుధవారం భారత్, దక్షిణాఫ్రికా మధ్య టీ20 వరల్డ్‌కప్–2026 వార్మప్ మ్యాచ్ జరిగింది. ఇందులో అభిషేక్ శర్మకు తోడుగా ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఓపెనర్‌గా వచ్చిన సంజూ శాంసన్ వార్మప్ మ్యాచులో ఆడలేదు. అతడి స్థానంలో ఇషాన్ దిగాడు. ఓపెనర్‌గా వచ్చిన కిషన్ కేవలం 20 బంతుల్లోనే రెండు ఫోర్లు, ఏడు సిక్స్‌లతో 53 పరుగులు సాధించాడు. ఈ తుఫాన్ ఇన్నింగ్స్‌తో టీమిండియా ఓపెనర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. న్యూజిలాండ్ టీ20 సిరీస్‌లో విఫలమైన సంజూ.. పొట్టి ప్రపంచకప్‌లో ఆడే భారత తుది జట్టులో స్థానం దక్కించుకోవడంలోనూ విఫలమయ్యాడు.

***అనూహ్యంగా జట్టులోకి వచ్చి..***

ఇషాన్ కిషన్ కొంతకాలంగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. అయితే.. టీ20 ప్రపంచకప్ విషయంలో సెలెక్టర్ల దృష్టిలోనే లేడు. అయితే న్యూజిలాండ్ సిరీస్‌కు అనూహ్యంగా జట్టులోకి వచ్చిన కిషన్.. ఓపెనర్‌గా సంజూ విఫలమవుతుంటే.. వన్‌డౌన్‌లో వస్తూ మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడాడు. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 215 పరుగులతో సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అదే సమయంలో సంజూ శాంసన్ అయిదు టీ20ల్లో కలిపి కేవలం 46 పరుగులు మాత్రమే చేసి ఘోరంగా విఫలమయ్యాడు.

ఈ క్రమంలో తాజాగా ప్రకటించిన ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇషాన్ ఏకంగా 32 స్థానాలు ఎగబాకి, 32వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. దీంతో ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్‌లో సంజూ శాంసన్ బెంచ్‌కే పరిమితమై, ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడనే సంకేతాలు ఈ వార్మప్ మ్యాచ్‌తో వచ్చాయని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


# సంయుక్త జోరు!



ప్రముఖ కథానాయిక సంయుక్త కొత్త సంవత్సరంలో 'నారీ నారీ నడుమ మురారి' చక్కని విజయాన్ని అందుకుంది. దాంతో ఆమెలో సరికొత్త జోష్ నెలకొంది. అంతేకాకుండా ఈ ఏడాది సంయుక్త నటించిన పలు క్రేజీ ప్రాజెక్ట్స్ విడుదల కాబోతున్నాయి. నిఖిల్ సరసన సంయుక్త నటించిన నాయికగా నటించిన పాన్ ఇండియా మూవీ 'స్వయంభూ' ఏప్రిల్ 10న విడుదల కాబోతోంది. అలానే పూరి జగన్నాథ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ స్ట్రీట్' కూడా వేసవి కానుకగా విడుదల కాబోతోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతి హీరోగా నటిస్తున్నారు.

ఇదిలా ఉంటే సంయుక్త తొలిసారి హీరోయిన్ సెంట్రిక్ మూవీ 'ది బ్లాక్ గోల్డ్'లో నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. ఈ మూవీలోని భారీ యాక్షన్ సీక్వెన్స్ లో సంయుక్త డూప్ సాయం లేకుండా నటిస్తోంది. ఈ స్టంట్స్ షూటింగ్ లో అవుతున్న గాయాలను సైతం ఆమె పట్టించుకోవడం లేదట. సంయుక్త కెరీర్ లో 'ది బ్లాక్ గోల్డ్' ఒక స్పెషల్ మూవీగా నిలవనుందని దర్శకుడు యోగేష్ కె.ఎం.సి. చెబుతున్నారు. ఇది కూడా పాన్ ఇండియా యాక్షన్ డ్రామానే రూపుదిద్దుకుంటోంది. మాగంటి పిక్చర్స్ భాగస్వామ్యంతో హాస్య మూవీస్ బ్యానర్‌పై రజేష్ దండా దీనిని నిర్మిస్తున్నారు. ఈ సమ్మర్ లోనే ఈ సినిమా రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ చిత్రంలో మురళీ శర్మ, రావు రమేష్, నాజర్, మనీష్ వాధ్వా ఇతర కీలకపాత్రలు చేస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో 'ది బ్లాక్ గోల్డ్' సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

## డబ్బు సంపాదించాలంటూ
# నా భార్య ఇంట్లోంచి గెంటేసింది..



కొవిడ్ సమయంలో తన ఇంట్లో జరిగిన ఒక విషయాన్ని నటుడు మాధవన్ తాజాగా గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తాను ఇంట్లో ఉండడం చూసి భార్య సరిత ఇంట్లో నుంచి బయటకు గెంటేసిందంటూ సరదాగా చెప్పారు. ప్రస్తుతం వరుస సినిమాలతో అలరిస్తున్న ఆయన ఓ ఆంగ్ల మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ఈ విషయాన్ని పంచుకున్నారు. కొవిడ్ సమయంలో ఇంట్లో ఖాళీగా ఉన్నాను. అప్పుడు నా భార్య వచ్చి.. నువ్వు ఇలా ఖాళీగా ఉండడం ఎప్పుడూ చూడలేదు. ఏదో వర్క్ చేస్తూనే ఉంటావు. కామెడీ, యాక్షన్ సినిమాలు, ఓటీటీ ఏదో ఒక ప్రాజెక్ట్ నటిస్తూనే ఉంటావు. ఇప్పుడు ఇంట్లోనే ఉంటున్నావంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. గతంలో ఉన్నంత ఉత్సాహంగా కనిపించడం లేదు. వర్క్‌కు వెళ్లినా త్వరగా ఇంటికి వచ్చేస్తున్నావు. నువ్వు బాగానే ఉన్నావా. ఎప్పటిలానే బయటకు వెళ్లి, డబ్బులు సంపాదించు..అని చెప్పింది. ఆ మాటలు తనలో కొత్త ఆలోచనలు కలిగించాయని మాధవన్ చెప్పారు. అయితే ఆయన ఈ విషయాన్ని సరదాగా వెల్లడించారు. నా భార్య కొవిడ్ సమయంలో డబ్బు సంపాదించమని నన్ను గెంటేసింది అని చెప్పడంతో ఈ కామెంట్స్ వైరల్‌గా మారాయి.

ఇటీవల మాధవన్ తన కెరీర్లో విరామం తీసుకోవడం గురించి మాట్లాడారు. 2011 నుంచి 2015 వరకూ విరామం తీసుకున్న ఆయన 2016లో 'సాలా ఖదూస్' తో తిరిగి అలరించడం ప్రారంభించారు. పనిపై ఆసక్తి తగ్గడంతో నాలుగేళ్లు విరామం తీసుకున్నట్లు వివరించారు.

# తప్పయింది.. విచారిస్తున్నాం!



ఈటీవీ ప్రభాకర్ తనయుడు, యాటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ 'బరాబర్ ప్రేమిస్తా' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాడిన బూతు పాటపై వివాదం రేగుతోంది. నెటిజన్స్‌తోపాటు సినిమా రంగానికి చెందిన వారు సైతం నిరసన వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు జేడీ చక్రవర్తి కూడా తన ఆవేదనను వ్యక్తం చేశాడు. వేదిక మీద చంద్రహాస్ ఆ పాట పాడుతున్నప్పుడే కార్యక్రమం నుండి లేచి వచ్చేయాల్సిందని, కానీ నిర్వాహకుల కోరిక మేరకు తాను రాలేకపోయానని వివరణ ఇచ్చుకున్నాడు.

ఇదిలా ఉంటే మరో ఇరవై నాలుగు గంటల్లో సినిమా విడుదల కాబోతుండగా సోషల్ మీడియాలో చెలరేగిన ఈ వివాదంతో చిత్ర నిర్మాత చిన్ని,దర్శకుడు సంపత్ రుద్ర ఇబ్బందుల్లో పడ్డారు. దాంతో వారు సోషల్ మీడియా ముఖంగా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హీరో చంద్రహాస్ తన పాత్రను గురించి చెప్పే క్రమంలో ఓ పాట పాడాడని, అయితే అతను ఆ పాట పాడుతున్న విషయం కానీ, అందులో ఉన్న పదాలను గురించి గానీ అక్కడ ఉన్న వారెవరికీ తెలియదని, చంద్రహాస్ చేసిన దానికి తాము బాధపడతున్నామని నిర్మాత చిన్ని చెప్పారు. అలానే దర్శకుడు సంపత్ రుద్ర మాట్లాడుతూ చంద్రహాస్ పాడిన పాటలోని పదాలేవీ సినిమాలో ఉండవని, ఇది క్లీన్ మూవీ అని, చంద్రహాస్ అలా పాట పాడినందుకు విచారాన్ని తెలియచేస్తున్నామన్నారు.

ఇదిలా ఉంటే చంద్రహాస్ తనను బెదిరిస్తూ చేసిన వీడియోపై జర్నలిస్ట్ అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలోనూ పలువురు ప్రముఖులు చంద్రహాస్ చర్యను నిరసిస్తూ పోస్టులు పెట్టారు. అయితే... వాటిని లెక్కలోకి తీసుకో కుండా చంద్రహాస్ తన చర్యలను సమర్థించుకోవడాన్ని వారు మరింత తీవ్రంగా పరిగణిస్తున్నారు.

మరోవైపు చంద్రహాస్ ఆ పాట పాడే సమయంలో అక్కడే ఉన్న నటుడు జేడీ చక్రవర్తి కూడా దీనిపై ఆయన స్పందించారు. ఆ రోజు తాను ఆ ఈవెంట్ నుంచి వెళ్లిపోవాల్సిందని అభిప్రాయపడ్డారు. సినిమా ప్రమోషన్లు విభిన్నంగా చేయడం తప్పు కాదని.. కానీ, అవి మహిళలను కించపరిచేలా, అసభ్యంగా ఉండకూడదన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు.

# ఓటీటీలో మరో మళయాళ థ్రిల్లర్




మలయాళ సినిమాలకు తెలుగులోనూ క్రేజ్ ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఎన్నో మలయాళ చిత్రాలు తెలుగు ఆడియన్స్‌కు థ్రిల్ పంచాయి. మరో కొత్త సినిమా ఓటీటీ వేదికగా అలరించేందుకు సిద్ధమైంది. అదే 'బేబీ గర్ల్'మూవీ. 'సోనీ లివ్' లో ఈ నెల 12 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈవివరాలను ప్రకటిస్తూ సదరు సంస్థ మూవీ ట్రైలర్ను విడుదల చేసింది.

ఇదొక థ్రిల్లర్. నివిన్ పౌలీ కథానాయకుడిగా దర్శకుడు అరుణ్ వర్మ తెరకెక్కించారు. ఇప్పటికే థియేటర్లలో మలయాళ ప్రేక్షకులను థ్రిల్ చేసింది. ఆస్పత్రి నుంచి ఓ చిన్నారి ఎలా అదృశ్యమైందన్న పాయింట్తో రూపొందిన సినిమా ఇది. తిరువనంతపురం నేపథ్యంలో సాగుతుంది. క్రిస్మస్ నాడు ఓ హాస్పిటల్ నుంచి చిన్నారి అపహరణకు గురవుతుంది. అదే ఆస్పత్రిలో పనిచేసే మ్యాథ్యూ (నివిన్ పౌలీ)ను విచారణలో భాగంగా పోలీసులు అనుమానిస్తారు. మరి, ఆ బేబీని ఎవరు కిడ్నాప్ చేశారు? అసలు ఎందుకు అపహరించారు? అనేవి ఈ కథలో కీలకాంశాలు.

# 'స్కై' విడుదల వాయిదా

మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ భారతి ప్రధాన పాత్రల్లో నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృధ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'స్కై'. దీనికి పృధ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ మ్యూజిక్ డైరెక్టర్‌గా తెలుగు సినిమా రంగం లోకి అడుగుపెడుతున్నాడు. ఫిబ్రవరి 6న విడుదల కావాల్సి ఉన్న ఈ సినిమా ఒక వారం ఆలస్యంగా 13వ తేదీ రిలీజ్ కాబోతోంది. ఈ విషయాన్ని తెలియచేస్తూ మేకర్స్ ఓ లేఖను విడుదల చేశారు. ఇద్దరు ప్రేమికుల మధ్య ఊహించిన విభేదాలు తలెత్తినప్పుడువారు వాటిని ఎలా పరిష్కరించుకుని తిరిగి దగ్గరయ్యారనే కథాంశంతో 'స్కై' మూవీ రూపుదిద్దుకునిన్నట్లుగా దీని ట్రైలర్ చూసినప్పుడు అర్థమౌతోంది. ఇందులో తండ్రీ కొడుకుల అను బంధానికీ పెద్ద పీట వేశారని తెలు స్తోంది. ఈ ప్రేమకథా చిత్రానికి రసూల్ ఎల్లోర్ సినిమాటోగ్రఫీ అందించగా, శివప్రసాద్ స్వరాలు సమకూర్చారు. దర్శకుడు పృధ్వీ పెరిచెర్లనే ఈ సినిమాకు సాహిత్యం అందించారు.

# అందుకే అలా చెప్పా..!

బలమైన కథలు, భారీ సెట్టింగ్‌లకు ఒకప్పుడు పెట్టింది పేరు దర్శకుడు గుణ శేఖర్. బాలరామాయణం, చూడాలని ఉంది, ఒక్కడు లాంటి సినిమాలతో సత్తా చాటిన ఆయనఇప్పుడు యువతరం కథతో 'యుఫోరియా' తెరకెక్కించారు.ఇటీవల ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా మరో జన్మంటూ ఉంటే దర్శకుడిగా పుట్టను అని వ్యాఖ్యానించారు. డైరెక్టర్‌గా ప్రతిభ దాటిన మీరు ఇలా ఎందుకు మాట్లాడాల్సి వచ్చింది.. ట్రోలింగ్ కారణమా అని గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రశ్నించగా గుణశేఖర్ సమాధానమిచ్చాడు. ట్రోలింగ్ సమస్య కాదు. ఇది ఎప్పుడూ ఉంటుంది. దర్శకుడి ఒత్తిడి గురించి చెబుతూ ఆ మాట అన్నాను. డైరక్టర్ సీటులో కూర్చున్న ఎవరికైనా స్ట్రెస్ తప్పదు. ఏ ఉద్యోగంలోనైనా తృప్తి ఉంటుంది గానీ దర్శకులకు ఉండదు. తృప్తి ఉంటేనే కంటినిండా శుభ్రంగా నిద్ర పడుతుంది. అలాంటి నిద్రను 1992లో వదిలేసిన నేనే ఇప్పటికీ ఇలాగే బాధపడుతున్నా. హాయిగా వచ్చే జన్మలోనైనా నిద్రపోవాలన్న ఉద్దేశంతో డైరెక్టర్‌గా పుట్టను అన్నానని వివరణ ఇచ్చారు. భూమిక, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'యుఫోరియా' శుక్రవారం (ఫిబ్రవరి 6) విడుదం కానుంది.

ముందుగా కొన్ని సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీయాలని మొదలు పెట్టానని, అయితే లోతుగా వెళ్లే కొద్దీ అన్ని నగరాల్లోనూ, విదేశాల్లోనూ ఇలాంటి ఘటనలు జరిగినట్లుగా తెలిసింది. ఈ సినిమాలోని సన్నివేశాలు వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలను గుర్తుచేస్తాయి. కొత్త తరం టేకింగ్ తో కూడిన ఈసినిమాను నాకమార్తె నీలిమ తెరకెక్కించిందని చాలామంది అనుకుంటున్నారు (నవ్వుతూ). ఇది కొత్తతరం స్టోరీ, అందుకు తగ్గట్టే తీశా. నేనెప్పుడూ అప్‌డేట్‌గా ఉంటాను కాబట్టే ఆ విధంగా తీయగలిగానని గుణశేఖర్ చెప్పారు.ప్రీ రిలీజ్ ఈవెంట్ చేద్దామనుకున్నామని, అయితే ముఖ్య అతిథిగా అనుకున్న అల్లు అర్జున్.. ముంబయిలో అట్లీ సినిమాతో బిజీగా ఉండటంతో కుదరలేదని చెప్పారు. పోక్సో చట్టం ఎంత పవర్‌ఫుల్ అనేది 'యుఫోరియా' చెబుతుంది. ఈ సినిమా చూసిన తరువాత తప్పు చేయాలంటే ఎవరైనా సరే వణికిపోతారని గుణ శేఖర్ చెప్పారు.

